జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | సోమవారం 13 ఏప్రిల్ 2026 | సంపుటి: 19 | సంచిక: 36 | పేజీలు: 12 | వెల: రూ.5

RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , వైశాఖ మాసము , తిథి: షష్టి - 19:05:09 వరకు నక్షత్రంమూల - నిండా రాత్రి వరకు కరణంవణిజ - 19:05:09 వరకు పక్షంకృష్ణ యోగంవారీయన - 17:09:13 వరకు వారం

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## జులై 3 నుంచి అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం

**ఏప్రిల్ 15వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్లు షురూ**

దక్షిణ కశ్మీర్‌లోని హిమాలయ పర్వతాల్లో అత్యంత ఎత్తులో ఉన్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అమర్‌నాథ్ యాత్ర షెడ్యూల్ ఖరారైంది. ఈ ఏడాది జులై 3న ప్రారంభమై దాదాపు 57 రోజుల పాటు కొనసాగే ఈ యాత్ర

మిగతా1 2లో..

## మణిపూర్‌లో భద్రతా దళాలు భారీ ఆపరేషన్..

**21 బంకర్లు ధ్వంసం, 13 ఐఈడీలు స్వాధీనం..!**

మణిపూర్‌లో కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో భద్రతా దళాలు భారీ ఆపరేషన్ నిర్వహించాయి. శనివారం (ఏప్రిల్ 11, 2026) నాడు రాష్ట్రంలోని ఉఖ్రుల్, టెంగ్నౌపాల్ జిల్లాల్లో జరిపిన దాడుల్లో తిరుగుబాటుదారుల

మిగతా 2లో..



# కుదరని సయోధ్య

- అమెరికా-ఇరాన్ మధ్య చర్చలు విఫలం
- అర్ధంతరంగా చర్చనుండి వెళ్లిపోయిన అమెరికా
- ఇరు పక్షాల మధ్య కుదరని ఏకాభిప్రాయం
- 21 గంటలకు పైగా తీవ్రంగా సాగిన చర్చలు
- అణు ఆయుధాలపై అమెరికా ప్రధాన డిమాండ్
- ఇరాన్‌తో ఒప్పందం కుదరలేదు: జేడీ వాన్స్
- అమెరికా వల్లే చర్చలు విఫలం : ఇరాన్
- ఇరాన్ రేవుల దిగ్బంధనం చేసిన అమెరికా
- చమురు నౌకల రాకపోకలపై ఆంక్షలు!!



ప్రపంచమంతా ఆసక్తిగా ఎదురుచూసిన అమెరికా-ఇరాన్ చర్చలు విఫలమయ్యాయి. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో జరిగిన చర్చలను ముగించి అమెరికా బృందం వెనక్కి వెళ్లిపోయింది. ఇరు పక్షాలు ఎలాంటి ఒప్పందం కుదరలేదు. ఈ విషయాన్ని స్వయంగా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ప్రకటించారు. 21 గంటలకు పైగా తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ చర్చలు విఫలయ్యాయని ప్రకటించారు. మరోవైపు ఇరాన్ మాత్రం అమెరికా డిమాండ్ల కారణంగానే ఈ చర్చలు విఫలమయ్యాయని పేర్కొంది. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో జరిగిన చర్చలు అనంతరం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ జేడీ వాన్స్ ఇరు పక్షాల మధ్య ఎలాంటి ఒప్పందం కుదరలేదని తెలిపారు. '21 గంటలపాటు మేం చర్చలు జరిపాం. చాలా ముఖ్యమైన అంశాలపై చర్చించాం. ఇది మంచి విషయం. కానీ దురదృష్టవశాత్తూ ఎలాంటి ఒప్పందం కుదరలేదు. ఇది అమెరికాకు కంటే ఇరాన్‌కు ఎక్కువ నష్టం. అమెరికా తన పరిమితులు ఏమిటో, ఎక్కడ సడలింపులు ఇస్తామో, ఎక్కడ ఇవ్వమో అన్ని అంశాల గురించి స్పష్టంగా చేశాం.

మిగతా 2లో..

# 83.72 శాతంతో మేడ్చల్ టాప్..




- **ఇంటర్ లో 75.34% శాతం ఉత్తీర్ణత**
- **ఫలితాల్లో బాలికలు గణనీయమైన పైచేయి**
- **నెల రోజుల్లోనే సప్లిమెంటరీ పరీక్షలు**
- **తెలంగాణ ఇంటర్ ఫలితాలు విడుదల**

తెలంగాణ ఇంటర్మీడియట్ ఫలితాలు 2026 విడుదలయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ, ముఖ్యమంత్రి తరపున పాసైన విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఫలితాల్లో బాలికలు గణనీయమైన పైచేయి సాధించారు. రెండవ సంవత్సరం జనరల్ విభాగంలో 75.61% మంది విద్యార్థులు ఉ

మిగతా 2లో..

నిబంధన సవరణతో సాదాబైనామా

## పరిష్కారాలు

తహసీల్దార్ నుంచి ఆర్డీవోకు అధికారం



తెలంగాణలో భూ క్రయవిక్రయదారులు ఇద్దరూ అఫిడవిట్ సమర్పించాలన్న నిబంధనను సవరించడంతో తిరిగి సాదాబైనామాల పరిష్కారాలు తాజాగా ప్రారంభం అయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా లక్షల సంఖ్యలో రైతులు తమ భూముల క్రమబద్ధీకరణ కోసం ఎదురుచూస్తున్నారు. రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ విచారణాధికారిగా సాదాబైనామాల దరఖాస్తుల పరిశీలన కొనసాగుతోంది. 2020 అక్టోబరు-నవంబరులో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 9 లక్షల మంది రైతుల నుంచి సాదాబైనామా సమస్యపై దరఖాస్తులు ప్రభుత్వానికి

మిగతా 2లో..

## గాయని ఆశా భోస్లే కన్నుమూత..

**ముంబైలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి**

**నేడు ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు**



ప్రముఖ గాయని ఆశా భోస్లే 92 ఏళ్ల వయసులో ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆసుపత్రిలో గుండెపోటుతో అడ్మిట్ అయ్యారు . ఆమె చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. దీంతో సంగీత ప్రపంచం అంతా ఒక్కసారిగా మూగబోయినట్లైంది. మరోవైపు ఆదివారం రోజున ఆశా భోస్లే మనవరాలు జానై భోస్లే తన ఆరోగ్య పరిస్థితి గురించి తెలియజేస్తూ, తనకు ప్రస్తుతం చికిత్స జరుగుతోందని పేర్కొన్నారు. వైద్యంకు మెల్లగా రెస్పాండ్ అవుతుందన్నారు .ఈ ప్రకటన చేసిన కొన్ని గంటలలోనే ఆశా భోస్లే తుదిశ్వాస విడిచారని కుటుంబ సభ్యులు ప్రకటించారు. దీంతో సెలబ్రిటీలు, రాజకీయ నేతలు, అభిమానులు ఒక్కసారిగా శోకసంద్రంలో మునిగిపోయారు.

మిగతా 12లో..

# బీఆర్ఎస్‌గా మార్చి చాలా నష్టపోయాం



- **తిరిగి 'టీఆర్ఎస్'గా మార్పు!!**
- కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపే యోచన
- త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర
- వచ్చే ఎన్నికల్లో ఎవరితోనూ పొత్తు లేదు
- జైలుకు వెళ్తేనే సీఎం అవుతారనేది భ్రమ
- స్వయంశక్తితోనే మళ్లీ అధికారంలోకి వస్తాం
- ప్రజాక్షేత్రంలోనే నిరూపించుకుంటాం
- 30 నెలలు దాటినా ఆరు గ్యారంటీలు ఎక్కడ?
- క్యాతన్ పల్లిలో కాంగ్రెస్ నీచ రాజకీయాలు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్ రాజకీయ వర్గాల్లో పెను సంచలనం సృష్టిస్తోంది. గత ఎన్నికల ఓటమి తర్వాత పార్టీని మళ్లీ గాడిలో పెట్టేందుకు ఆయన సిద్ధం చేసిన కార్యాచరణను ఈ సందర్భంగా బయటపెట్టారు.బీఆర్ఎస్ పార్టీ పేరు మార్పు గురించి కేటీఆర్ అత్యంత కీలకమైన వ్యాఖ్యలు చేశారు. టీఆర్ఎస్ పేరును బీఆర్ఎస్ గా మార్చడం వల్ల పార్టీకి నష్టం చేకూరిందని ఆయన అంగీకరించారు. ప్రజల్లో బలంగా నాటుకుపోయిన తెలంగాణ సెంటిమెంట్ పార్టీ పేరు మారడంతో

మిగతా 2లో..

## బెంగాల్‌లో యూసీసీని అమలు చేస్తాం

**అమిత్ షా సంచలన వ్యాఖ్యలు**

బెంగాల్‌లోని చట్నా అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగిన ఒక ర్యాలీలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా సంచలన వ్యాఖ్యలు చేశారు. టీఎంసీ అవినీతి కారణంగా అవకాశాలు కోల్పోయిన యువతకు బీజేపీ వయో సడలింపు కల్పిస్తుందని అన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉమ్మడి పౌర స్మృతిని అమలు చేస్తామన్నారు. అందరికీ ఒకే చట్టం ఉంటుంది, ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు, విధులు

మిగతా 12లో..

## మాడు పగిలే మండుటెండలు..

**వడగాలులు, ఉక్కపోతతో ప్రజలు తీవ్ర అవస్థలు**

**తెలుగు రాష్ట్రాలకు తీవ్ర వడగాల్పుల హెచ్చరిక**

ఎండలు, వడగాల్పులపై ఏపీకి వాతావరణశాఖ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. రాష్ట్రంలో ఎండ ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశముందని, అప్రమత్తంగా ఉండాలని వార్నింగ్ ఇచ్చింది. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా 51

మిగతా 12లో..

# అక్రమార్కులను వదిలిపెట్టబోము

- వారికి సహాయం చేసే వారిని వదిలిపెట్టబోము
- బర్ధమాన్‌లో వేలాది మందితో ర్యాలీ
- మే 4న వెలువడే ఫలితాలకు ట్రైలర్ మాత్రమే
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు



పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండటంతో రాజకీయ సందడి పెరుగుతోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కట్వా నుండి బెంగాల్ ప్రజల మనోభావాలను వివరిస్తూ ఒక వీడియోను పంచుకున్నారు. తన వెనుక ఉన్న జనసమూహాన్ని చూపిస్తూ, "దేశవాసులారా, మీరు బెంగాల్ ప్రజల మనోభావాలను చూడవచ్చు" అని ఆయన అన్నారు. కొన్ని రోజుల క్రితం బీహార్, మహారాష్ట్ర, హర్యానాలలో మనం చూశామని, ఎక్కడైతే అధిక సంఖ్యలో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వచ్చారో, మహిళలు ఓటు వేయడానికి ముందుకు వచ్చారో, అక్కడ బీజేపీ-ఎన్డీఏ భారీ మెజారిటీతో గెలిచిందని ప్రధాని మోదీ అన్నారు.బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలకు ఏప్రిల్ 23, 29 తేదీలలో రెండు దశల్లో పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పశ్చిమ బెంగాల్‌లోని పూర్బ బర్ధమాన్ జిల్లా,

మిగతా 2లో..

# సంపాదకీయం

## ఆత్మరక్షణలో కాంగ్రెస్ !

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బిఆర్ఎస్ అవినీతి కొట్టుకు పోయింది. వారిని విచారిస్తామన్న కేసులు వెనక్కి పోయాయి. కాళేశ్వరం, కార్ రేసు, ధరణివంటి వన్నీ ఇప్పుడు వెనక్కి పోయాయి. పదేపదే బిఆర్ఎస్ నేతలపై అవినీతి ఆరోపణలు చేసిన సిఎం రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు అయినా బిఆర్ఎస్ నేతల అవినీతి గురించి నిరూపించలేకపోయారు. ఇది యాదృచ్ఛికమా లేక మరేదైనా కారణం ఉందా అన్నది తెలియదు. ఈ క్రమంలో కాంగ్రెస్ మంత్రులపై అవినీతి అంశం తెరపైకి వచ్చింది.మంత్రులం దరిపైనా అంతో ఇంతో బురదపడుతూనే ఉంది. ప్రధానంగా మంత్రి పొగులేటిపై విపరీతమైన ఆరోపణలు వస్తున్నాయి. వాటిని ఆయన ఖండిస్తున్నా...ప్రజల్లో నమ్మకం కలగడం లేదు. తమపై బురదజల్లుతున్నారని మంత్రులు పొంగులేటి తదితరులు అంటున్నారు. నిప్పులేనిదే పొగరాదు. ప్రభుత్వంలో ఉంటూ అవినీతి గురించి ఆరోపణలు వచ్చినప్పుడు నేరుగా స్పందించాలి. నిజనిర్ధారణ జరగాలి. ముఖ్యంగా నాదర్‌గుల్ భూములపై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. ఆయన తనయుడకి భాగం ఉందని ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో అక్కడి భూములు ప్రభుత్వానివే అయితే చర్యలు తీసుకుని ఉంటే నమ్మకం కలిగేది. కానీ అలా జరగలేదు. ఇవి ప్రభుత్వ భూములే అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మీడియా సమావేశంలో చెప్పి కంపెనీలకు వత్తాసు పలికారే గానీ రైతుల గురించి ఒక్కమాటైనా చెప్పలేదని తాజాగా రైతులు నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష నేతలను విమర్శించడం కాదు, రైతులకు ఏం చేస్తదో చెప్పాలని పట్టుబట్టారు. అధికారంలో ఉన్నది కాంగ్రెస్ పార్టీయే కదా.. మీరే న్యాయం చేయించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో నాదర్‌గుల్ రైతులు కదంతొక్కారు. దశాబ్దాలుగా సాగుచేసుకుంటున్న భూములకు దూరమై భూపోరాటానికి దిగిన రైతు కుటుంబాలు.. శుక్రవారం మరోసారి తమ భూముల వద్దకు వెళ్లి ప్రైవేట్‌సైన్యంపై విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ నేతలను కడిగిపారేసిన నాదర్‌గుల్ రైతులు ఃాజకీయాలు చేయడం మానుకొని రైతులకు ఎలా న్యాయం చేస్తారో చెప్పాలని నాదర్‌గుల్ రైతులు కాంగ్రెస్ నేతలకు తెగేసి చెప్పారు. ప్రతిరోజూ రైతులు వంటావార్పుతో పాటు పలు రీతుల్లో నిరసన కొనసాగిస్తుండగా భూపోరాటానికి బీఆర్ఎస్ సహా వామపక్ష పార్టీలు, ఇతర ప్రజాసంఘాలు వారికి మద్దతు పలికాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నేతలు సైతం సంఘీభావం తెలుపుదామని భావించారు. మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నేతల ఆదేశానుసారం స్థానిక నాయకులు శుక్రవారం రైతుల వద్దకు వెళ్లి సమావేశం ఏర్పాటు చేశారు. వచ్చీరాగానే గత బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డిపై ఆరోపణలు గుప్పించడంతో రైతులు అడ్డుకున్నారు. రెండున్నరేండ్లుగా భూముల్లోకి వెళ్లనివ్వకుండా ప్రైవేట్ కంపెనీలు ఇబ్బందులు పెడుతుంటే ఎందుకు పట్టించుకోలేదని రైతులు నిలదీశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ పెద్దల వద్దకు వెళ్తే ఎవరూ న్యాయం చేయలేదని, గోడు వినలేదని ప్రశ్నించారు. రైతులు మాటలతో ఎదురుదాడి చేయడంతో హస్తం నేతలు కంగుతిన్నారు. ఏదో అనుకుంటో ఏదో జరిగిందని వారి ప్రశ్నలకు సమాధానం చెప్పకుండానే వెనుదిరిగారు. వాస్తవానికి రైతుల్లో విభేదాలు సృష్టించేందుకే కాంగ్రెస్ నేతలు వచ్చారని పలువురు రైతులు ఆరోపించారు.ఆ కంపెనీలు వేసిన రేకుల కంచెను దాటుకొని, పోలీసులు, బౌన్సర్లను సైతం లెక్క చేయకుండా భూముల్లోకి చొచ్చుకొని వెళ్లారు. ఈ అనూహ్య పరిణామాలతో అక్కడ కొన్ని గంటల పాటు ఉద్రిక్తత నెలకొన్నది. తమకు సంఘీభావం తెలిపేందుకు వచ్చిన ధర్మసమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహరాజ్‌ను తీసుకొని లోపలికి పోయేందుకు రైతులు ప్రయత్నించగా పోలీసులు మెయిన్ గేటు వద్దే నిలువరించారు. చాలాసేపు వాగ్వాదం చేసిన తర్వాత గేటు తీసి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు తాళ్లు పట్టుకొని గేటుకు అడ్డుగా రక్షణ వలయంగా నిల్చున్నా రైతులు లెక్క చేయలేదు.ఎన్ని కేసులు పెట్టుకుంటారో పెట్టుకోండి అంటూ ముందుకు తోసుకుంటూ వెళ్లారు. లోపలి వైపు ప్రైవేట్ సైన్యం గేటును అదిమిపట్టినా రైతులు పట్టువీడకపోవడంతో ఒక్కసారిగా గేటు తెరుచుకుంది. దీంతో పదుల సంఖ్యలో రైతులు లోపలికి వెళ్లి బౌన్సర్లను తరిమికొట్టారు. ఒకేసారి పెద్ద ఎత్తున రైతులు రావడంతో బౌన్సర్లు భయంతో భూముల్లోకి పరుగులు తీశారు. రెండేండ్లుగా తమల్ని తమ భూముల్లోకి వెళ్లనివ్వకుండా అడ్డుకుంటున్న బౌన్సర్లపై తీవ్ర ఆగ్రహంతో ఉన్న రైతులు వారిని ఉరికించారు. ఈ క్రమంలో కొంతమంది బౌన్సర్లు గుంతల్లో పడిపోగా మరికొందరిని రైతులు పట్టుకొని దాడి చేసేందుకు ప్రయత్నించడంతో పరిస్థితి గందరగోళంగా మారింది. అయితే ఎవరిపైనా దాడులు చేయొద్దని విశారదన్ మహరాజ్ వచ్చి రైతుల్ని వారించి, బౌన్సర్లను అక్కడినుంచి పంపించారు. ఆ తర్వాత రైతులు భూముల వద్దకు వెళ్లి ప్రైవేట్ కంపెనీలు ధ్వంసం చేసిన బోర్లను, బావులను పూడ్చిన తీరును విశారదన్ మహరాజ్‌కు చూపించారు. పొలాల కోసం వేసుకున్న పైపులను కూడా ధ్వంసం చేశారని, కాలువలను లేకుండా చేశారని, కరెంటు వైర్లను తగులబెట్టారని రైతులు వాటిని చూపుతూ ఆవేదన చెందారు. చాలాకాలం తర్వాత పొలాల్లోకి వెళ్లినందుకు రైతులంతా సంతోషం వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వంలో చలనం లేదు. మొన్న వట్టినాగుల పల్లి, ఇవాళ నాదర్‌గుల్ భూముల విషయంలో ప్రభుత్వం తీరుపై అనుమానాలు ఉన్నాయి. వీటిపై నిజాలు చెప్పాల్సిన బాధ్యత సిఎం రేవంత్ రెడ్డిపై ఉంది.

# అక్రమార్కులను వదిలిపెట్టబోము

మొదటిపేజీ తరువాయి..

కట్వాలో ఒక బహిరంగ సభలో ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ, "చొరబాటుదారులు తమ సామాను సర్దుకోవడం ప్రారంభించాలి; ఇప్పుడు వెళ్ళిపోవాల్సిన సమయం. అక్రమ వలసదారులకు సహాయం చేసే వారిని వదిలిపెట్టబోము" అని అన్నారు.బర్ధమాన్‌లో వేలాది మందితో జరుగుతున్న ఈ ర్యాలీ బెంగాల్‌లో కూడా జరగబోతోందని ప్రధాని మోదీ అన్నారు. ఈ దృశ్యం మే 4వ తేదీన వెలువడే ఫలితాలకు ఒక ట్రైలర్ లాంటిదన్నారు. "ఈ ఎన్నికలలో మీ ఉత్సాహాన్ని, మీ శక్తిని, మీ సంకల్పాన్ని నేను చూస్తున్నాను... ఇది భయంపై విశ్వాసం సాధించిన విజయానికి ఒక ప్రకటన. బెంగాల్ మార్పునకు సిద్ధంగా ఉంది. అస్సాం, కేరళ, పుదుచ్చేరిలలో ఇప్పటికే పోలింగ్ జరిగింది. అక్కడ భారీగా ఓటర్లు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో మహిళలు ఓటు వేశారని" ప్రధాని మోదీ అన్నారు. టీఎంసీపై ఉన్న భయాన్ని తొలగించి, దానిని విశ్వాసంగా మార్చడమే మోదీ గ్యారెంటీ అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ గ్యారెంటీని ఎలా నెరవేరుస్తారనేది బీజేపీ మేనిఫెస్టోలో ఉంది. అవినీతి, శాంతిభద్రతలపై బీజేపీ ఒక శ్వేతపత్రాన్ని విడుదల చేస్తుందని, తద్వారా ప్రతి టీఎంసీ గూండా, ప్రతి అవినీతిపరుడైన ఎమ్మెల్యే, మంత్రిని చట్టపరంగా జవాబుదారీగా చేయవచ్చని ఆయన అన్నారు.

# బీఆర్ఎస్‌గా మార్చి చాలా నష్టపోయాం



మొదటిపేజీ తరువాయి..

కొంత పలచబడిందని భావిస్తున్న ఆయన, పార్టీని తిరిగి 'టీఆర్ఎస్'గానే మార్చాలనే ఆలోచనలో ఉన్నట్లు స్పష్టం చేశారు. ఇది కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపే అంశంగా భావిస్తున్నామన్నారు. గత పదేళ్ల పాలనలో ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య దూరం పెరిగిందని కేటీఆర్ ఒప్పుకున్నారు. ఈ అంతరాన్ని తగ్గించేందుకు త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేపట్టనున్నట్లు ప్రకటించారు. నేరుగా ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకోవడమే తన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత అసెంబ్లీ స్థానాలు పెరుగుతాయని, అప్పుడు తాను ఏ నియోజకవర్గం నుంచైనా పోటీ చేసేందుకు సిద్ధమని ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో ఎవరితోనూ పొత్తు పెట్టుకోబోమని కేటీఆర్ తేల్చి చెప్పారు. ముఖ్యంగా బీజేపీతో పొత్తు ఉంటుందనే ప్రచారాన్ని ఆయన ఖచ్చితంగా కొట్టిపారేశారు. జైలుకు వెళ్తేనే సీఎం అవుతారనేది ఒక భ్రమ అని వ్యాఖ్యానిస్తూ, ప్రత్యర్థులపై విమర్శలు గుప్పించారు. స్వయంశక్తితోనే మళ్లీ అధికారంలోకి వస్తామని, ప్రజాక్షేత్రంలోనే తమ బలాన్ని నిరూపించుకుంటామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ రాజకీయాలు ప్రస్తుతం కాక రేపుతున్నాయి. బీఆర్ఎస్ , కాంగ్రెస్ ల పార్టీల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. ఎక్కడ చాన్స్ దొరికిన నేతలు ఒకరిపై మరోకరు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం మంచిర్యాలలో జిల్లా పార్టీ నేతల సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. క్యాతనపల్లి మున్సిపాలిటీలో తమ పార్టీకి సంపూర్ణ మెజారిటీ ఉన్నా మంత్రి వివేక్ అడ్డంకులు సృష్టించారని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం క్యాతనపల్లిలో నీచ రాజకీయం చేశారంటూ కాంగ్రెస్ నేతలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు.ఆదివారం మంచిర్యాలలో జిల్లా పార్టీ నేతల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. గతంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మూడు నెలల్లోనే పిల్లలు పుట్టరని అన్నమాటల్ని గుర్తు చేశారు. దీనిపై సెటైరికల్ గా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 30 నెలలు దాటిందన్నారు. ఇంకా ఎందుకు పిల్లలు పుట్టలేదని హామీలను అమలు చేయడంలేదని ఎద్దేవా చేశారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో తమ పార్టీకి సంపూర్ణ మెజారిటీ ఉన్నా మంత్రి వివేక్ అడ్డంకులు సృష్టించారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఒక్క మున్సిపాలిటీ కోసం మంత్రి వివేక్ దాడులు, అక్రమ కేసులు, అరెస్టులతో భయపెట్టాలని చూశారని కాంగ్రెస్ పార్టీను ఏకీపారేశారు. బీఆర్ఎస్ నేత బాల్క సుమన్‌ను జైల్లో పెట్టి ఇబ్బందులు పెట్టారన్నారు. ఈ మున్సిపాలిటీని కైవసం చేసుకున్న బీఆర్ఎస్-సీపీఐ నేతలకు అభినందనలు తెలిపారు. అంతే కాకుండా.. వివేక్ ఫోన్ చేసి అడుక్కుంటే మున్సిపాలిటీని వదిలేసే వాళ్ళమని కేటీఆర్ సెటైరికల్ వ్యాఖ్యలు చేశారు. 100 రోజుల్లో ఆరు గ్యారంటీలు ఏమయ్యాయో చెప్పాలంటూ సీఎం రేవంత్ రెడ్డి పాలనను కేటీఆర్ ఏకీపారేశారు. సింగరేణిని సీఎం రేవంత్ రెడ్డి బావమరిది నడుపుతున్నాడని, టెండర్ వేయాలంటే సైట్ విజిట్ సర్టిఫికెట్ పెట్టారని అన్నారు. సీఎం బామ్మర్ది సృజన్ రెడ్డి ఇదంతా చేస్తున్నారని విమర్శించారు. సింగరేణి వారసత్వ ఉద్యోగాలపై ఏసీబీ విచారణ కాదని.. సీఎం రేవంత్‌కు నిజమైన నిబ్బద్దత ఉంటే ఆయన బామ్మర్దిపై విచారణ చేపట్టాలని కేటీఆర్ కాంగ్రెస్ కు సవాల్ విసిరారు.

ఇటీవల తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సైతం ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పాత పేరు, కొత్త అజెండాతో ప్రజల ముందుకు వస్తానని తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సమితి పేరు ఫ్రీ అయిందని.. ఇప్పుడు దాన్ని ఎవరైనా వాడుకోవచ్చన్నారు. ఆచార్య జయశంకర్ సిద్ధాంతాల ప్రకారమే తమ పార్టీ నడుస్తుందని చెప్పారు. తమ పార్టీకి సిద్ధాంతకర్త అంటూ ఎవరూ లేరన్నారు. బీఆర్ఎస్ ప్రస్తుతం నిద్రావస్థలో ఉందని విమర్శించారు. కవిత కామెంట్స్ నేపథ్యంలో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి..

నిబంధన సవరణతో సాదాబైనామా

# పరిష్కారాలు

మొదటిపేజీ తరువాయి..

అందాయి. వీటిని హైదరాబాద్‌లోని భూ పరిపాలన ప్రధాన కమిషనర్ కార్యాలయం ఆన్‌లైన్ ద్వారా ఆయా జిల్లా కలెక్టరేట్లకు బదలాయించింది. అయితే, 2023లో కొన్ని దరఖాస్తులను జిల్లా కలెక్టర్లు తిరస్కరించారు. 2025లో భూ క్రయవిక్రయదారులు ఇద్దరూ అఫిడవిట్ సమర్పించాలన్న నిబంధన తీసుకొచ్చాక కూడా కొన్ని అప్లికేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. కేవలం 7 వేల అప్లికేషన్ల పరిశీలన మాత్రమే పూర్తిచేశారు.2014 సంవత్సరానికి ముందు అమ్మిన భూమికి విక్రయదారులు ఇప్పుడు ప్రమాణ పత్రం ఇవ్వడానికి ముందుకు రాకపోవడంతో పలు జిల్లాల్లో అప్లికేషన్లను తిరస్కరించారు. అయితే, గత నెల రెవెన్యూ శాఖ నిబంధనలు సవరించడంతో సాదాబైనామాల భూములను పట్టా చేసుకోవడానికి మార్గం సుగమం చేసింది. ఇప్పుడు గతంలో తిరస్కరించిన దరఖాస్తులను కూడా మళ్లీ పరిగణనలోకి తీసుకోవాలన్న విజ్ఞప్తులు జిల్లాల కలెక్టర్లకు వస్తున్నాయి. గత ప్రభుత్వంలో జరిగిన సాదాబైనామాల క్రమబద్ధీకరణ సంబంధిత మండలాల తహసీల్దార్లు పూర్తిచేశారు. ప్రస్తుతం భూ భారతి చట్టం ప్రకారం సాదాబైనామాలను క్రమబద్ధీకరించే అధికారాలను ఆర్డీవోలకు కల్పించారు. తహసీల్దారు విచారణ చేసి నివేదిక పంపిస్తే వాటిని పరిశీలించి ఆర్డీవోలు భూ భారతి పోర్టల్లో భూ సమాచారం నమోదు చేసి నిజమైన హక్కుదారులకుల పట్టా చేస్తున్నారు. ప్రస్తుతం క్షేత్రస్థాయి విచారణలో తేలే విషయాలే కీలకంగా మారుతున్నాయి. ఇందుకోసం వాస్తవాలను తెలుసుకునేందుకు క్రమబద్ధీకరించాల్సిన భూముల సరిహద్దు రైతులకు తహసీల్దార్లు నోటీసులు జారీ చేస్తున్నారు. సాదాబైనామా రైతు సమర్పించే అఫిడవిట్ పూర్తి ఆధారాలతో ఉండటంతో పాటు 30 రోజుల పాటు అభ్యంతరాలేవీ రాకుంటే క్రమబద్ధీకరణ పని సులువుగా పూర్తవుతుందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న మండలాల్లోని దరఖాస్తులను సైతం పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఈ నేపథ్యంలో తెల్లకాగితంపై రాసుకొని భూములు కొనుగోలు చేసినవారిలో తమ భూములు పట్టా కానున్నాయనే ఆశలు చిగురిస్తున్నాయి. ఉదాహరణకు చూస్తే ఉమ్మడి మెదక్ జిల్లాలో 58,847 దరఖాస్తులను వివిధ కారణాలతో అధికారులు తిరస్కరించారు. హెచ్ఎండీఏ పరిధిలోని మండలాల్లో సాదాబైనామాలకు గతంలో ఎలాంటి అవకాశం కల్పించలేదు. తాజాగా ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారం సంగారెడ్డి జిల్లాలోని అమీన్‌పూర్, పటాన్‌చెరు, రామచంద్రాపురం మండలాల్లోని సాదాబైనామా అప్లికేషన్లను కూడా పరిశీలించనున్నారు.

# 83.72 శాతంతో మేడ్చల్ టాప్..

మొదటిపేజీ తరువాయి..

ఉత్తీర్ణత సాధించగా, ఒకేషనల్ విభాగంలో 72.71% మంది పాసయ్యారు. రెండు విభాగాలను కలిపి రెండవ సంవత్సరం మొత్తం ఉత్తీర్ణతా శాతం 75.34% గా నమోదైంది, ఇది గత సంవత్సరం కంటే ఎక్కువ. మొదటి సంవత్సరంలో జనరల్ విభాగంలో 66.94%, ఒకేషనల్ విభాగంలో 59.30% మంది ఉత్తీర్ణత సాధించారు. మొత్తం మీద మొదటి సంవత్సరం 66.20% మంది విద్యార్థులు పాసయ్యారు. ఉత్తీర్ణులు కాని విద్యార్థుల కోసం నెల రోజుల్లోనే సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. కాగా పొలంలో చెమట చిందించే తల్లిదండ్రులు.. చేతిలో పుస్తకం పట్టుకుని కలల్ని నాటుకున్న కూతురు.. అది కేవలం చదువు కాదు.. ఒక కుటుంబం కల. రైతు కుటుంబంలో పుట్టిన రాగాపురం హర్షిత.. చిన్నప్పటి నుంచే కష్టాన్ని దగ్గరగా చూసింది. ఎండలో పొలానికి వెళ్లే తల్లిదండ్రులు.. వర్షం కోసం ఆకాశం వైపు చూసే ఆత్రుత.. ఆ పరిస్థితుల మధ్యే ఆమె విద్యా ప్రయాణం మొదలైంది. పది తరగతిలోనే తెలంగాణ గర్నమెంట్ నడిపించే తాండూర్ రెసిడెన్షియల్ స్కూల్లో 10వ తరగతి చదివి 9.5 సిజీపీఏ సాధించి తన ప్రతిభను చాటుకున్న హర్షిత.. ఇంటర్‌లో కూడా అదే పట్టుదలతో ముందుకు సాగింది. తల్లిదండ్రులు తనను చూసి గర్వంతో తలెత్తుకోవాలనే ఆశయంతో ముందుకు సాగించింది.

# కుదరని సయోధ్య

మొదటిపేజీ తరువాయి..

అయినప్పటికీ ఇరాన్ ప్రతినిధులు మాత్రం మా షరతులను అగీకరించడానికి నిరాకరించారు. మేం తిరిగి వెళ్తున్నాం. నేను అన్ని వివరాలను ఇప్పుడు చెప్పలేను. ఎందుకంటే 21 గంటల పాటు రహస్యంగా చర్చలు జరిపిన తర్వాత వాటిని బహిరంగంగా చర్చించడం నాకిష్టం లేదు' అని జేడీ వాన్స్ తెలిపారు. ఇరాన్ అణు ఆయుధాలను అభివృద్ధి చేయకూడదని, వాటిని త్వరగా తయారు చేసే సామర్థ్యాన్ని కూడా పొందకూడదని అమెరికా కోరిందని జేడీ వాన్స్ తెలిపారు. ఇది అమెరికా అధ్యక్షుడి ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ చర్చలు ద్వారా దానిని సాధించడానికి ప్రయత్నించామని తెలిపారు. 'వారి అణు కార్యక్రమాలు, శుద్ధి కర్మాగారాలు ఇప్పటికే ధ్వంసమయ్యాయి. కానీ ఇరాన్ భవిష్యత్‌లో కూడా అణ్వాయుధాలను అభివృద్ధి చేయకూడదనే బలమైన సంకల్పంతో ఉందా?. అలాంటి నిబద్ధత మాకు ఇంకా కనిపించలేదు. మేం అన్నింటిపైనా చర్చించాము. వాటితో పాటు మధ్యలో ప్రస్తావనకు వచ్చిన ఇతర విషయాలపైనా చర్చించాం. కానీ ఇరాన్ మా నిబంధనలను అంగీకరించే స్థితిలో లేదు. అధ్యక్షుడు మమ్మల్ని ఇక్కడికి పంపేటప్పుడు మంచి ఉద్దేశంతో ఒప్పందం కోసం శ్రమించమని చెప్పారు. మేం అదే చేసినా ఫలితం లేదు. మేం అధ్యక్షుడితో నిరంతరం సంప్రదింపుల్లో ఉన్నాం. మేము



ఇక్కడి నుంచి చిన్న ప్రతిపాదనతో వెళ్తున్నాం. మంచి అవగాహన ఉండాలనేది మా చివరి ఉత్తమ ఆఫర్. ఇరాన్ దానికి అంగీకరిస్తుందో లేదో వేచి చూడాలి' అని జేడీ వాన్స్ వివరించారు.పాకిస్థాన్ ప్రధానమంత్రికి, ఫీల్డ్ మార్షల్ మునీర్‌ను జేడీ వాన్స్ ధన్యవాదాలు తెలిపారు. చర్చలు విఫలమైనా, పాకిస్తాన్ తన వంతు సహకారం అద్భుతంగా అందించిందని ప్రశంసించారు. చర్చలలో లోపాలు ఏవైనా ఉంటే అది పాకిస్థానీల వల్ల కాదు, ఇరు పక్షాలు మధ్య ఉన్న అగాధాన్ని తగ్గించి ఒప్పందం కుదిర్చేందుకు చాలా ప్రయత్నించారని తెలిపారు. అటు ఇరాన్ కూడా పాక్‌ను ప్రశంసించింది. చర్చలకు ఆతిథ్యం ఇచ్చిన పాకిస్థాన్ ప్రభుత్వానికి, అక్కడి ప్రజలకు ఇరాన్ కృతజ్ఞతలు తెలిపింది. మరోవైపు అమెరికా డిమాండ్ల కారణంగానే చర్చలు విఫలమయ్యాయని ఇరాన్ ప్రభుత్వం మీడియా పేర్కొంది. సుమారు 21 గంటల పాటు చర్చల్లో దౌత్యపరమైన ప్రయత్నాలు జరిగాయని తెలిపింది. కానీ అమెరికా డిమాండ్లు ఒప్పందాన్ని కుదరకుండా అడ్డుకున్నాయని చెప్పింది. హర్మూజ్ జలసంధి, ఇరాన్ అణు హక్కులు వంటి కీలక అంశాలపై ప్రతిష్ఠంభన కారణంగానే ఇవి విఫలమయ్యాయని తెలిపింది. ఇప్పుడు ఎలాంటి ఒప్పందం కుదరకుండానే అమెరికా బృందం వెనక్కి తిరిగి వెళ్లిపోయింది. కాల్పుల విరమణ కొనసాగుతుందా లేదా బ్రేక్ చేస్తారా అనేది చూడాలి.

మరోవైపు పాకిస్థాన్‌లో జరిగిన చర్చలు విఫమైన తర్వాత అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు అంతకంతకూ పెరుగుతున్నాయి. ఇరాన్‌పై ఒత్తిడి పెంచేందుకు అమెరికా కీలక చర్యలు తీసుకుంటోంది. ఇరాన్ ఓడరేవులను దిగ్బంధిస్తున్నట్లు సోమవారం అమెరికా సైన్యం ప్రకటించింది. ఇరాన్ ఓడరేవుల నుంచి రాకపోకలు సాగించే అన్ని రకాల నౌకలను కదలనీయబోమని వెల్లడించింది.

సోమవారం(ఏప్రిల్ 13) నుంచి ఈ ఆంక్షలు అమలులోకి వస్తాయని వాషింగ్టన్ అధికారికంగా పేర్కొంది. కాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక హెచ్చరికలు జారీ చేశారు.

ఇరాన్‌కు సైనిక మద్దతు అందిస్తే, చైనా కఠినమైన వాణిజ్య ఆంక్షలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. చైనా ఇరాన్‌కు యాంటీ-ఎయిర్‌క్రాఫ్ట్ 'షోల్డర్ మిసైళ్లను' సరఫరా చేస్తున్నట్లు తనకు సమాచారం అందిందని, అయితే పూర్తిస్థాయిలో ఆయుధాలు సరఫరా చేస్తోందన్న విషయాన్ని తాను నమ్మలేదన్నారు. అలాగే, రాబోయే రోజుల్లో ఇరాన్‌కు కొత్త వాయు రక్షణ వ్యవస్థలను అందించడానికి కూడా చైనా సిద్ధమవుతోందని తన దృష్టికి వచ్చిందన్నారు. ఒకవేళ అదినిజమైతే చైనా 50శాతం టారిఫ్‌లు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ మేర వ్యాఖ్యానించారు.

ఎవరైనా ఇరాన్‌కు ఆయుధాలు సరఫరా చేస్తున్నట్లు మేం గుర్తిస్తే, ఆ దేశాలపై 50 శాతం టారిఫ్ విధిస్తాం. అయితే, చైనా అలాంటి పని చేస్తుందని నేను అనుకోవడం లేదు. ఎందుకంటే మా మధ్య మంచి సంబంధాలు ఉన్నాయి. అయినప్పటికీ ప్రారంభంలో కొంతవరకు సహాయం చేసి ఉండొచ్చు." డొనాల్డ్ ట్రంప్, అమెరికా అధ్యక్షుడు.

## మణిపూర్‌లో భద్రతా దళాలు భారీ ఆపరేషన్..

మొదటిపేజీ తరువాయి..

స్థావరాలను స్వాధీనం చేసుకున్నారు. ఉఖ్రుల్ జిల్లాలోని సికిబుంగ్, మోంగ్‌కోట్ చెపు గ్రామాల్లో సాయుధ తిరుగుబాటుదారులు అక్రమంగా నిర్మించిన 21 బంకర్లను భద్రతా దళాలు ధ్వంసం చేశాయి. లిటాన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ తనిఖీల్లో సికిబుంగ్‌లో 14, మోంగ్‌కోట్ చెపులో 7 బంకర్లు ఉన్నట్లు గుర్తించారు. ఈ బంకర్లన్నీ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే లక్ష్యంతో నిర్మించినవేనని అధికారులు వెల్లడించారు. మరోవైపు, టెంగ్నౌపాల్ జిల్లాలోని మోరే ప్రాంతంలో నిర్వహించిన సోదాల్లో భారీగా మందుగుండు సామగ్రి బయటపడింది. భద్రతా దళాలు అక్కడ 13 ఐఈడీలను స్వాధీనం చేసుకుని, వాటిని అక్కడికక్కడే నిర్వీర్యం చేశాయి. వీటితో పాటు ఒక 9ఎంఎం పిస్టల్ మ్యాగజైన్ ఇతర పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల మోంగ్‌కోట్ చేపు గ్రామం సమీపంలో గుర్తు తెలియని దుండగుల కాల్పుల్లో పశ్చిమ బెంగాల్‌కు చెందిన బీఎస్ఎఫ్ జవాన్ ప్రాణాలు కోల్పోయాడు. గ్రామం సమీపంలో విధి నిర్వహణలో ఉన్న ఆ సైనికుడిపై గుర్తు తెలియని దిశ నుండి వచ్చిన తూటా దూసుకురావడంతో ఈ ఘటన జరిగింది. ఈ నేపథ్యంలో ఈ గాలింపు చర్యలు తీవ్రతరమయ్యాయి. ఇదిలావుంటే, మణిపూర్ రాష్ట్రంలో పరిస్థితులు ఇంకా ఆందోళనకరంగానే ఉన్నాయి. ఏప్రిల్ 7న బిష్ణుపూర్ జిల్లా ట్రోంగ్లావోబిలో అనుమానిత ఉగ్రవాదులు ఒక ఇంటిపై బాంబు దాడి చేయడంతో ఐదేళ్ల బాలుడు, ఆరు నెలల పసికందు మరణించడం తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనపై ఆగ్రహించిన సుమారు 500 మంది నిరసనకారులు సీఆర్పీఎఫ్ శిబిరంపై దాడి చేసి వాహనాలకు నిప్పు పెట్టారు. ఈ క్రమంలో జరిగిన కాల్పుల్లో ముగ్గురు నిరసనకారులు ప్రాణాలు కోల్పోగా, 30 మంది గాయపడ్డారు. ప్రస్తుతం ఈ కేసులో యునైటెడ్ కుకీ నేషనల్ ఆర్మీకి చెందిన ముగ్గురు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాంబు దాడిలో వీరి ప్రమేయంపై లోతైన విచారణ జరుగుతోంది. శాంతిని పునరుద్ధరించేందుకు సరిహద్దు ప్రాంతాల్లో భద్రతా బలగాలు నిరంతరం నిఘా పెంచారు.

## జులై 3 నుంచి అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం

మొదటిపేజీ తరువాయి..

ఆగస్టు 28 వరకు సాగుతుందని జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆదివారం అధికారికంగా ప్రకటించారు. ఈ యాత్రకు వెళ్లాలనుకునే భక్తులు ఏప్రిల్ 15వ తేదీ నుంచి ముందస్తు రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని వెల్లడించారు. శనివారం జరిగిన శ్రీ అమర్‌నాథ్ జీ ష్రైన్ బోర్డు (ఎస్ఏఎస్‌బీ) సమావేశంలో తేదీలపై తుది నిర్ణయం తీసుకున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న యెస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లకు చెందిన 550కి పైగా ఎంపిక చేసిన బ్రాంచ్‌లలో ఆఫ్ లైన్ లో, అధికారిక వెబ్ సైట్ ద్వారా ఆన్ లైన్ లోనూ భక్తులు దరఖాస్తు చేసుకోవచ్చు. నిబంధనల ప్రకారం 13 ఏళ్ల కంటే తక్కువ, 70 ఏళ్లు పైబడిన వారు ఈ యాత్రకు అనర్హులు. ఆరు



వారాల కంటే ఎక్కువ గర్భంతో ఉన్న మహిళలకు కూడా అనుమతి లేదు. యాత్రకు వెళ్లాలనుకునే ప్రతి భక్తుడు ఏప్రిల్ 8, 2026 తర్వాత ప్రభుత్వం ఆమోదించిన వైద్యులు లేదా ఆసుపత్రుల నుంచి తప్పనిసరిగా ఆరోగ్య ధ్రువీకరణ పత్రం పొందాలి. రిజిస్ట్రేషన్ రుసుముగా రూ.150 చెల్లించాల్సి ఉంటుంది. ఎంచుకున్న రోజుకు ఏడు రోజుల ముందు రిజిస్ట్రేషన్లు ముగుస్తాయి. జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా జూన్ 19న తొలి పూజ జరగనుంది. అమర్‌నాథ్ యాత్ర ప్రధానంగా రెండు మార్గాల్లో కొనసాగుతుంది. అనంతనాగ్ జిల్లాలోని 48 కిలోమీటర్ల నున్వాన్-పహల్గామ్ రూట్, అలాగే గందర్‌బల్ జిల్లాలోని తక్కువ దూరమైనప్పటికీ ఎత్తైన మార్గమైన 14 కిలోమీటర్ల బల్తాల్ రూట్ గుండా యాత్రికులు ప్రయాణించవచ్చు. ఆధార్ వివరాలను తప్పులు లేకుండా ఇవ్వాలని ష్రైన్ బోర్డు భక్తులను కోరింది. ఆన్‌లైన్‌లో గానీ బ్యాంకులో గానీ జారీ చేసే యాత్ర పర్మిట్ ద్వారా మాత్రమే యాక్సెస్ కంట్రోల్ గేట్ల (బల్తాల్, చందన్వారీ) వద్ద ఎంట్రీ లభిస్తుంది.

## ప్రజల కష్టమే మా కష్టం ఆదివారం రంగంలోకి దిగిన కుమారి సర్పంచ్ -మల్టీ వర్కర్లు

**– సమస్య తెలిసిన వెంటనే స్పందించిన సర్పంచ్**




**నేరడిగొండ ఏప్రిల్ 12 ప్రజాజ్యోతి :** ప్రజల సమస్యల పరిష్కారంలో తమకు సెలవులతో పనిలేదని నేరడిగొండ మండలంలోని కుమారి గ్రామ పంచాయతీ నిరూపిస్తోంది. గ్రామంలోని పలు చోట్ల డ్రైనేజీలు పూడిపోవడం, రహదారులు దెబ్బతినడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయం సర్పంచ్ అగ్గిమల్ల గోదావరి లస్మన్న, ఉప సర్పంచ్ ఆడెపు రవి దృష్టికి వచ్చింది. దీనిపై సర్పంచ్ తక్షణమే స్పందించారు. సాధారణంగా ఆదివారం సెలవు దినం అయినప్పటికీ, ప్రజలకు ఎటువంటి ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతో మల్టీ వర్కర్లతో కలిసి మరమ్మతు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ 'ప్రజాజ్యోతి' ప్రతినిధితో మాట్లాడుతూ.. గ్రామంలో ఎక్కడ సమస్య ఉన్నా వెంటనే పరిష్కరించడమే తమ ప్రాధాన్యతని తెలిపారు. డ్రైనేజీల క్లీనింగ్ మరియు రోడ్ల ప్యాచ్ వర్క్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. తమ వంతు కృషిగా సెలవు దినాన్ని సైతం లెక్కచేయకుండా సేవలందిస్తున్న మల్టీ వర్కర్లను, సర్పంచ్, ఉప సర్పంచ్ చొరవను గ్రామ ప్రజలు ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. ఇందులో మల్టీ వర్కర్లు కొత్తపెల్లి అడెల్లు, జొన్నల బందన్న, బిక్క లక్ష్మణ్, గజ్జల గంగయ్య,శోభన్ ఉన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో జిల్లా విద్యార్థుల ప్రతిభ

**శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్ అభిలాష అభినవ్**



**నిర్మల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 12, (ప్రజాజ్యోతి) :** ఈరోజు విడుదలైన ఇంటర్ పరీక్ష ఫలితాలలో జిల్లా విద్యార్థులు ఘనమైన ప్రతిభ కనబరిచారని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫలితాలలో, నిర్మల్ జిల్లా, 62.93 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్ర స్థాయిలో 12 వ ర్యాంక్, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 73.43 శాతం ఉత్తీర్ణతో 13 వ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడం పై కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఈ సందర్భంగా ఆమె శు భాకాంక్షలు తెలిపారు. మున్ముందు పై తరగతుల్లో మరింత కష్టపడి చదివి, ఉన్నతంగా నిలవాలని ఆకాంక్షించారు. అనుత్తీర్ణులు అయిన విద్యార్థులు బాధపడకూడదని, మరింత కష్టపడి చదివి ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా కృషిచేసిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు కలెక్టర్ అభినందనలు తెలియజేశారు. రానున్న రోజుల్లో మరింత మంచి ఫలితాలు సాధించి జిల్లాను రాష్ట్రస్థాయిలో మంచి స్థానంలో నిలపాలని అప్రకటన ద్వారా తెలిపారు.

## పెగడపల్లిలో వెలుగులు సింగరేణి స్పందనకు గ్రామం ప్రశంసలు




**జైపూర్ ఏప్రిల్ 12 ప్రజాలజ్యోతి :** జైపూర్ మండలంలోని పెగడపల్లి గ్రామంలో సింగరేణి ఆధ్వర్యంలో వీధి దీపాలను ఏర్పాటు చేశారు.గ్రామంలో స్ట్రీట్ లైట్ల ఏర్పాటు కోసం సింగరేణి యాజమాన్యాన్ని కోరగా వారు వెంటనే స్పందించి ఎల్ఈడి లైట్లను పంపించడం గ్రామస్తుల్లో ఆనందం నింపింది. చాలా కాలంగా ఎదురుచూస్తున్న సమస్యకు త్వరితగతిన పరిష్కారం లభించడంతో గ్రామం వెలుగులతో మెరిసిపోతోంది.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రామగిరి రామన్న మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధికి సహకరించిన సింగరేణి యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇకపై గ్రామంలో భద్రతా పరంగా కూడా ఈ లైట్లు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు.ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్లు గంగాధరి మల్లేష్,రామగిరి రాము,బొప్ప సంతోష్‌తో పాటు గ్రామ పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామాభివృద్ధికి అందరూ కలిసికట్టుగా ముందుకు రావడం హర్షణీయమని పలువురు అభిప్రాయపడ్డారు.

## తెలంగాణ ఇంటర్ బైపిసి రెండవ సంవత్సరం ఫలితాల్లో తెలంగాణ స్టేట్ సెకండ్ టాపర్ రెంకా వైష్ణవి

**– 995/1000 మార్కులు సాధించిన మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి ఆర్కే–5 గని కార్మికుని కూతురు...**




**మంచిర్యాల, 12, ఏప్రిల్ (ప్రజాజ్యోతి) :** తెలంగాణ ఇంటర్ ఫలితాల్లో మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాకు చెందిన సింగరేణి కార్మికుడి కూతురు అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో రెండవ స్థానాన్ని సాధించింది. ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపీసీ విభాగంలో 1000 మార్కులకు గాను 995 మార్కులు సాధించిన రెంకా వైష్ణవి తెలంగాణ స్టేట్ సెకండ్ టాపర్‌గా నిలిచింది. బైపీసీ విభాగంలో రాష్ట్రంలో అత్యధిక మార్కులు 996 కాగా, 995 మార్కులతో రెండవ స్థానాన్ని దక్కించుకోవడం విశేషం. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో టాపర్‌గా నిలిచి జిల్లా గర్వాన్ని పెంచింది. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే–5 గనిలో జనరల్ మజ్దూర్‌గా పనిచేస్తున్న రెంకా చంద్రమౌళి కుమార్తె అయిన వైష్ణవి చిన్నప్పటి నుంచే చదువులో ప్రతిభ కనబరుస్తూ వస్తోంది. పదవ తరగతిలో 10/10 జీపీఏ సాధించి తన ప్రతిభను ఇప్పటికే నిరూపించింది. డాక్టర్ కావాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న వైష్ణవి, నీట్ పరీక్షలో మంచి ర్యాంకు సాధించి ప్రముఖ మెడికల్ కళాశాలలో మెడిసిన్ చదివి వైద్యురాలిగా సేవ చేయాలని తన ఆశయాన్ని వ్యక్తం చేసింది. మంచిర్యాల పట్టణంలోని కార్మెల్ స్కూల్లో పదవ తరగతి పూర్తి చేసిన ఆమె, ప్రస్తుతం ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో డే స్కాలర్‌గా చదువుతూ ఈ ఘనత సాధించింది. తమ కూతురు సాధించిన విజయంపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ, ఇది తమ కుటుంబానికి గర్వకారణమని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వైష్ణవిని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

# ప్రభుత్వ పథకాలతో పేదలకు భరోసా - ఆడే గజేందర్




**నేరడిగొండ, ఏప్రిల్ 12 (ప్రజాజ్యోతి) :** మండలంలోని కుప్టి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గృహ ప్రవేశ కార్యక్రమం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ వేడుకకు బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామానికి చెందిన లబ్ధిదారులు ఆకుల వనిత – ప్రభాకర్ దంపతుల నూతన గృహ ప్రవేశానికి వారి ఆహ్వానం మేరకు విచ్చేసిన ఆయన, రిబ్బన్ కట్ చేసి సామూహిక గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం దంపతులకు మరియు కుటుంబ సభ్యులకు ఆయన ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ. కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం పేద ప్రజల పాలిట వరమని కొనియాడారు. సొంత ఇల్లు లేని నిరుపేదలకు ఈ పథకం ద్వారా గూడు కల్పించి, వారి కలలను ప్రభుత్వం సాకారం చేస్తోందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని ఈ సందర్భంగా ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీరామోజీ నారాయణ, షేక్ అలీ, కళ్ళెం భోజన్న, బొజ్జ రాజేశ్వర్, ఆకుల వెంకటరమణ, ఆకుల రాజేశ్వర్, ఆకుల పందరి, అంబకంటి రాజేశ్వర్, బద్దం పోతారెడ్డి, ఎండి సద్దాం, మౌలానా మరియు స్థానిక కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 14న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ

**- సర్పంచ్ ఏలేటి ప్రశాంత్ రెడ్డి వెల్లడి - పాల్గొననున్న ఎమ్మెల్యేబొజ్జు పటేల్**






**ఖానాపూర్ ఏప్రిల్ 12 (ప్రజా జ్యోతి) :** భారత రాజ్యాంగ నిర్మాత బి ఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ ఖానాపూర్ మండలంలోని పాత ఎల్లాపూర్ గ్రామంలో ఏర్పాటు చేయనున్నట్లు సర్పంచ్ ఏలేటి ప్రశాంత్ రెడ్డి తెలిపారు బాబా సాహెబ్ అంబేద్కర్ బడుగు బలహీన వర్గాలకే కాకుండా రాజ్యాంగాన్ని రచించి దేశానికే ప్రథమ పౌరుడిగా నిలిచారని బిఆర్ అంబేద్కర్ 135జయంతి సందర్భంగా ఏప్రిల్ 14 మంగళవారం పాత ఎల్లాపూర్ గ్రామంలో స్థానిక శాసనసభ్యులు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెడమ బొజ్జు పటేల్ చేతుల మీదుగా ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమానికి వక్తలుగా రాజేష్ రక్షక్ దాసరి నర్సయ్య పాల్గొంటారని ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయంతి ఉత్సవంతో పాటు అంబేద్కర్ విగ్రహ అవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సర్పంచ్ ప్రశాంత్ రెడ్డి ఉపసర్పంచ్ చిట్యాల పెద్దిరాజు గ్రామపంచాయతీ పాలకవర్గం ప్రకటనలో కోరింది.

# తెలంగాణలో ఉక్కపోత అలర్ట్

**- 10 రోజుల పాటు వడగాల్పులు**
**- కోల్‌బెల్ట్ నుంచి రాష్ట్రవ్యాప్తంగా అప్రమత్తం**



**మంచిర్యాల, 12, ఏప్రిల్ (ప్రజా జ్యోతి) :** తెలంగాణ రాష్ట్రంలో ఎండలు రోజురోజుకూ తీవ్రమవు తున్నాయి. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం ఏప్రిల్ 12 నుంచి 22 వరకు రాష్ట్ర వ్యాప్తంగా వడగాల్పులు వీచే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 44శీజ దాటే అవకాశం ఉండగా, హైదరాబాద్‌లో కూడా వరుసగా 40–41శీజ వరకు నమోదయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో భానుడి ప్రభావం మరింత ఎక్కువగా ఉండనుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

**వైరల్ హెచ్చరికలు – ఎంతవరకు నిజం....?... :** ఇటీవల సోషల్ మీడియాలో "ఏప్రిల్ 19 నుంచి మే 31 వరకు 45శీజ నుంచి 55శీజ వరకు ఉష్ణోగ్రతలు పెరుగుతాయి, ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 వరకు ఎవరూ బయటకు రాకూడదు" అనే సందేశాలు వైరల్ అవుతున్నాయి. అలాగే "మొబైల్ ఫోన్లు పేలిపోతాయి, 70 శాతం అతినీలలోహిత కిరణాలు నేరుగా భూమిపై పడతాయి" వంటి హెచ్చరికలు కూడా ప్రచారం అవుతున్నాయి.

నిపుణుల అభిప్రాయం ప్రకారం ఈ సమాచారం పూర్తిగా అధికారికం కాదు. అయినప్పటికీ అధిక ఉష్ణోగ్రతలు ఉండే అవకాశం ఉన్నందున జాగ్రత్తలు మాత్రం తప్పనిసరి.

**కోల్‌బెల్ట్ ప్రాంతాల్లో మరింత తీవ్రత......... :** ముఖ్యంగా సింగరేణి బొగ్గు గనులు అనగా అండర్ గ్రౌండ్ గనులు, ఓపెన్ కాస్ట్ గనులు ఉన్న ప్రాంతాలైన మంచిర్యాల, బెల్లంపల్లి, రామకృష్ణాపూర్, మందమర్రి, శ్రీరాంపూర్, గోలేటి, కొమరం భీం ఆసిఫాబాద్, రామగుండం, భూపాలపల్లి, కొత్తగూడెం, ఎల్లందు, మణుగూరు, సత్తుపల్లి ప్రాంతాల్లో ––– ప్రతి వేసవిలో మిగతా ప్రాంతాల కంటే ముందుగానే, ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదవుతుంటాయి.

స్థానికుల అభిప్రాయం ప్రకారం ఈ ప్రాంతాల్లో వాస్తవ ఉష్ణోగ్రతలు 50శీజ వరకు చేరినా అధికారికంగా 45శీజ వరకు మాత్రమే ప్రకటిస్తున్నారని వాదనలు వినిపిస్తున్నాయి. ప్రజల్లో భయం రాకుండా ఉండేందుకు ఇలా చేస్తున్నారనే అభిప్రాయాలు ఉన్నాయి.

**వృద్ధులు, మహిళలు, చిన్నారులపై ప్రభావం.....:** సింగరేణిలో దశాబ్దాలుగా పనిచేసి అదే ప్రాంతాల్లో స్థిరపడిన మాజీ ఉద్యోగులు, వయోవృద్ధులు ఎక్కువగా ఇక్కడే నివసిస్తున్నారు.

వేసవి కాలం రాగానే వీరు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలు వేడిని తట్టుకోలేక ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారు.

**మారుతున్న జీవనశైలి తో ఏసీ లు, కూలర్లపై ఆధారపడుతున్న ప్రజలు :** ఒకప్పుడు సరైన సౌకర్యాలు లేకపోయినా జీవనం సాగించిన కార్మిక కుటుంబాలు ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. ప్రస్తుతం ప్రతి ఇంట్లో ఏసీలు, ఎయిర్ కూలర్లు వాడకం పెరిగింది.కోల్‌బెల్ట్ ప్రాంతాల్లో వేసవి ప్రారంభం కావడంతోనే వీటి అమ్మకాలు విపరీతంగా పెరుగుతున్నాయి. సింగరేణి యాజమాన్యం కూడా కార్మిక క్వార్టర్లలో ఏసీల వినియోగానికి అనుమతి ఇచ్చి, ఉచిత విద్యుత్ సరఫరా అందించడం గమనార్హం. వేడి కారణంగా ప్రమాదాల అట్లాజాగ్రత్తలు అవసరం.తీవ్ర ఉష్ణోగ్రతల నేపథ్యంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ప్రస్తుతం ఈ కాలంలో కార్లు కామన్ అయిపోయాయి. వేసవికాలంలో కార్లలో ఉంచకూడని వస్తువుల వివరాల ప్రకారం గ్యాస్ పదార్థాలు, లైటర్లు, కార్బోనేటెడ్ పానీయాలు, బ్యాటరీలు, సుగంధ ద్రవ్యాలు

ఇతర సూచనలు:

గాలి ప్రసరణ కోసం కిటికీలు కొద్దిగా తెరిచి ఉంచాలి, ఇంధనం పూర్తిగా నింపకుండా ఉండాలి, మధ్యాహ్నం సమయంలో ప్రయాణం తగ్గించాలి, టైర్లలో అధిక గాలి నింపకూడదు

**ఇళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు.......!!!**

గదుల్లో గాలి సరిగా వచ్చేలా తలుపులు, కిటికీలు తెరిచి ఉంచాలి. గ్యాస్ సిలిండర్‌ను ఎండలో ఉంచకూడదు. విద్యుత్ లోడ్ ఎక్కువ చేయకూడదు. అవసరమైన గదుల్లో మాత్రమే ఏసీ వినియోగించాలి. ఏసీ ఉష్ణోగ్రతను 24––25శీజ వద్ద ఉంచడం మంచిది. ఆరోగ్య రక్షణ కోసం సూచనలు గమనించాలి.

తరచూ నీరు తాగాలి. మజ్జిగ, పెరుగు, నిమ్మరసం తీసుకోవాలి. పండ్లు ఎక్కువగా తీసుకోవాలి. ప్రతి 2––3 గంటలకు విశ్రాంతి తీసుకోవాలి. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 వరకు సూర్యకాంతి నివారించాలి. అంతేకాక మరో ముప్పు కూడా ఉందండోయ్. పాములు, తేళ్లు ఎండ తీవ్రత పెరగడంతో చల్లని ప్రదేశాల కోసం పాములు, తేళ్లు ఇళ్లలోకి వచ్చే అవకాశముంది. కాబట్టి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

**ముగింపు.... :** తెలంగాణలో ఎండల తీవ్రత రోజు రోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ముఖ్యంగా కోల్‌బెల్ట్ ప్రాంతాల్లో నివసించే ప్రజలు మరింత జాగ్రత్తలు తీసుకోవాలి. వృద్ధులు, మహిళలు, చిన్నారుల ఆరోగ్య రక్షణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉంది.

"వేసవిని తేలికగా తీసుకోవద్దు... జాగ్రత్తే ప్రాణ రక్షణ" అనేది ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలి, పాటించాలి సుమా..

### తెలంగాణ ఇంటర్ బైపిసి రెండవ సంవత్సరం ఫలితాల్లో

# తెలంగాణ స్టేట్ సెకండ్ టాపర్ రెంకా వైష్ణవి






**995/1000 మార్కులు సాధించిన మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి ఆర్కే–5 గని కార్మికుని కూతురు...**




**మంచిర్యాల, 12, ఏప్రిల్ (ప్రజా జ్యోతి) :** తెలంగాణ ఇంటర్ ఫలితాల్లో మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాకు చెందిన సింగరేణి కార్మికుడి కూతురు అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో రెండవ స్థానాన్ని సాధించింది. ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపీసీ విభాగంలో 1000 మార్కులకు గాను 995 మార్కులు సాధించిన రెంకా వైష్ణవి తెలంగాణ స్టేట్ సెకండ్ టాపర్‌గా నిలిచింది. బైపీసీ విభాగంలో రాష్ట్రంలో అత్యధిక మార్కులు 996 కాగా, 995 మార్కులతో రెండవ స్థానాన్ని దక్కించుకోవడం విశేషం. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో టాపర్‌గా నిలిచి జిల్లా గర్వాన్ని పెంచింది. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే–5 గనిలో జనరల్ మజ్దూర్‌గా పనిచేస్తున్న రెంకా చంద్రమౌళి కుమార్తె అయిన వైష్ణవి చిన్నప్పటి నుంచే చదువులో ప్రతిభ కనబరుస్తూ వస్తోంది. పదవ తరగతిలో 10/10 జీపీఏ సాధించి తన ప్రతిభను ఇప్పటికే నిరూపించింది. డాక్టర్ కావాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న వైష్ణవి, నీట్ పరీక్షలో మంచి ర్యాంకు సాధించి ప్రముఖ మెడికల్ కళాశాలలో మెడిసిన్ చదివి వైద్యురాలిగా సేవ చేయాలని తన ఆశయాన్ని వ్యక్తం చేసింది. మంచిర్యాల పట్టణంలోని కార్మెల్ స్కూల్లో పదవ తరగతి పూర్తి చేసిన ఆమె, ప్రస్తుతం ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో డే స్కాలర్‌గా చదువుతూ ఈ ఘనత సాధించింది. తమ కూతురు సాధించిన విజయంపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ, ఇది తమ కుటుంబానికి గర్వకారణమని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వైష్ణవిని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

## ఇంటర్మీడియట్ ఎంఈసీ ఫలితాల్లో రాష్ట్ర స్థాయి ఘన విజయం

**– బీసీ బిడ్డల అద్భుత ప్రతిభ**



**మంచిర్యాల, 12, ఏప్రిల్ (ప్రజా జ్యోతి) :** మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాకు చెందిన గోల్లాల శ్రీనివాస్ (ఐటీ హెచ్ ఓ డి, బీసీ అండ్ ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు) గారి పుత్రికలు ఇందు ప్రసన్న మరియు ఇందుశరణ్య ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంఈసీ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో విశిష్ట ప్రతిభ కనబరిచారు. ఇందు ప్రసన్న రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు (స్టేట్ ఫస్ట్ ర్యాంక్) సాధించగా, ఇందుశరణ్య రాష్ట్ర స్థాయిలో ఏడవ ర్యాంకు (స్టేట్ సెవెన్త్ ర్యాంక్) సాధించింది. ఈ అద్భుత విజయంతో సింగరేణి శ్రీరాంపూర్ ఏరియాకు వారు గొప్ప కీర్తిని తీసుకువచ్చారు. విద్యా రంగంలో బీసీ బిడ్డల సామర్థ్యాన్ని మరోసారి చాటిచెప్పిన ఈ విజయాన్ని సింగరేణి బీసీ అండ్ ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ హర్షాతిరేకంతో స్వాగతించింది.

మహనీయురాలు సావిత్రిబాయి పూలే ఆశయాలను ప్రతిబింబిస్తూ, ఈ విద్యా కుసుమాలను "ఆధునిక సావిత్రిబాయి పూలేలు"గా అభివర్ణించారు. వీరి సాధన బీసీ సమాజంలోని విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుందని తెలిపారు. బీసీ బిడ్డలందరూ విద్యలో ముందుండి సమాజాభివృద్ధికి తోడ్పడాలని, ఇందు ప్రసన్న మరియు ఇందుశరణ్యలను స్ఫూర్తిగా తీసుకుని వారి అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. వారు భవిష్యత్తులో ఉన్నత విద్యలో మరిన్ని శిఖరాలను అధిరోహించి దేశానికి, సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు.

ఈ అపూర్వ విజయానికి గాను ప్రతిభావంతులైన విద్యార్థినులు ప్రసన్న, శరణ్యలకు, అలాగే వారికి మార్గదర్శకులైన తల్లిదండ్రులు శ్రీ గోల్లాల శ్రీనివాస్–స్వాతి గారు మరియు కుటుంబ సభ్యులకు సింగరేణి బీసీ & ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్, శ్రీరాంపూర్ బ్రాంచ్ తరఫున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. సింగరేణి బీసీ & ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ నాయకులు అభినందించారు.

## మహాత్మ జ్యోతిరావ్ పూలే జయంతి వేడుకలు



**సోన్, ఏప్రిల్ 12 (ప్రజాజ్యోతి) :** మండలంలోని బొప్పరం గ్రామం మహాత్మ జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా వేడుకలు జరిపారు. సంఘం ఉపాధ్యక్షులు దామ భూమేశ్వర్ మాట్లాడుతూ తరతరాలుగా దేశంలో కొనసాగుతున్న బ్రాహ్మణాధిపత్యం పై మొట్ట మొదట తిరుగుబాటు చేసిన ధీరోదాత్తుడు. దేశంలో వ్యవస్థీకృతమైన కుల వ్యవస్థపై గర్జించిన తొలి కేసరి ఏస్సి, ఎస్టి,బిసిలు, మహిళల జీవితాల్లో విద్య జ్యోతిని వెలిగించి విద్యను అందించిన విద్యా ప్రదాత 'గులాంగిరి' వంటి రచనల ద్వార సమాజంలోని అట్టడుగు వర్గాల ప్రజలను జాగృతం చేసిన రుషి. 'సత్య శోధక్ సమాజ్ ' అను సంస్థను స్థాపించి సమాజంలో సత్యాన్ని ప్రజలకు తెలిపిన సంఘసంస్కర్త ఈ మహానీయుని జన్మ దినమైన నేడు అందరికి హృదయపూర్వక జన్మ దిన శుభాకాంక్షలు మహానీయుడు జన్మదినం జరుపుకోవడం చాలా ఆనందకరమైన విషయం ఇందులో మా వంతుగా జన్మదిన కార్యక్రమం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఆడే గజేందర్



**నేరడిగొండ, ఏప్రిల్ 12 ప్రజాజ్యోతి :** ఆదిలాబాద్ జిల్లా రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జై సింగ్ రాథోడ్ సోదరుడు కేతావత్ సర్దార్ సింగ్ కుమార్తె వివాహ వేడుక ఆదివారం నేరడిగొండ మండల కేంద్రంలోని లక్ష్మి ఫంక్షన్ హాల్‌లో అత్యంత వైభవంగా జరిగింది. ఈ వేడుకకు బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేదికపై నూతన వధూవరులను కలిసి, వారికి పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా జీవితాన్ని ప్రారంభించబోతున్న జంటకు ఆయురారోగ్యాలు, సుఖశాంతులు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆడే గజేందర్ వెంట పలువురు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు మరియు ప్రముఖులు పాల్గొన్నారు. వేడుకకు పెద్ద ఎత్తున బంధుమిత్రులు హాజరై సందడి చేశారు.

## ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవానికి మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ హాజరు

అలంపూర్,ఎర్రవల్లి మండలం (ప్రజా జ్యోతి) ఏప్రిల్ 12: అలంపూర్ నియోజకవర్గం ఎర్రవల్లి మండలం ధర్మవరం గ్రామానికి చెందిన సుజాత మహేష్ నాయుడు లబ్ధిదారులకు ఇళ్ల పంపిణీ అభివృద్ధి కార్యక్రమాలపై ప్రశంసలు స్థానికంగా నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల ఆదివారం ప్రారంభోత్సవ కార్యక్రమానికి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే





సంపత్ కుమార్ హాజరై రిబ్బెన కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులకు ఇళ్లను అందజేసి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ,ప్రభుత్వం అమలు చేస్తున్న గృహ పథకాలు పేద ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని అన్నారు.ప్రతి కుటుంబం స్వంత ఇల్లు కలిగి ఉండాలనే లక్ష్యంతో ఇలాంటి పథకాలు కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు.

పేదల సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యం.ఈ కార్యక్రమంలో అలంపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్డప్ప,వైస్ చైర్మన్ పచ్చర్ల కుమార్,ఎర్రవల్లి మండల అధ్యక్షులు పుటాన్ దొడ్డి వెంకటేష్, షేక్ పల్లి భాస్కర్ రెడ్డి,సీనియర్ కాంగ్రెస్ నాయకులు మధు నాయుడు,రాజు, స్వాములు,మహేష్, చిన్న నాయుడు మరియు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు హాజరయ్యారు.

## గద్వాల వాగ్దేవి కాలేజీకి ఇంటర్ ఫలితాల్లో ఘన విజయం

-ఇంటర్ ఫలితాల్లో వాగ్దేవి కళాశాల ప్రతిభకు మెరుగులు
-990,984 మార్కులతో విద్యార్థుల అద్భుత ప్రదర్శన
-విద్యార్థులను అభినందించిన కరస్పాండెంట్,ప్రిన్సిపాల్

గద్వాల (ప్రజా జ్యోతి) ఏప్రిల్ 12: ఆదివారం ఇంటర్మీడియట్ ఫలితాలు తెలపడంతో గద్వాల జిల్లా కేంద్రంలోని రెండవ రైల్వే గేట్ సమీపంలో ఉన్నటువంటి శ్రీ వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచి మరోసారి కళాశాల ప్రతిష్టను చాటిచెప్పారు. ఎం.పీ.సీ.మొదటి సంవత్సరంలో జశ్వంత్ 470 కి 464 మార్కులు సాధించి ప్రతిభ చూపగా, పూజ 440కి 425 మార్కులు సాధించి మంచి ఫలితాన్ని సాధించారు.ఇంటర్ సెకండియర్ ఫలితాల్లో ఎం.పీ.సీ.లో కె.ప్రవళిక 1000 కి 990 మార్కులు సాధించి కళాశాలలో ప్రథమ స్థానంతో పాటు జిల్లా లో రెండో ర్యాంక్ సాధించింది.బై.పి.సి.లో ఇ.అంజలి 1000 కి 984 మార్కులు సాధించి విశిష్ట ఫలితాన్ని సాధించి గొప్ప విజయం పొందారు. వీరితోపాటు మిగతా విద్యార్థులు కూడా మంచి ఫలితాలతో విజయం సాధించారు.ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ డాక్టర్. మహేందర్,ప్రిన్సిపల్ విజయలక్ష్మి మరియు అధ్యాపక బృందం అభినందిస్తూ వారు మాట్లాడుతూ..ఈ సంవత్సరంలో ఫస్ట్ ఇయర్,సెకండ్ ఇయర్ విద్యార్థులు మంచి ఫలితాలతో విజయం సాధించడంతో కాలేజీకి మంచి పేరు తేవడం జరిగింది అని ముందు చదువుల్లో వారి భవిష్యత్తు మరింత విజయవంతంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం అని తెలిపారు.

## ఇంటర్ ఫలితాల్లో శాంతినగర్ విద్యార్థిని ఝాన్సీ అద్భుత ప్రతిభ

చదువుకు పేదరికం అడ్డు కాదని నిరూపించిన విద్యార్థిని ఝాన్సీ

వడ్డేపల్లి ఏప్రిల్ 12(ప్రజా జ్యోతి): ఆదివారం వెలువడిన ఇంటర్ ఫలితాల్లో వడ్డేపల్లి మున్సిపాలిటీకి చెందిన ఝాన్సీ అత్యధిక మార్కులతో కళాశాల టాపర్ గా నిలిచింది. జడ్చర్ల



గురుకుల పాఠశాలలో బైపీసీ చదువుతున్న ఝాన్సీ 1000మార్కులకు గాను 990 మార్కులు సాధించి కళాశాల కు టాపర్ గా నిలిచింది.ఈ విదంగా అద్భుత ప్రతిభను కనపరిచినందుకు జమ్మలమడుగు కాలినీ వాసులు అధ్యాపకులు, మిత్రులు,విద్యార్థికి అభినందనలు తెలిపారు.వీరి తల్లి తండ్రులు ఎగ్ చపాతి బండి నడుపుతూ జీవనము సాగిస్తున్నారు.తమ కష్టానికి తగిన ఫలితం తెచ్చినందుకు తల్లితండ్రులు చాలా సంతోషం వ్యక్తము చేసారు.

## వికసించిన విద్యా కుసుమం రాష్ట్రానికి గర్వకారణం అభిజ్ఞ రెడ్డి

మహమ్మదాబాద్, ఏప్రిల్ 12 (ప్రజా జ్యోతి బ్యూరో): మహమ్మదాబాద్ మండలం వెంకట్ రెడ్డిపల్లి గ్రామానికి చెందిన అభిజ్ఞ రెడ్డి ఇంటర్మీడియట్ రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించి జిల్లా, గ్రామానికి గర్వకారణంగా



నిలిచింది. అభిజ్ఞ తల్లి పుష్పలత ప్రభుత్వ ఉపాధ్యాయురాలు కాగా, తండ్రి అంజి రెడ్డి మహమ్మదాబాద్ మండల కేంద్రంలో ప్రైవేట్ పాఠశాలను నిర్వహిస్తున్నారు. చిన్నప్పటి నుంచే చదువుపై ఆసక్తి, క్రమశిక్షణతో ముందుకు సాగిన అభిజ్ఞ తన ప్రాథమిక విద్యను తండ్రి నిర్వహిస్తున్న పాఠశాలలోనే పూర్తిచేసింది. ఆ తర్వాత ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి శ్రీ చైతన్యలో చేరి బై పిసి విభాగంలో 440కి 438 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. ఈ అద్భుత ఫలితంతో కుటుంబ సభ్యులు, గురువులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. “చిన్నప్పటి నుంచే మా కూతురు చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపేది. ఆమె కృషి, పట్టుదల వల్లే ఈ విజయాన్ని సాధించింది. రాష్ట్రంలో మొదటి ర్యాంక్ సాధించడం మా కుటుంబానికి ఎంతో గర్వకారణం” అని తల్లిదండ్రులు తెలిపారు. అభిజ్ఞ రెడ్డి సాధించిన ఈ ఘనత గ్రామ యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని స్థానికులు అభినందనలు తెలియజేస్తున్నారు.

## గద్వాల జిల్లాకే పేరుతెచ్చిన నిరుపేద కుటుంబం నుంచి 994 మార్కులు ఎ.రాజు అద్భుత విజయం

-ఇంటర్ బైపీస్ లో 994 మార్కులు సాధించిన ఎ. రాజు గద్వాల యువకుడి ఘనత
-పేదరికాన్ని జయించి టాప్ స్కోర్ ట్రినిటీ కాలేజీ విద్యార్థి ఎ.రాజు 994 మార్కులతో



గద్వాల (ప్రజా జ్యోతి) ఏప్రిల్ 12: ఇంటర్మీడియట్ ఏప్రిల్ 12వ తారీఖున ఆదివారం ఫలితాలు వెలువడగా ట్రినిటీ కళాశాలలో ఇంటర్ బైపీసీలో ప్రభంజనం సృష్టించిన ఏకైక విద్యార్థి ఎ.రాజు.ప్రతిభకు పేదరికం అడ్డుకాదని మరోసారి నిరూపించాడు. కరీంనగర్ జిల్లాలో ట్రినిటీ కళాశాలలో విద్యార్థి ఎ.రాజు ఇంటర్మీడియట్ బైపీసీలో 1000 మార్క్ లకు గను994 మార్కులు సాధించి అద్భుత ప్రతిభ సత్తా చాటి కనబరిచాడు.విద్యార్థి యొక్క పూర్తి బయోడేటా జోగులాంబ గద్వాల జిల్లా,గద్వాల మండలం అనంతపురం గ్రామానికి చెందిన డేవిడ్ శారద దంపతులకు ముగ్గురు సంతానం రెండవ సంతానం ఎ.రాజు నిరుపేద కుటుంబంలో జన్మించాడు కుటుంబ ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా,తన కృషి పట్టుదలతో చదువుపై దృష్టి పెట్టి ఈ గొప్ప విజయాన్ని అందుకున్నాడు.రాజు సాధించిన ఈ ఫలితంపై కాలేజీ యాజమాన్యం, అధ్యాపకులు,గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.అతని విజయాన్ని చూసి ఇతర విద్యార్థులు కూడా ప్రేరణ పొందాలని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.భవిష్యత్తులో డాక్టర్గా మారి ప్రజలకు సేవ చేయాలని రాజు లక్ష్యంగా పెట్టుకున్నాడు.

994 మార్కులతో మెరిసిన ట్రినిటీ కాలేజీ విద్యార్థి ఎ.రాజు. ""ఎ.రాజు మాట్లాడుతూ, పరిస్థితులు ఎలా ఉన్నా కష్టపడి చదివితే తప్పకుండా ఫలితంవస్తుంది.నాతల్లిదండ్రుల ఎంతో కష్టాలలో ఉన్న నన్ను చదివిస్తున్నారు నా గురువులు,తల్లిదండ్రుల సహకారంతో ఈ విజయాన్ని సాధించాను పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు అని తెలిపారు నాగురి నా లక్ష్యం ఒక్కటే మంచి డాక్టర్ అయిన తర్వాత ప్రజలకు సేవ చేయాలని నా తల్లిదండ్రుల ఆశయం అని తెలిపారు. "కాలేజీ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ..ఎ.రాజు మా కాలేజీ కి ఎంతో మంచి పేరు తెచ్చినందుకు ఎంతో గర్వకారణంగా ఉంది అతని కృషి,క్రమశిక్షణ ఇతర విద్యార్థులకు ఆదర్శం అని తెలిపారు.

""గ్రామస్తులు మాట్లాడుతూ..మా గ్రామానికి చెందిన ఎ.రాజు ఇంత మంచి మార్కులు సాధించడం చాలా గర్వంగా ఉంది.ఇంకా ఉన్నత స్థాయికి చేరాలని గ్రామస్తులు బందువులు కోరుకుంటున్నారు.

## ఇంటర్ ఫలితాల్లో జోగులాంబ గద్వాల జిల్లా మెరుగైన ప్రదర్శన-కలెక్టర్ ప్రశంసలు

గద్వాల ఏప్రిల్ 12(ప్రజా జ్యోతి ప్రతినిధి): జోగులాంబ గద్వాల జిల్లా విద్యార్థులు ఆదివారం విడుదలైన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో ప్రతిభ చాటినట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు.ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంటర్మీడియట్ 2025–2026 విద్యాసంవత్సరానికి సంబంధించి జిల్లాలో మొదటి సంవత్సరం రెగ్యులర్ విద్యార్థులు 3,482 మంది పరీక్షలకు హాజరుకాగా,2,161 మంది ఉత్తీర్ణత సాధించారు.దీంతో 62.06 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా,రాష్ట్రంలో జిల్లా 18వ స్థానంలో నిలిచింది.

మొదటి సంవత్సరం వృత్తిపర (ఒకేషనల్) కోర్సుల విద్యార్థులు 884 మంది పరీక్షలు రాయగా,612 మంది ఉత్తీర్ణత సాధించి 69.23 శాతం ఫలితాలతో రాష్ట్రంలో నాలుగవ స్థానంలో నిలిచారు.ద్వితీయ సంవత్సరంలో జనరల్ విభాగానికి చెందిన 2,994 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరై,2,186 మంది ఉత్తీర్ణత సాధించారు.73.01 శాతం ఉత్తీర్ణతతో జిల్లా రాష్ట్రంలో 14వ స్థానాన్ని సాధించింది. వృత్తిపర ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 706 మంది పరీక్షలు రాయగా,532 మంది ఉత్తీర్ణత



సాధించి 75.04 శాతం ఫలితాలతో రాష్ట్రంలో 13వ స్థానంలో నిలిచారు.గత రెండేళ్లతో పోలిస్తే ఈ విద్యా సంవత్సరంలో మెరుగైన ఫలితాలు రావడంతో జిల్లా కలెక్టర్ విద్యార్థులను,డీఐఈఓ హృదయ్ రాజ్‌ను,అలాగే ఇంటర్ విద్యా యంత్రాంగాన్ని అభినందించారు.ఇదే ఉత్సాహంతో ముందుకు సాగితే రాబోయే 2026–2027 విద్యాసంవత్సరంలో జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలపవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ దిశగా ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారులు,అధ్యాపకులు,విద్యార్థులకు కలెక్టర్ పిలుపునిచ్చారు.

## ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని మంత్రి జూపల్లి ప్రారంభించారు

మంత్రి చిరుకానుకగా చిన్నారులకు శాలువతో సన్మానం

కొల్లాపూర్ ఏప్రిల్ 12 ప్రజా జ్యోతి కొల్లాపూర్ నియోజక వర్గం మండల పరిధిలో ఉన్న సింగోటం గ్రామంలో ఇందిరమ్మ ఇంటికి భూమి పూజ చేసిన మంత్రి జూపల్లి.నమ్ముకున్న



కుటుంబానికి అండగా నిలిచిన మంత్రి కొల్లాపూర్ మండలం సింగోటం గ్రామంలో జ్యోతి భర్త వెంకట్ అనే మహిళా కుటుంబం ఎన్నో సంవత్సరాలుగా సొంత ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్నారు వారికి అండగా నిలిచి మంత్రి జూపల్లి, కృష్ణారావు నియోజకవర్గంలో ఉన్న ప్రజల అందరిని సొంత మనుషులు భావించే జూపల్లి. బడుగు బలహీన వర్గాల ప్రజలకు వారికి ఇల్లు లేదనే విషయాన్ని మంత్రి జూపల్లి తెలుసుకొని వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించి, ఆదివారం రోజు సింగోటం గ్రామంలో ఇందిరమ్మ ఇంటి భూమి పూజ కార్యక్రమంలో స్వయంగా మంత్రి జూపల్లి కృష్ణారావు గారు పాల్గొని. ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని మంత్రి జూపల్లి ప్రారంభించారు, అదేవిధంగా చిన్నారులకు శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో. మాజీ ప్రజా ప్రతినిధులు అధికారులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కొల్లాపూర్‌కు రైల్వే లైన్ తెచ్చే బాధ్యత మంత్రి, ఎంపీలదే - సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి డిమాండ్

కొల్లాపూర్ ఏప్రిల్ 12 ప్రజా జ్యోతి దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న జడ్చర్ల కొల్లాపూర్ నంద్యాల రైల్వే లైన్‌ను తక్షణం





సాధించాల్సిన బాధ్యత రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు మరియు స్థానిక ఎంపీ మల్లు రవి దేనని సిపిఐ జాతీయ కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి స్పష్టం చేశారు.ఆదివారం రోజు కొల్లాపూర్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించిన కొల్లాపూర్ గర్జన మహా ధర్నాలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.ఎం.డి. ఫయాజ్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా పల్లా వెంకటరెడ్డి మాట్లాడుతూ, కొల్లాపూర్ ప్రాంత అభివృద్ధికి కీలకమైన ఈ రైల్వే లైన్ కోసం సిపిఐ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు.ఈ అంశాన్ని పార్లమెంట్‌లో ముఖ్యంగా రాజ్యసభలో ప్రస్తావించేందుకు సిపిఐ ఎంపీలతో కలిసి కృషి చేస్తామని వెల్లడించారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఎప్పుడూ ముందుండే పార్టీ సిపిఐ అని పేర్కొంటూ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ఆర్టీసీ డిపో కొల్లాపూర్ రెవెన్యూ డివిజన్ వంటి అనేక ప్రజా ఉద్యమాలను విజయవంతంగా నడిపిన చరిత్ర సిపిఐకి ఉందని గుర్తుచేశారు. రైల్వే లైన్ సాధన కోసం కూడా ప్రజలందరూ రాజకీయాలకు అతీతంగా ఏకమై పోరాడాలని పిలుపునిచ్చారు.సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం. బాల నరసింహ మాట్లాడుతూ, మంత్రి జూపల్లి కృష్ణారావు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి రైల్వే ప్రాజెక్టుకు అవసరమైన నిధుల్లో రాష్ట్ర భాగస్వామ్యాన్ని సాధించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే ఎంపీ మల్లు రవి ఈ అంశాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావించి, కొల్లాపూర్ ప్రాంతానికి న్యాయం చేయాలని కోరారు.కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు టి నరసింహ పెబ్బేటి విజయుడు ఆర్ ఇంద్ర కొల్లాపూర్ మండల కార్యదర్శి తుమ్మల శివుడు పెద్దకొత్తపల్లి మండల కార్యదర్శి బొల్లెద్దుల శ్రీనివాసులు కోడేరు మండల పార్టీ కార్యదర్శి తప్పేట కిరణ్ కుమార్ కొల్లాపూర్ పట్టణ కార్యదర్శి ఎండి యూసుఫ్ సహాయ కార్యదర్శి రమణ ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రేమ్ కుమార్ డి హెచ్ పి ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి

బండి లక్ష్మీపతి జిల్లా ప్రధాన కార్యదర్శి బి శ్రీనివాసులు జి కురుమయ్య డాక్టర్ సి హె శ్రీనివాసులు పి పర్శరాములు నాయకులు లక్ష్మీనారాయణ దేవస్థానం నిరంజన్ నాయుడు కృష్ణ ఇటికల కురుమయ్య సంఘం కృష్ణ రాము రాధాకృష్ణ జి వెంకటస్వామి రామకృష్ణ బి గోపాల్ మండల కృష్ణ బండి వెంకటమ్మ కాటం బాలస్వామి దండి

కురుమయ్య ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు పర్వతాలు నరసింహ సుదర్శన్ గౌడ్ చందు మధు కవిత నరసింహ తదితరులు పాల్గొన్నారు .

## వడ్డేపల్లిలో ఇందిరమ్మ ఇంటి ప్రారంభోత్సవం

వడ్డేపల్లి ఏప్రిల్ 12(ప్రజా జ్యోతి): ఆదివారం వడ్డేపల్లి మండల కేంద్రంలో ఏఐసీసీ కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్ ఏ సంపత్ కుమార్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటిని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించడం జరిగింది.ఈ కార్యక్రమంలో గద్వాల జిల్లా గ్రంధాలయ కమిటీ చైర్మన్ నీలి శ్రీనివాస్, వడ్డేపల్లి మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి,ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు దేవేంద్ర, మైనారిటీ విద్యార్థి నాయకులు నవాజ్,తదితర ముఖ్య నాయకులు హాజరయ్యారు.



## అధికారుల నిర్లక్ష్యపు నీడలో కోటకొండ ఆయుర్వేదిక్ హాస్పిటల్

- రెగ్యులర్ డాక్టర్ నియమించి ప్రజలకు పూర్తిస్థాయి వైద్యం అందుబాటులోకి తేవాలి
- సిపిఐ (ఎంఎల్ )మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి కాశీనాథ్ డిమాండ్

నారాయణపేట నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 12( ప్రజా జ్యోతి) నారాయణపేట మండలం కోటకొండ గ్రామంలో ప్రభుత్వ భవనాలైన ఆయుర్వేదిక్ వైద్యశాల మీద అధికారుల పర్యవేక్షణ నిర్లక్ష్యంతో పూర్తిగా శిథిలావస్థ కు చేరడమే కాకుండా అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారింది . కోటకొండ ప్రభుత్వ ఆయుర్వేదిక్ వైద్యశాల, ఇక్కడ డ్యూటీ చేయాల్సిన డాక్టర్ ఎక్కడో వరంగల్ జిల్లా లో డిప్టేషన్ గా కొనసాగడానికి అనుమతి ఇచ్చినారు. కానీ కోటకొండ హాస్పిటల్ నుంచి జీతం తీసుకుంటూ, ఇక్కడి





ఆయుర్వేదిక్ వైద్యశాల ను నిర్లక్ష్యానికి గురి చేస్తున్నారు. ఆయుర్వేదిక్ వైద్య అధికారులు, దీని మీద దృష్టి సారించకపోవడం ఎవరు అడగడం లేదని దాదాపుగా మూడు నాలుగు సంవత్సరాల నుండి నిర్లక్ష్యానికి గురవుతుంది. ఇక్కడ డ్యూటీ చేయాల్సిన రెగ్యులర్ డాక్టర్ వరంగల్ లో తన పలుకుబడితో డిప్టేషన్ గా అక్కడ డ్యూటీ చేస్తున్నారు. జీతం మాత్రం కోటకొండ ఆస్పత్రి పేరు మీద నుండి తీసుకుంటున్నారు. ప్రజలకు అందించాల్సిన మందులు ఎందుకు పనికి రాకుండా పోతున్నాయి. ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వ అధికారులు, లక్షలతో నూతన హాస్పిటల్ బిల్డింగ్, ఆరోగ్య స్వస్థత కేంద్రం నిర్మించి చేతులు దులుపుకున్నారు. కనీసం అక్కడ ఒక అటెండర్ను కూడా, నియమించకపోవడం విడ్డూరం. ఆయుర్వేదిక్ హాస్పిటల్ లో మందులు ఈపాటికి పూర్తిగా అయిపోయి, వాడటానికి పనికి రాకుండా ఎన్నో సంవత్సరాలు గడుస్తుంది. టైం దాటిపోయి ఉన్నాయి. అయినా దీని మీద అధికారలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నరూ, ఒకప్పుడు కోటకొండ గ్రామంలో ఆయుర్వేదిక్ హాస్పిటల్ ఎంతో ప్రాముఖ్యత కలిగి ప్రజలకు మందులను అందించిన చరిత్ర, కోటకొండ ఆయుర్వేదిక్ హాస్పిటల్ కి ఉంది, అలాంటి ఆయుర్వేదిక్ హాస్పిటల్ ను నేడు నూతన జిల్లా అయిన తర్వాత సమీపానికి వచ్చిన జిల్లా అధికారులు, కూతబెట్టి దూరంలో ఉన్న కోటకొండ ఆయుర్వేదిక్ హాస్పిటల్ పర్యావేక్షణ చేయకపోవడం పనితనానికి నిదర్శనం. దాంతో అసాంఘిక కార్యక్రమాలకు చెడు వ్యసనాలకు నిలయంగా మరి నా కోటకొండ ఆయుర్వేదిక్ హాస్పిటల్ దుస్థితి, దీనంతటికీ ప్రధాన కారణం జిల్లా మరియు ఆయుర్వేదిక్ వైద్యాధికారుల నిర్లక్ష్యం,ఇప్పటికైనా ఇక్కడ రెగ్యులర్ డాక్టర్,ఫార్మసిస్ట్ ను అటెండర్ ను నియమించి, కోటకొండ ప్రభుత్వ ఆయుర్వేదిక్ హాస్పిటల్ ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కె. కాశీనాథ్ సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ జిల్లా నాయకులు డిమాండ్ చేస్తున్నారు

## అయిజలో రెండు బైక్‌ల ఢీకొనడం ముగ్గురికి గాయాలు

-ఒకరి పరిస్థితి విషమం గద్వాల్ ఆసుపత్రికి తరలింపు

ఐజ (ప్రజా జ్యోతి) ఏప్రిల్ 12: జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం గద్వాల రోడ్డులోని ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనచోటుచేసుకుంది.ఈ ప్రమాదంలో బైక్‌లపై ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. గాయపడిన వారిని స్థానికులు వెంటనే అయిజ ప్రభుత్వ ఆసుపత్రికి



తరలించి చికిత్స అందించారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం గద్వాల్ ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు. గాయపడిన వారిలో ఇద్దరు మల్దకల్ మండలం పెద్దోడి గ్రామానికి చెందినవారిగా, మరో వ్యక్తి కర్నూలు జిల్లా గోనెగండ్ల గ్రామానికి చెందినవాడిగా గుర్తించారు.ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి.

## వివాహ వేడుకలో పుస్తె మెట్టెలు అందజేసిన వెంకటేష్ యాదవ్ దంపతులు

అలంపూర్,ఎర్రవల్లి మండలం (ప్రజా జ్యోతి) ఏప్రిల్ 12: అలంపూర్ నియోజకవర్గం ఎర్రవల్లి మండలం పుట్టాన్ దొడ్డి గ్రామంలో ఆదివారం జరిగిన మహేష్–సహస్ర వివాహ వేడుకలో ఎర్రవల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అందెబోయిన్ వెంకటేష్ యాదవ్ దంపతులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా చాకలి విజయలక్ష్మి లక్ష్మన్న కుమారుడు మహేష్ వివాహంలో వధూవరులకు పుస్తె మెట్టెలు అందజేసి ఆశీర్వదించారు.కొత్త దంపతులు పిల్లాపాపలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ప్రజల మధ్య ఎల్లప్పుడూ సేవాభావంతో ఉండే వెంకటేష్ యాదవ్ దంపతులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ పెద్ద మనసును మరోసారి చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామస్థులు,బంధువులు

## చలివేంద్రం ప్రారంభం

**సతీమణి కీ.శే. సుజాత జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన భర్త వెంకట నారాయణ**



**ఖానాపురం/ఏప్రిల్ 12 (ప్రజా జ్యోతి) :** ఖానాపురం మండలం బుధరావుపేట లో ఆదివారం సర్పంచ్ పెసరు రాణి గోవర్ధన్ రెడ్డి, ఉప సర్పంచ్ సింగు సుధాకర్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. గ్రామానికి చెందిన ఆర్ఎంపి వైద్యుడు, ఎల్ఐసి చైర్మన్ క్లబ్ మెంబర్ ఏనుగుతుల వెంకటనారాయణ తన సతీమణి కీ.శే. సుజాత జ్ఞాపకార్థం సొంత ఖర్చులతో చలివేంద్రం ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాణి మాట్లాడుతూ.. గ్రామస్థుల సౌకర్యార్థం తాము అడగగానే చలివేంద్రం ఏర్పాటు చేయించిన వెంకట్ నారాయణ అభినందనీయు డన్నారు. పంచాయతీ పాలకవర్గం, గ్రామ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. చలివేంద్రం దాత వెంకటనారాయణ మాట్లాడుతూ.. సర్పంచ్, పాలకవర్గం కోరిక మేరకు తన కుమారుడు, కోడలు శ్రవణ్ కుమార్ శృతి లతోపాటు వేసవి తీవ్రత దృష్టిలో పెట్టుకొని ప్రజల దాహార్తిని తీర్చడానికి బస్టాండ్ సెంటర్, గ్రామపంచా యతీ ఆవరణలో చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. తనకు అవకాశం కల్పించిన పంచాయతీ పాలకవర్గానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహాలక్ష్మీ వెంకటనర్సయ్య, లింగిడి వెంకటేశ్వర్లు, గిరగాని నర్సయ్య, జల్లి మధు, పసునూరి పులి వెంకన్న, గ్రామ వార్డు మెంబర్లు చెడిపాక శ్రీను, ఎస్.కె రహీం, వల్లపు కుమార్, ఎర్రబెల్లి లచ్చయ్య, ఎస్.కె జుబేరు, నారగోని నవీన్, పసునూరి రమేష్, యాకూబ్ పాషా, అబ్బిడి శ్రీనివాస్ రెడ్డి, మారగాని లింగయ్య, ఎస్.కె లాల్ సాహెబ్, గట్ల సుదర్శన్, గుడిసె సూరయ్య, మహిపాల్, నారగోని సమ్మయ్య, గుండు సాంబయ్య, తండ వీరన్న, పంచాయతీ కారోబార్, సిబ్బంది తదితరులున్నారు.

## వేసవి వేళలో గ్రామ ప్రజలకు అండగా శంకరాజుపల్లి సర్పంచ్ దేవులపల్లి విజయ్ కుమార్

**– వార్డ్ సభ్యురాలి సమక్షంలో నీటి సమస్య పరిష్కారం**



**ఏటూరు నాగారం ఏప్రిల్ 12 ప్రజాజ్యోతి :** మండలంలోనీ శంకరాజుపల్లి గ్రామంలో తీవ్ర వేసవి కారణంగా తాగునీటి కొరత ఏర్పడిన నేపథ్యంలో, గ్రామ సర్పంచ్ దేవులపల్లి విజయ్ కుమార్ ప్రజల ఇబ్బందులను దగ్గరగా గుర్తించి స్వయంగా చర్యలు చేపట్టారు. మండుతున్న ఎండలోనూ వెనుకడుగు వేయకుండా, గ్రామంలోని పాడైన నల్లాలు (ట్యాపులు) పైప్‌లైన్ సమస్యలను స్వయంగా పరిశీలించి మరమ్మ త్తులు చేపట్టడం విశేషం. ఈ కార్యక్రమం 6వ వార్డ్ సభ్యురాలు శ్రీలత–నీలాద్రి సమక్షంలో కొనసాగింది. గ్రామ ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేం దుకు ఇద్దరూ కలిసి కృషి చేయడం గమనార్హం. సాధారణంగా అధికారులపై ఆధారపడే సమయంలో, సర్పంచ్ స్వయంగా పనిలోకి దిగి ప్రజలకు తక్షణ ఉపశమనం కలిగించడం గ్రామ ప్రజల్లో విశ్వాసాన్ని పెంచింది. గ్రామ ప్రజలు కూడా వారి సేవాభావాన్ని ప్రశంసిస్తూ, "ఇలాంటి నాయకత్వం ఉంటే సమస్యలు త్వరగా పరిష్కారం అవుతాయి" అని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. వేసవి తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో, ప్రతి ఇంటికి తాగునీరు అందేలా తక్షణ చర్యలు తీసుకుంటామని సర్పంచ్ దేవులపల్లి విజయ్ కుమార్ గారు తెలిపారు. గ్రామంలో నీటి సరఫరా వ్యవస్థను పూర్తిగా మెరుగుపరచడానికి అవసరమైన చర్యలు కొనసాగుతున్నా యని ఆయన చెప్పారు. ప్రజలకు సేవే లక్ష్యంగా పనిచేస్తున్న సర్పంచ్ మరియు వార్డ్ సభ్యురాలికి గ్రామ ప్రజల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

## విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం సమాజాభివృద్ధికి ఎంతో కీలకం

**– ఇన్‌స్పైర్ ఐఐటి ఎక్సలెన్స్ అవార్డ్స్‌లో పాల్గొన్న టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సి రాజేందర్ రెడ్డి**



**రాయపర్తి ఏప్రిల్ 12, ప్రజా జ్యోతి :** ఇన్‌స్పైర్ ఐఐటి ఎక్సలెన్స్ అవార్డ్స్ 2026 కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సి రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని మరింత



గౌరవప్రదంగా మార్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం సమాజ అభివృద్ధికి ఎంతో కీలకమని పేర్కొన్నారు. పాఠశాల స్థాయి నుండి మెరుగైన ప్రతిభ కనబరిచే విద్యార్థులను గుర్తించి సన్మానించడం ద్వారా వారికి మరింత ఉత్సాహం కలుగుతుందని తెలిపారు. భవిష్యత్తులో దేశ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలంటే ఇలాంటి కార్యక్రమాలు మరింత అవసరమని వారు అన్నారు.. విద్యా ప్రతిభను, పాఠశాల టాపర్లను గౌరవించేందుకు ఇన్‌స్పైర్ ఐఐటి ఓ నీట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని పేర్కొంటూ నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల లక్ష్యసాధనకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అందించే సహకారం కూడా ఎంతో ముఖ్యమని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రతిభావంతులైన విద్యార్థులకు సర్టిఫికెట్లు, స్మారక చిహ్నాలు అందజేసి వారిని సత్కరించారు. కార్యక్రమంలో పలువురు విద్యావేత్తలు, ప్రముఖులు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

**తెలుగు భాష దైవ భాష తెలుగు భాషలో**

## త్రైత శకం 48 కాలసూచిక క్యాలెండర్ ఆవిష్కరణ



**ఎల్కతుర్తి ఏప్రిల్ 12 (ప్రజా జ్యోతి) :** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం వల్బాపూర్ గ్రామం శ్రీ పశుపతినాథ్ దేవస్థానం ఆలయ అర్చకులు ధూప దీప నైవేద్య సంఘం, మరియు ప్రబోధ సేవా సమితి ఎల్కతుర్తి శాఖ మండల అధ్యక్షుడు సదానిరంజన్ సిద్ధాంతి మాట్లాడుతూ, శ్రీ పరభావ నామ సంవత్సర నూతన తెలుగు క్యాలెండర్ ను రైతు రక్షణ సమితి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్ చేతుల మీదుగా త్రైత శకం 48వ కాలసూచిక క్యాలెండర్ను ఆవిష్కరించారు. అని తెలియ చేస్తూ. శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగేశ్వర్లు 1978లో శ్రీ కాలయుక్తి నామ సంవత్స రంలో ప్రబోధ ఆశ్రమాన్ని స్థాపించినప్పటి నుండి"త్రైత శకం"ప్రారంభమైం దని తెలిపారు. ప్రస్తుత శ్రీ పరభావ నామ సంవత్సరంలో త్రైత శకం–48వ సంవత్సరంలోకి ప్రవేశించిందని చెప్పారు. యోగేశ్వరులు సమాజానికి శాస్త్రబద్ధమైన ఆత్మజ్ఞానాన్ని అందించేందుకు" త్రైత సిద్ధాంతం"ను ప్రతిపా దించి ప్రచారం చేసినట్లు పేర్కొన్నారు. భారతదేశంలో ఉన్న అద్వైతం, విశిష్టాద్వైతం, ద్వైతం, సిద్ధాంతాలకంటే భిన్నంగా, పరమాత్మ, ఆత్మ, జీవాత్మ అనే మూడు ఆత్మలపై ఆధారపడి ఉన్న త్రైత సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టారని వివరించారు. యోగేశ్వర్లు రచించిన "త్రైత సిద్ధాంత భగవద్గీత"గ్రంథం శ్రీకృష్ణుని నిజ భావాన్ని వివరిస్తూ విశిష్ట స్థానం సంపాదించిందని చెప్పారు. భగవద్గీత తో పాటు ఇతర దైవ గ్రంథాలలోని జ్ఞానం ఏకరూపమైందని, ప్రజలు కులమతాలకు అతీతంగా దైవ గ్రంథాలను అధ్యయనం చేయాలని ఆయన బోధించినట్లు తెలిపారు. బ్రహ్మ, కర్మ, భక్తి యోగాలపై వివరణతో పాటు, ఆధ్యాత్మిక రహస్యాలను వెల్లడించే 100కు పైగా గ్రంథాలు, 200కు పైగా ప్రవచనాలను యోగీశ్వరులు సమాజానికి అందించారని చెప్పారు. "తెలుగు భాష దైవభాష"అని ప్రకటిస్తూ తెలుగు భాష గొప్పతనాన్ని చాటేం దుకు ఆయన విశేష కృషి చేశారని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక రంగంలో 100కు పైగా గ్రంథాలను రచించిన ఏకైక వ్యక్తిగా యోగేశ్వర్లను గుర్తిస్తూ, ఆయన నిర్మించిన ప్రబోధాశ్రమం మరియు సేవలను "తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్" లో నమోదు చేసి సత్కరించినట్లు తెలిపారు. మన పండుగలు గ్రంథం ద్వారా యుగాది పండుగ విశిష్టతను వివరించిన యోగేశ్వర్లు, యుగాది నుండి ప్రకృతి గ్రహాల ప్రభావం మనిషి జీవనంలో మార్పులు సంభవిస్తా యని తెలిపారు. తెలుగు మాసాలు స్థితులతో కూడిన కాలసూచికను ప్రతి ఒక్కరూ అనుసరించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు హింగే భాస్కర్ మాట్లాడుతూ, సరళమైన తెలుగు భాషలో రూపొందించిన ఈ క్యాలెండర్ ప్రతి ఒక్కరికి ఉపయోగంగా ఉంటుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రబోధా సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక ఎల్కతుర్తి కమిటీ అధ్యక్షుడు సదా నిరంజన్ సిద్ధాంతి రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్, జిల్లా ఉపాధ్యక్షుడు హింగే రవీందర్, రైతు నాయకులు ఎర్రబెల్లి రవీందర్ రావు, భాష బోయిన కుమార్ యాదవ్, అంబాల ప్రవీణ్, విజయ్, రాకేష్, స్రవంతి, రాణి, అనూష, దివిజ, క్షేత్రజ్ఞ, ఋషి, మోక్షజ్ఞ, తదితరులు పాల్గొన్నారు.

**కృత్రిమ మేధస్సుతో స్థిర సాంకేతికతలపై**

## జాతీయ స్థాయి సదస్సు ఘనవిజయం







**హసన్‌పర్తి, ఏప్రిల్ 12 (ప్రజాజ్యోతి) :** వరంగల్‌లోని ఎస్ఆర్ విశ్వవిద్యాలయంలో కృత్రిమ మేధస్సు ఆధారిత ఆవిష్కరణలు, స్థిరమైన సాంకేతిక పరిష్కారాలపై జాతీయ స్థాయి సదస్సు ఆదివారం ఘనంగా నిర్వహించారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నిలకడైన సాంకేతి కతల అభివృద్ధిలో కృత్రిమ మేధస్సు పాత్రపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ఉన్న పరిశోధకులు, అధ్యాప కులు, పరిశ్రమ నిపుణులు, విద్యార్థులు ఒకే వేదికపైకి చేరి నూతన ఆలోచనలను పంచుకున్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నారాయణ కార్యక్రమాన్ని ప్రారంభించి, సాంకేతిక రంగంలో ఆవిష్కరణల ప్రాధాన్యాన్ని వివరించారు. బాల ప్రసాద్ తమ అనుభవాలను వెల్లడించగా, శ్రీనివాస్ జాస్తి పరిశ్రమ ధోరణులు, నిర్వహణ పద్ధతులపై వివరించారు. డా. వి.ఎస్.కే. మూర్తి ఆధునిక విద్యుత్ వ్యవస్థల్లో కృత్రిమ మేధస్సు వినియోగం పై అవగాహన కల్పించారు. పద్మ సాయి విద్యార్థి కార్యకలాపాల ప్రాముఖ్య తను వివరించగా, డి.వి.ఎస్.ఎస్. శివ శర్మ విద్యా రంగ అంశాలపై ప్రసం గించారు. తిరుమల్, సాగర్ గుజ్జునూరు, మహేష్ నీరాటి కూడా భవిష్యత్ ధోరణులు, సాంకేతిక సవాళ్లపై ప్రసంగించారు. సదస్సులో పరస్పర చర్చలు, సాంకేతిక సమావేశాలు, జ్ఞాన వినిమయ కార్యక్రమాలు నిర్వహిం చారు. వివిధ ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సా హంగా పాల్గొన్నారు. సుమారు 150 మంది విద్యార్థి సభ్యులు కార్యక్రమ విజయానికి కృషి చేశారు. పాల్గొన్న వారికి ధ్రువపత్రాలు అందజేసి, కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించారు. ఈ కార్యక్రమాన్ని చక్రధర్ అడుపా సమన్వయం చేయగా, విశ్వవిద్యాలయ అధ్యాపక వర్గం సంపూర్ణ సహకారం అందించింది. భవిష్యత్ ఇంజినీర్లు, పరిశోధకుల్లో ఆవిష్కరణ, సహకారం, జ్ఞాన మార్పిడిని ప్రోత్సహించే దిశగా ఈ సదస్సు నిలిచింది.

## అన్నారం డౌన్ స్ట్రీమ్ క్వారీలో ఆగని వసూళ్లు

**యజమాన్యం డిమాండ్... పైసలు ఇస్తేనే లోడింగ్**






**భూపాలపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మార్చి 12 (ప్రజా జ్యోతి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని అన్నారం డౌన్ స్ట్రీమ్ ఇసుక క్వారీలో వసూళ్లు మాత్రం ఆగడం లేదు క్వారీ యజమాన్యం అక్రమంగా వసూలు చేస్తూ సొమ్ము చేసుకోవడం తప్ప వారికి నియమ నిబంధనలు పట్టింపు లేకుండా పోవడం దీనికి అధికారులు వత్తాసు పలుకుతున్నారా అనే అనుమానం సైతం వ్యక్తం అవుతుంది. ఒక్కో లారీకి 1500 నుండి 2000 వరకు వసూలు చేస్తూ యేదేచ్ఛగా కాంట్రాక్టర్లు ఇష్ట రాజ్యాలు ఏలుతున్నారని యజమాన్యం డిమాండ్ తోనే డబ్బులు వసూలు చేస్తూ ప్రభుత్వ నియమ నిబంధనలు గాలికొదిలేస్తూ అక్రమ సంపాదన తప్ప మరోటి లేదని స్పష్టంగా అర్థమవుతుంది. సంబంధిత అధికారులు అక్రమ వసూలు చేస్తున్న అన్నారం డౌన్ స్ట్రీమ్ క్వారీపై చర్యలు తీసుకోవలసిన బాధ్యత ఎంతైనా ఉంది.

## ఆదివాసి ఎరుకల కులస్తులను గుర్తించండి

- **తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు**
- **నూతన మండల అధ్యక్షులుగా జగన్నాథం రాంబాబు**




**ఏటూరు నాగారం ఏప్రిల్ 12 ప్రజా జ్యోతి :** ఆదివాసీల ఎరుకల కులస్తులను గుర్తించాలని తెలంగాణ ఆదివాసి ఏరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఏటూరు నాగారం గిరిజన భవన్ లో తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షులు లోకిని రాజు హాజరై మాట్లాడారు. ఆదివాసి ఎరుకల కులస్తులు బతుకులు దారిద్ర రేఖలు కొనసాగుతున్నాయని తట్టలు బుట్టలు అల్లుకొని కొనసాగించే జీవించే బ్రతుకులు ఎరుకల కులస్తులు అని వారిని ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలని కోరారు. మే 1న ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని రామంజపురం గ్రామంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని అన్నారు. జాతరకు వచ్చి ప్రతి ఒక్క కుటుంబం పూజలు చేసుకోవాలని పిలుపునిచ్చారు. గత ఎనిమిది సంవత్సరాలు గా జాతరకు రాష్ట్రం నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి ఎరుకల కులస్తులు, భక్తులు హాజరవుతారని వారికి అన్ని రకాల వసతులు కల్పించేలా ఆదివాసి ఎరుకల సంఘం పనిచేస్తుందన్నారు. రామానుజాపూర్ గ్రామ పరిధిలో కాకతీయుల కాలంలో నిర్మించిన ఐదు శివలింగాలతో కూడిన పంచకూటాలయంగా పిలవబడే నాంచారమ్మ ఆలయం ఎంతో విశిష్టమైనదన్నారు. అభివృద్ధి పేరుతో విప్పి కుప్పపెట్టిన ఆలయాన్ని పునర్నిర్మించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. జాతరకు వచ్చే భక్తుల కోసం అన్ని రకాల ఏర్పాట్లు కల్పించేలా అధికారులు పనిచేయాలని కోరారు. మే ఒకటి న జరిగే నాంచారమ్మ జాతరలో ప్రతి ఏడాది భక్తుల సంఖ్య పెరుగుతోందని, నాంచారమ్మ ఆదివాసుల సంప్రదాయాలకు అనుగుణంగా జాతరను నిర్వహిస్తామని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఏటూరు నాగారం

మండల కమిటీ అధ్యక్షులుగా జగన్నాథం రాంబాబు, గౌరవ ఆధ్యక్షులుగా జగన్నాథం సమ్మయ్య, ప్రధాన కార్యదర్శిగా జగన్నాథం సాగర్, ఉపాధ్యక్షులుగా సాల్ల సాంబయ్య, కోశాధికారిగా కేతుల సారయ్య, సహాయ కార్యదర్శి రేవల్లి కిరణ్, మహిళ మండల అధ్యక్షులుగా శ్రీరాముల సారమ్మ ప్రధాన కార్యదర్శి కేతిరి రజిత ఉపాధ్యక్షులు కేతిరి స్వరూప కోశాధికారి సుల్తాన్ సారమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లకొండ ఎల్లస్వామి, ఉపాధ్యక్షులు మేడ బంగారయ్య, సాల బాబు, మానుపాటి రమేష్, ఓలి సదానందం, పులి సేరు సారయ్య,సుల్తాన్ రాజయ్య, కేతిరి రాములు, రమేష్ సాల రాములు, కెమ్ సర్తి రమేష్ , కేతిరి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## ఆకుల సమ్మయ్య తల్లి చిత్రపటానికి ఘన నివాళులు

**అర్పించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు**



**రాయపర్తి ఏప్రిల్ 12 ప్రజా జ్యోతి :** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం పెరికేడు గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఆకుల సమ్మయ్య తల్లి ఆకుల కమలమ్మ ఇటీవల మరణించగా, ఆదివారం వారి చిత్రపటానికి నివాళ్లు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించిన రాష్ట్ర మాజీ మంత్రి, పాలకుర్తి బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ఎర్రబెల్లి దయాకర్ రావు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## గుగులోత్ మహేశ్వరీ చిత్రపటానికి నివాళులు

**– అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు**

**– నేరస్తులను కఠినంగా శిక్షించి బాధ్యత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్**



**రాయపర్తి ఏప్రిల్ 12 ప్రజా జ్యోతి :** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం ఏ కే తండా గ్రామంలో కామాంధుల చేతిలో హత్య చేయబడ్డ, గుగులోత్ మహేశ్వరీ చిత్రపటానికి ఆదివారం ఘనంగా నివాళ్లు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి తక్షణమే ఈ హత్య కు కారణం అయిన నేరస్తులను కఠినంగా శిక్షించి, బాధిత కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలనీ డిమాండ్ చేసిన రాష్ట్ర మాజీ మంత్రి, పాలకుర్తి బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ఎర్రబెల్లి దయాకర్ రావు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## నెక్కొండ గురుకుల విద్యార్థినుల రికార్డు

- **ఇంటర్ ఫలితాల్లో స్టేట్ ర్యాంకులతో ప్రభంజనం**
- **కార్పొరేట్ సంస్థలకు దీటుగా గురుకుల బాలికల ప్రతిభ ఎంపీసీ, బైపీసీలో మార్కుల సునామీ**




**నెక్కొండ ఏప్రిల్ 12 (ప్రజా జ్యోతి) :** నెక్కొండ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ బాలికల గురుకుల కళాశాల విద్యార్థినులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయి మార్కులతో సరికొత్త రికార్డు సృష్టించారు. ద్వితీయ సంవత్సర ఎంపీసీ విభాగంలో పి.హేమశ్రీ 993 మార్కులతో టాపర్‌గా నిలవగా, ఎం.వైష్ణవి, ఎల్.నాగశ్రీ, ఎం.జాహ్నవి, జి.అక్షిత 990 మార్కులతో సత్తా చాటారు; బైపీసీలో ఆర్. దేవిక 989, పి.భవాని 988, కె.అంజలి 986 మార్కులతో అత్యుత్తమ ఫలితాలు సాధించారు. ప్రథమ సంవత్సర ఎంపీసీలో యు.తేజస్వి, బి.లక్ష్మి ప్రసన్న 467 మార్కులు, ఎ.హారిక, ఓ.శిరీష, జి.కిరణ్మయస్విత, సి.హెచ్. శ్రీజ 466 మార్కులతో రాణించగా, బైపీసీలో జి.లాస్య 436, ఎం.శ్రీజ, ఎం.డి.నజీమా, వి.నక్షత్ర 434, జి.జానుశ్రీ, ఎస్.సాహిత్య 433 మార్కులతో ప్రభంజనం సృష్టించినందుకు కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థినులను ప్రత్యేకంగా అభినందించారు.

## చర్చలకు పిలువకుండా కాలయాపన చేస్తుంది

**విద్యుత్ డివిజన్ జాయింట్ సెక్రటరీ కిరణ్ గౌడ్**

**ప్రజాజ్యోతి -మొగుళ్ళ పల్లి (ఏప్రిల్ 12) :** విద్యుత్ ఆర్టిజన్, అన్ మ్యాండ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 8నుండి చెప్పట్టిన సమ్మె 5రోజులు అవుతున్న ఇప్పటివరకు యాజమాన్యం, ప్రభుత్వం పట్టించుకోకుండా చర్చలకు పిలువకుండా కాలయాపన చేస్తుందని విద్యుత్ జేఏసి డివిజన్ జాయింట్ సెక్రటరీ వేముల కిరణ్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు.ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు.సమాజానికి వెలుగుని పంచెందుకు ప్రాణాలను సైతం పణంగా పెట్టి, విధి నిర్వాహనే ఆరాధ్య దైవంగా భావిస్తూ రాత్రింబవళ్లు నిరంతరం శ్రమించే కరెంటోళ్ల ను పట్టించుకోకపోగా జెన్ కోలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులను కొంతమంది అధికారులు, యూనియన్ లీడర్లు కలిసి కార్మికులను భయబ్రాంతులకు గురిచేసి డ్యూటీ చేసే విధంగా ప్రోత్సహించడం హేయమైన చర్య అన్నారు.తెలంగాణ విద్యుత్ సంస్థలోని ట్రాన్స్ కో, జెన్ కో, టిజీ ఎస్పీడీసీఎల్, టీజీ ఎన్పీడీసీఎల్, సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్, అన్ మ్యాండ్ కార్మికులు 9 ట్రేడ్ యూనియన్ సంఘాలు ఏకతాటిపైకి వచ్చి జేఏసీగా ఏర్పడి ఉమ్మడి పోరుకు దిగారని రాష్ట్రవ్యాప్తంగా సుమారుగా 19061 మంది ఆర్టిజన్లుగా సేవలందిస్తుండగా ఆర్టిజన్ కార్మికులను ఏపీ ఎస్ఈబీ రూల్స్ అమలు చేయాలని, అన్ మ్యాండ్ కార్మికులను సంస్థల విలీనం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. చనిపోయిన కార్మికుని కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. విద్యుత్ సంస్థల పని చేస్తున్న ఫేసరేట్ కార్మికులకు జీవో 11 ప్రకారం కనీస వేతనం అమలు చేయాలని యాజమాన్యాన్ని కోరారు.



కార్మికులు సమ్మె నోటీసు ఇచ్చి రోజులు గడిచిన పలు దాపాలుగా నిరసన కార్యక్రమాలు తెలిపిన యాజమాన్యం గాని, ప్రభుత్వం గానీ, చర్చలకు పిలవకుండా కరెంటు కార్మికులపై కనికరం లేకుండా కాలయాపన చేస్తూ కార్మికుల జీవితాలతో ఆడుకుంటుందన్నారు.తమ సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు. ప్రస్తుత విద్యుత్ శాఖ మంత్రి నాటి సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఆదిలాబాద్ నుండి ప్రారంభించిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆర్టిజన్, అన్ మ్యాండ్ కార్మికులను కన్వర్షన్ చేస్తామని అన్ మ్యాండ్ కార్మికులను ఆర్టిజన్ గా గుర్తించి వివిధ రకాల సమస్యలను పరిష్కరిస్తామని ఇచ్చిన హామీని అమలు చేస్తూ, వేలాది విద్యుత్ కార్మికుల కుటుంబాల్లో వెలుగులు నింపాలని ప్రభుత్వాన్ని,యాజమాన్యాన్ని కోరారు.

## ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటిన కస్తూరిభా విద్యార్థినిలు













**మర్రిగూడ, ఏప్రిల్ 12(ప్రజాజ్యోతి ):** ఆదివారం రోజు తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు విడుదల చేసిన ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో మర్రిగూడ కస్తూరిభా విద్యార్థినిలు సత్తా చాటారు.దుబ్బ వైష్ణవి ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎం.పి.సి లో 470 మార్కులకు గాను 417 మార్కులు సాధించి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో మొదటి ర్యాంక్, చింత దివ్య రాణి 440 మార్కులకు గాను 396 సాధించి ద్వితీయ ర్యాంక్ సాధించారు.ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో బి.శ్రావణి ఎం.పి.సి 1000 మార్కులకు గాను 900 మార్కులు ద్వితీయ సంవత్సరంలో మొదటి ర్యాంక్ ,ఎం. శృతి 1000 మార్కులకు గాను 875 మార్కులు ద్వితీయ ర్యాంక్ సాధించారు.మొత్తం ఇంటర్ ప్రథమ,ద్వితీయ సంవత్సరం కలిపి 93% విద్యార్థినిలు పాస్ అయినట్లు కస్తూర్బా ఎస్.ఓ జ్యోతి తెలిపారు.పాస్ అయిన విద్యార్థినిలకు ఆమె శుభాకాంక్షలు తెలియజేశారు.ప్రభుత్వ కళాశాలల్లోనే విద్యను అభ్యసించే వారికే మెరుగైన ఫలితాలు వస్తాయని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వ విద్య సంస్థలో చదివి విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆమె అన్నారు.

## ఇంటర్ ఫలితాలలో సత్తా చాటిన నాంపల్లి ప్రభుత్వ కళాశాల విద్యార్థులు






**నాంపల్లి, ఏప్రిల్,12(ప్రజా జ్యోతి):** ఆదివారం విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాలలో నాంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు తమ సత్తాను చాటారు..1000 మార్కులకు గాను 981 మార్కులు సాధించి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈ కళాశాలకు చెందిన ఎంపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థి కల్లెట్ల భరత్ .మొదటి సంవత్సరంలో 125 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవ్వగా, 83 మంది ఉత్తీర్ణత సాధించి, 66 శాతం ఫలితాలను సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 121 మంది విద్యార్థులకు గాను 106 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి 88% ఫలితాలను నమోదు చేశారు.

**మట్టిలో మాణిక్యాలు... జిల్లాలో ప్రథమ స్థానం:**
గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ప్రతిభలో కొదవలేదని , మట్టిలో మాణిక్యాలు అని నిరూపించారు. నాంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు..శుక్రవారం వెలువడిన ఫలితాలలో 1000 మార్కులకు గాను ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగానికి చెందిన కల్లెట్ల భరత్ 981 మార్కులు సాధించి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచాడు.. ఇదే విభాగానికి చెందిన కావలి సౌమ్య 978, గుర్రం బిందు భార్గవి 978 మార్కులు సాధించారు.. బైపీసీ ద్వితీయ సంవత్సరంలో కోరె సాయి చరణ్ 945, కొమ్ము శివ 940, సీఈసీ విభాగానికి చెందిన దండిగ రాకేష్ 844, జుట్టు రాఖీ 738 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు..

**మొదటి సంవత్సరంలో..:**
మొదటి సంవత్సరం ఫలితాలలో ఎంపీసీలో 470 మార్కులకు గాను సాదియా సదాఫ్ 459,, కె.చరణ్ గౌడ్ 458, శవ్వ కల్పన 456, బైపీసీలో 440 మార్కులకు గాను జె. శ్యామ్యూల్ తేజ 380, పంబాల పూజ 377, సీసీలో 500 మార్కులకు గాను ఎస్.కె నిషార్ 330, బొంత కిరణ్ కుమార్ 322 మార్కులు పొంది జిల్లాలో ఉత్తమ ఫలితాలను సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ గంధం మోహన్ రావు, కళాశాల అధ్యాపక అధ్యాపక ఇతర సిబ్బంది అభినందించారు.

# తెలంగాణలో గుడిసె ఉండొద్దు

- పార్టీలకు అతీతంగా ఇండ్లు ఇవ్వాలి
- ఇండ్లు కట్టలేని పరిస్థితిలో ఉన్న వారికి మహిళా సంఘాల నుంచి లోన్లు
- ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



**ఆలేరు ఏప్రిల్ 12 ప్రజా జ్యోతి** తెలంగాణ రాష్ట్రంలో గుడిసె ఉండకూడదని ప్రతి ఒక్కరికి ఇండ్ల నిర్మాణం జరగాలని ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆలేరులో డ్రైనేజ్ సమస్య సీసీ రోడ్ల సమస్య తీరుస్తున్నామన్నారు. ఆలేరులో ఇంకా నిరుపేదలు ఉన్న వారికి ఏప్రిల్ చివరి వారంలో రెండో విడత ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. పార్టీలకు అతీతంగా ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడానికి సిద్ధంగా ప్రభుత్వం ఉందన్నారు. మొదటి విడుదల సాంక్షన్ చేసిన ఇందిరమ్మ ఇండ్లు ఆలేరు నియోజకవర్గం లో 1200 ఇండ్లు గృహప్రవేశం చేశారన్నారు. ఇంకా 2000 ఇండ్లు స్లాబ్ దశలో ఉన్నాయన్నారు అవి కూడా తొందరలోనే పూర్తి చేనున్నారన్నారు. ఆలేరులో 12 వార్డులో పేదవారు ఎవరైతే ఉన్నారో ప్రతి వాడికి 10 నుండి 20ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. అందుకు ప్రతి కౌన్సిలర్ అందుబాటులో ఉండి చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం ఉపేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య మహేందర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బీజాన బాలమణి భాస్కర్, టౌన్ అధ్యక్షుడు ఏజస్, మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వరరాజు, మాజీ ఎంపీపీ అశోక్, ముదిగొండ శ్రీకాంత్, వానరాశి మార్క్, తదితరులు పాల్గొన్నారు

# కెమిస్ట్ డ్రగ్గిస్ట్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

- మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి





**భువనగిరి,ఏప్రిల్ 12(ప్రజాజ్యోతి)** ప్రజా పాలన ప్రగతి, ప్రనాళికలో భాగంగా కెమిస్ట్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలు సేవించకూడదని మెడికల్,షాపుల యాజ మాన్యలు, భువనగిరి సాయి బాబా,టెంపుల్ నుండి,ప్రిన్స్ కార్నర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించడం జరిగింది.ఇందులో ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ డ్రగ్స్ కంట్రోలర్ ఏ డి సి,వి,రవి కుమార్,యాదాద్రి జిల్లా వైద్య అధికారి డా,మనోహర్ తెలంగాణ ఆంటీ,నార్కోటిక్ బ్యూరో డి ఎస్పీ ఈగల్ టీం సైదులు, డా,కిరణ్ ఆర్ ఎం ఓ వివేకానంద ఫార్మసి కాలేజ్ ప్రిన్సిపాల్, డా,హేమమాలిని పాల్గొన్నారు.ఈ సందర్భంగా నార్కోటిక్ డైరెక్టర్ మరియు ఈగల్ టీమ్ అధికారి మాట్లాడుతూ డ్రగ్స్,అమ్మకూడదని హెచ్చరించారు,అదే విధంగా యువత గంజాయి లాంటి మత్తు పదార్థాలు సేవించకూడదని అన్నారు.ఆల్ ఫ్రాజ్ నిద్ర వచ్చే మత్తు మందు డాక్టర్ ప్రెస్కిప్షన్,లేకుండ మెడికల్ షాపుల యాజమాన్యం అమ్మ కూడదని అన్నారు.అలాగే డాక్టర్ సలహా మేరకే మందులను వాడాలని, అన్నారు.అదే విధంగా యువకులు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని,మత్తు పదార్థాల జోలికి,వెళ్లి తమ విలువైన జీవితాలను,నాశనం చేసుకో కూడదని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలొ,యాదాద్రి జిల్లా కెమిస్ట్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులుతిరందాస్ ధనుంజయ, జిల్లా సెక్రెటరీ కుక్కుట భాస్కర్ జిల్లా ట్రెజరర్, కొండూరు,భాస్కర్ యాదాద్రి జిల్లా వివిధ మండలాల కెమిస్టడ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సభ్యులు దాదాపు,300 మంది ఈ ర్యాలీ కార్యక్రమానికి హాజర య్యారు.వివేకానంద కాలేజ్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థి విద్యార్థులు సామాజిక కార్యకర్తలు దాదాపు వెయ్యి మంది సభ్యులతో ర్యాలీ నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమం లో రిలీఫ్ మెడికల్ యాజమాన్యం,ఎండీ ముబీన్ బియా బాని,సంతోష్ మెడికల్ హాల్ యాజమాన్యం ఓల్డ్ ప్రిన్స్ మెడికల్ యాజమాన్యం,జాకిర్ న్యూప్రిన్స్ మెడికల్ అక్రమ్,సన,సన ఏజెన్సీ ఖుర్శీద్,ఫ్రైడ్ ఏజెన్సీ జావీద్ ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.



## జర్నలిస్టుల అందరికీ అక్రిడేషన్ కార్డులను ఇవ్వాలి

- ఆలేరు ప్రిన్స్ క్లబ్ డిమాండ్



**ఆలేరు ఏప్రిల్ 12 ప్రజా జ్యోతి** జర్నలిస్టులందరికీ ప్రభుత్వం అక్రిడేషన్ కార్డులను అందించాలని ఆలేరు ఫ్రెండ్స్ క్లబ్ అధ్యక్షులు మహమ్మద్ కుర్షిత్ పాషా డిమాండ్ చేశారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రంలో విలేకరుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ చిన్న పెద్ద పత్రికలు అని చూడకుండా జర్నలిస్టులు అందరికీ అక్రిడేషన్ కార్డులను ప్రభుత్వం అందించేలా దృష్టి సాధించాలని కోరారు. హెల్త్ కార్డులను అందింపజేసి మెరుగైన వైద్య సేవలను కల్పించాలన్నారు. జర్నలిస్టులపై దాడులు జరగకుండా ప్రతిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు ఎర్ర జాన్సన్, తోట మల్లయ్య, గుండు మహేందర్, ఏలగల కుమారస్వామి, సిరిగిరి స్వామి, దూడల సాగర్, కోరుటూరు ఉపేందర్, వంగరి శివకుమార్, సందెన శంకర్, గుండు మధు, మంచన మల్లేశం, బోడ నరేష్, కుల సిద్ధులు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## ఇంటర్ ఫలితాల్లో చరిత్ర సృష్టించిన బెజ్జం చరిత్ర

- 1000 మార్కులకు 991



**దామరచర్ల, ఏప్రిల్ 12,( ప్రజాజ్యోతి ):** మండలంలోని దిలావర్ పూర్ గ్రామ సర్పంచ్ బెజ్జం సాయి ( సైదులు ) కుమార్తె బెజ్జం చరిత్ర ఆదివారం విడుదలైన ఇంటర్ ఫలితాలలో చరిత్ర సృష్టించింది. మొత్తం 1000 మార్కులకు గాను 991 మార్కులు సాధించి అగ్రగామిగా నిలిచింది. మొదటినుండి చదువులో చురుకుగా ఉండే చరిత్రకు హైదరాబాద్ సనత్ నగర్ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో 5వ, తరగతి లో సీటు వచ్చింది. నాటినుండి శ్రద్ధతో చదువుతూ పాఠశాలలో అన్ని తరగతుల్లో మొదటి స్థానంలో ఉత్తీర్ణత సాధిస్తూ,ఇంటర్మీడియట్ లో అత్యధిక మార్కులు సాధించి ఔరా అనిపించింది. అత్యుత్తమ ఫలితం సాధించిన బెజ్జం చరిత్రకు మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్) ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ బెజ్జం సాయి మాట్లాడుతూ రాజ్యాంగ స్ఫూర్తి ప్రదాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్ పుణ్యాన తన కూతురుకు హైదరాబాదులోని మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్లో సీటు రావడం జరిగిందని, ప్రభుత్వం అందించిన సౌకర్యాలను వినియోగించు కుని అత్యుత్తమ ఫలితాలు సాధించిందన్నారు. బెజ్జం చరిత్ర మాట్లాడుతూ మారుమూల పల్లెటూర్లో పుట్టినప్పటికీ రాజ్యాంగం అందించిన సౌకర్యాలను వినియోగించుకొని అత్యుత్తమ ఫలితాలు సాధించానని, ఐఏఎస్ కావటమే తన జీవిత లక్ష్యం అని అన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో రేస్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

- విద్యార్థుల విజయం గర్వకారణం
- రేస్ చైర్మన్ బాణాల వసంత రెడ్డి అభినందనలు




**కోదాడ టౌన్, ఏప్రిల్ 12 ( ప్రజా జ్యోతి):** తెలంగాణ ఇంటర్మీడియట్ ఫలితాల్లో కోదాడ రేస్ ఐఐటీ మెడికల్ అకాడమీ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. కళాశాలకు చెందిన రెడ్డి శ్రీ తేజన్య ఎంపీసీ విభాగంలో 470కి 468 మార్కులు సాధించి రాష్ట్రంలో మొదటి ర్యాంకు పొందగా, సిహెచ్ యామిని 467 మార్కులతో ద్వితీయ ర్యాంకు సాధించారు.అలాగే ఎన్. మౌనిక, జి. భవ్య శ్రీ, ఆర్. శ్రీనిజా రెడ్డి, జైనబ్‌లు 466 మార్కులు సాధించి ప్రతిభ చాటారు.ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ బాణాల వసంత రెడ్డి విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు మరియు అధ్యాపక బృందానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. విద్యార్థుల క్రమశిక్షణ, పట్టుదల, కఠోర శ్రమ వల్లే ఈ అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయని అన్నారు.విద్యార్థుల విజయానికి తోడ్పడిన అధ్యాపకులను ప్రత్యేకంగా అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి విజయాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల వద్ద నీళ్ల సౌకర్యం కల్పించాలి

- ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య




**ఆలేరు ఏప్రిల్ 12 ప్రజా జ్యోతి** ఎండాకాలం దృష్టిలో పెట్టుకొని గ్రామాలలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల వద్ద మంచినీళ్ల సౌకర్యం, టెంట్లు ఏర్పాటు చేయాలని ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అధికారులను కోరారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని గొలనుకొండ కొల్లూరు గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు పండించిన ప్రతి వరి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది అన్నారు. తొందరపడి దళారులను ఆశ్రయించి మోసపోవద్దన్నారు. ఆరుకాలం కష్టం చేసి రెండుమూడు రోజులు ఆరబెట్టి ధాన్యం అమ్మాలి అన్నారు. రైతులకు టార్పిండ్లు గన్ని బ్యాగులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అధికారులను కోరారు. కొన్న ధాన్యానికి రెండు మూడు రోజులలో వారి అకౌంట్లో డబ్బులు పడతాయి అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య మహేందర్ రెడ్డి,మండల తాసిల్దార్ ఆంజనేయులు, మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్, గ్రామ సర్పంచులు ఇందూరి యాదిరెడ్డి, జనగాం సుధారాణి శ్రీపాల్ రెడ్డి, ఉపసర్పంచ్ లు యాదగిరి, దశరథ, సీఈఓ వెంకటరెడ్డి, మాజీ పిఎస్ చైర్మన్ మల్లేష్, గ్రామ శాఖ అధ్యక్షులు శ్రీనివాస్, మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు కృష్ణమూర్తి, మండల బీర్ల ఫౌండేషన్ చైర్మన్ లగ్గాని కుమార్, కొనుగోలు నిర్వాహకులు బందారపు మధు, సంజయ్, వార్డు సభ్యులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

### ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించిన ఫలితాలలో

## విజయభేరి మోగించినశ్రీ వైష్ణవి జూనియర్ కళాశాల

- మాకు మేమే సాటి మాకు రారు ఎవరు పోటీ
- ప్రిన్సిపాల్ మధిర మల్లేశం



**భువనగిరి,ఏప్రిల్ 12(ప్రజాజ్యోతి)**ఇంటర్,బోర్డు ప్రకటించిన,ఫలితాలలొ భువనగిరి పట్టణం లోని,శ్రీ వైష్ణవి జూనియర్ కళాశాల, విజయ దంకా మోగించింది. మొదటి,సంవత్సర ఎంపీసీ విభాగంలో జాయ్ ఇవాంజిఎల్ 466/470, వి,హర్షిత,465,ఎస్,అపూర్వ 465.కే,వైష్ణవి 463.బైపిసి విభాగంలోవి,తేజశ్రీ 436 / 440,,డి కారుణ్య,436,బి శ్రీ వర్షిని 434/440 డి,సాయి సహస్ర 432,సిహెచ్ మాలిక,430 సిఈసి విభాగంలోసానియా ఫాతిమా 488/500.కైరం కొండ అమూల్య 478 షేక్ అబ్దుల్ కలాం 477 ఏంఈ సి విభాగంలో కే,అక్షర 486/500,జి,లహరి 471,మరియు,యాదాద్రి భువనగిరి జిల్లాలోనే అత్యధిక ఉత్తీర్ణత శాతం సాధించిన శ్రీ వైష్ణవి కళాశాల అని కరెస్పాండంట్ మధిర మల్లేశం అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ కళాశాల ఏర్పడిన నాటి,నుండి 2026లొ ప్రకటించిన ఇంటర్ బోర్డు ఫలితాలలో నాటి వరకు శ్రీ వైష్ణవి కళాశాల రాష్ట్ర స్థాయిలొ,జిల్లా స్థాయిలో ప్రథమ ర్యాంకు లు సాధిం చడం జరుగుతుందని అన్నారు.అదే విధంగా తమ కళాశాల లొ చదివే విద్యార్థులు,ఈరోజు ఉన్నత రంగాల్లో స్థిర పడ్డారని అన్నారు.మా వైష్ణవి కళాశాల. ఇటువంటి మార్కులు రావడానికి సహకరించిన అధ్యాపకులకు విద్యార్థుకు తల్లి దండ్రులకు, మరియు శ్రేయోభిలాషులకు పేరు పేరున కృతజ్ఞతలు. తెలుపు తున్నామని అన్నారు. అనంతరం ఉత్తిర్నత సాధించిన విద్యార్థుల కు శుభాకాంక్షలు తెలిపారు.

### జూనియర్ ఇంటర్ ఫలితాలలో

## హాలియా విద్యార్థి స్టేట్ 2 ర్యాంక్

**హాలియా,ఏప్రిల్12(ప్రజా జ్యోతి)** తెలంగాణ ప్రభుత్వం ఆదివారం విడుదల చేసిన ఇంటర్ మిడియట్ ఫలితాలలో నారాయణ



జూనియర్ కళాశాల విద్యార్థి మహమ్మద్ ఇలియాస్ నల్లగొండ జిల్లా హాలియా పట్టణంలోని ఆకాంక్ష పాఠశాల కు చెందిన విద్యార్థి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫలితాలలో ఎంపీసీ విభాగంలో రాష్ట్రస్థాయి లోనే రెండవ ర్యాంక్ సాధించాడు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను 468 మార్కులు సాధించినాడు. రాష్ట్రస్థాయిలో రెండవ ర్యాంకు సాధించిన విద్యార్థిని తల్లిదండ్రులు మహమ్మద్ కరీం,మహమ్మద్ షమీమ్,ఆకాంక్ష పాఠశాల కరస్పాండెంట్ మేడేపల్లి మోహన్ రావు,డైరెక్టర్ ఉన్నం శ్రీనుబాబు, ప్రిన్సిపాల్ మోదాల రవీందర్, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

### టీయు విద్యార్థినికి
## పార్లమెంట్‌లో మాట్లాడే అవకాశం



**నిజామాబాద్ రూరల్: ఏప్రిల్, 12 (ప్రజా జ్యోతి)** తెలంగాణ విశ్వవిద్యాలయం ఆంగ్ల విభాగానికి చెందిన కె. కీర్తనకు పార్లమెంట్‌లో మాట్లాడే అరుదైన అవకాశం లభించింది. "మీ నాయకుడు ఎవరు" కార్యక్రమంలో భాగంగా ఈనెల 14న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా పార్లమెంట్ సెంట్రల్ హాల్లో ప్రసంగించనుంది. తెలంగాణ రాష్ట్రం నుంచి ఎంపికైన ఏకైక విద్యార్థినిగా నిలవడం గర్వకారణమని యూనివర్సిటీ వర్గాలు తెలిపాయి. ఆమెకు వీసీ, రిజిస్ట్రార్, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

### తూంపల్లి, గోప్య
## తండాల్లో వడ్ల కొనుగోలు కేంద్రాల ప్రారంభం
– దళారులను ఆశ్రయించొద్దని రైతులకు సూచన





**నిజామాబాద్ రూరల్: ఏప్రిల్, 12 (ప్రజా జ్యోతి)** సిరికొండ మండలం తూంపల్లి సొసైటీ ఆధ్వర్యంలో తూంపల్లి గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ జింక రాజేందర్, సీఈఓ దేవిలాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ప్రకారం ఏ గ్రేడ్‌కు క్వింటాల్‌కు 2389, బి గ్రేడ్‌కు 2369 చెల్లిస్తున్నందున రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని సూచించారు. దళారులను ఆశ్రయించి మోసపోవద్దని హెచ్చరించారు. అలాగే గోప్య తండాలో స్థానిక కాంగ్రెస్ నాయకుడు, సర్పంచ్ మంజుల భర్త సంతోష్, సీఈఓ దేవిలాల్ కలిసి వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ధాన్యాన్ని విక్రయించాలని, దళారులను దూరంగా ఉంచుకోవాలని రైతులకు సూచించారు. సన్న వడ్లకు ప్రభుత్వం బోనస్ అందిస్తున్నందున ప్రతి రైతు ప్రభుత్వ కేంద్రాలను వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఉప సర్పంచ్ లు, కాంగ్రెస్ నాయకులు నల్ల బుచ్చన్న, సొసైటీ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### ఇంటర్ ఫలితాల్లో
## కామధేను కళాశాల విద్యార్థుల ప్రభంజనం
– 81 శాతం ఉత్తీర్ణతతో మెరుగైన ఫలితాలు



**నిజామాబాద్ రూరల్: ఏప్రిల్, 12 (ప్రజా జ్యోతి)** ఇంటర్మీడియట్ బోర్డ్ ఆదివారం విడుదల చేసిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో సిరికొండ మండలంలోని కామధేను కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటుతూ మెరుగైన ఫలితాలు సాధించారు. మొత్తం విద్యార్థుల్లో 81 శాతం ఉత్తీర్ణత నమోదై కళాశాల ప్రత్యేక గుర్తింపు పొందింది. ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ విభాగంలో డి. యశ్వంత్ (453/470) అగ్రస్థానంలో నిలవగా, ఎం. శ్రావణి (432/470), సి. హెచ్. లక్ష్మిప్రసన్న (422/470) మంచి మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీ విభాగంలో బి. నితిన్ (915/1000), వి. అశ్విత (898/1000) అత్యుత్తమ ఫలితాలు నమోదు చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పుప్పాల లక్ష్మీ నర్సయ్య మాట్లాడుతూ విద్యార్థుల కృషి, అధ్యాపకుల శ్రమ ఫలితంగా ఈ విజయాలు సాధ్యమయ్యాయని తెలిపారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ప్రశాంత్, నరేందర్, మధు, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

## మూగజీవాలు తరలిస్తున్న వాహనం పట్టివేత






**నాగిరెడ్డిపేట్,ఏప్రిల్12(ప్రజాజ్యోతి):** అక్రమంగా మూగజీవాలను తరలిస్తున్న వాహనాన్ని ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై భార్గవ్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం. మండలంలోని తాండూర్ మీదుగా అక్రమంగా గోవులను తరలిస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు తాండూర్ గ్రామ శివారులోని వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 10 మూగజీవాలు ఉన్నాయని, ఈ మూగజీవాలు లింగంపేట్ నుండి తాండూర్ మీదుగా సంగారెడ్డి వైపు అక్రమంగా తరలిస్తుండంతో వాహనాన్ని పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు వాహనం డ్రైవర్ సాయిలు ను అదుపులోకి తీసుకొని వాహనంలోని మూగజీవాలను మెదక్ జిల్లా కేంద్రంలోని గోశాలకు తరలించి, డ్రైవర్ సాయిలు యజమాని అబ్దుల్ రహీంలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం
– పేదల పక్షాన ప్రభుత్వం



**రాజంపేట ఏప్రిల్ 12 (ప్రజా జ్యోతి)** రాజంపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించబడింది. రాజంపేట గ్రామానికి చెందిన మేకల మాధురి (భర్త: మహేష్) గారికి కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు జుకంటి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ, పేదల పక్షాన ప్రభుత్వం నిలుస్తోందని, పేదలకు గృహ వసతి కల్పించేందుకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. ప్రజలకు మరింత చేరువయ్యే విధంగా ప్రభుత్వం ఇంకా ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఇందిరమ్మ ఇల్లు కలను నిజం చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సలహాదారుడు మహమ్మద్ అలీ షబ్బీర్ అలీ గారికి, అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు బెస్ట్ చంద్రం, గ్రామ ఉపాధ్యక్షులు మేకల నర్సింలు, సొసైటీ మాజీ డైరెక్టర్ సాయిబాబా, గ్రామ ఇందిరమ్మ కమిటీ సభ్యులు దొబ్బల దుర్గం, గ్రామ కిసాన్ సెల్ అధ్యక్షులు అంద్యాల సురేష్, పందుల చిన్న స్వామి, కుటుంబ సభ్యులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో మెరిసిన సిరికొండ ఆదర్శ విద్యార్థులు
– పిఎం శ్రీ తెలంగాణ ఆదర్శ పాఠశాల ఘన విజయం


MPC II yrD.Sumalatha-819/1000


MPC II yr S. Samyuktha -813 /1000


BPC II yr T. Shruthika - 928/1000


BPC II yr M. Gangothri-831/1000


CEC II yr O. Praveena-809/1000


BPC II yr Divya sree-861/1000


BPC I yrKeerthana-382


MPC I yrG. Nikhitha - 437


MPC I yr Ch. Poojitha- 433

**నిజామాబాద్ రూరల్: ఏప్రిల్, 12 (ప్రజా జ్యోతి)** సిరికొండలోని పిఎం శ్రీ తెలంగాణ ఆదర్శ పాఠశాల మరియు జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచి ఘన విజయాన్ని సాధించారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థులు కార్పొరేట్ కళాశాలలకు ఏమాత్రం తీసిపోకుండా అత్యుత్తమ మార్కులు సాధించి పాఠశాల ప్రతిష్ఠను మరింత పెంచారు.

**ఫలితాల శాతం**
ప్రథమ సంవత్సరంలో 138 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 82 మంది ఉత్తీర్ణులై 60 శాతం ఫలితాన్ని నమోదు చేశారు. ద్వితీయ సంవత్సరంలో 114 మంది హాజరుకాగా 78 మంది ఉత్తీర్ణులై 69 శాతం ఫలితాన్ని సాధించారు.

**టాప్ స్కోరర్లు ప్రథమ సంవత్సరం**
వీూజలో పెంట శ్రీ వందన (453/470) అగ్రస్థానంలో నిలవగా, గుర్రపు నికిత (437), చంద్రపల్లి పూజిత (433), పులి నీతు శ్రీ (403) ప్రతిభ కనబరిచారు. దీఖూజలో టీ. కీర్తన (382/440), జజుజలో లోలపు నేహా (421/500) ఉత్తమ ఫలితాలు సాధించారు.

**ద్వితీయ సంవత్సరం**
దీఖూజలో తోట శృతిక (928/1000) టాప్‌గా నిలవగా, వీూజలో దుమల సుమలత (819), జజుజలో ప్రవీణ (809) మంచి మార్కులు సాధించారు.

**ప్రిన్సిపాల్ అభినందనలు**
విద్యార్థుల కృషి, అధ్యాపకుల అంకితభావమే ఈ విజయాలకు కారణమని ప్రిన్సిపాల్ గడ్డం రాజేష్ రెడ్డి తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత ఫలితాలు సాధించాలని విద్యార్థులను ప్రోత్సహించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మరియు సభ్యులు అభినందించారు.

## కామ్రేడ్ నూర్జహాన్ మరణం కార్మిక ఉద్యమానికి తీరని లోటు
– సిఐటియు కామారెడ్డి జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్





**కామారెడ్డి ప్రతినిధి ఏప్రిల్ 12. (ప్రజాజ్యోతి)** సిఐటియు నిజామాబాద్ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ నూర్జహాన్ (43) అనారోగ్యంతో నిజామాబాద్ పట్టణంలోని వెల్నెస్ హాస్పిటల్లో శనివారం సాయంత్రం ఊపిరితిత్తుల సమస్య, గుండెపోటుతో మృతి చెందారు. ఆదివారం తన స్వస్థలం కామారెడ్డి జిల్లా బాన్సువాడలో కార్యక్రమశీ నిర్వహించడం జరిగింది నూర్జహాన్ మరణం కార్మిక, ప్రజాతంత్ర ఉద్యమానికి తీరని లోటు. నూర్జహాన్ మృతి పట్ల సిఐటియు కామారెడ్డి జిల్లా కమిటీ తీవ్ర సంతాపాన్ని తెలియజేస్తూ శ్రద్ధాంజలి ఘటిస్తున్నది. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది. ఆదివారం బాన్సువాడలో జరిగిన అంతిమ యాత్ర కార్యక్రమంలో భాగంగా పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సిఐటియు కామారెడ్డి జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ మాట్లాడుతూ నూర్జహాన్ ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కార్మిక సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన నాయకురాలు, జిల్లాలో బీడీ కార్మికులు, అంగన్వాడీలు, ఆశాలు, మధ్యాహ్న భోజన కార్మికులు, గ్రామ పంచాయితీ, మున్సిపల్, ఎలక్ట్రిసిటీ, మిషన్ భగీరథ తదితర కార్మికుల సమస్యల పరిష్కారానికై పోరాటాలు సమరశీలంగా నడిపిన మిలిటెంట్ నాయకురాలు. అన్నిరకాల కార్మికులను ఐక్యంగా సంఘటితం చేయడంలో నూర్జహాన్ పాత్ర మరువలేనిది. ఆమె కార్మిక హక్కులు, రక్షణ కోసం అనేక ఉద్యమాలు నడిపింది. నూర్జహాన్ మరణం నిజామాబాద్ జిల్లా కార్మికవర్గానికి, ప్రజాతంత్ర ఉద్యమానికి తీరని లోటు అని అన్నారు. నిజామాబాద్ ట్రేడ్ యూనియన్, ప్రజాతంత్ర ఉద్యమాల నిర్మాణంలో కామ్రేడ్ నూర్జహాన్ ముఖ్యమైన పాత్ర నిర్వహించారని అన్నారు నూర్జహాన్ చిన్ననాటి నుండే వామపక్ష, ప్రజాతంత్ర ఉద్యమాలకు ఆకర్షితురాలై అనేక ప్రజా పోరాటాల్లో పాల్గొన్నారు. తన 8 నెలల పసిబిడ్డతో వరంగల్ సెంట్రల్ జైలులో 18 నెలల పాటు జైలు జీవితం కూడా గడిపింది. పేదలకు ఇళ్ళు, ఇండ్ల స్థలాలు కావాలని చేసిన భూ పోరాటంలో కూడా పోలీసుల కేసులు, నిర్బంధాలను సైతం లెక్కచేయకుండా అలుపెరగని పోరాటం చేసింది. కడదాకా తాను నమ్మిన సిద్ధాంతం కోసం అహర్నిశలు పాటు పడింది. కార్మికవర్గానికి, ప్రజా ఉద్యమాలకు ఆమె లేని లోటు తీరనిది అని అన్నారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా నాయకులు వెంకట్ గౌడ్ కొత్త నరసింహులు మోతి రామ్ నాయక్ అరుణ్ రేణుక బాలమణి దొడ్లమోహన్ రవీందర్ దశరథ్ మంద శ్రీనివాస్ కర్రల సత్యం మహాదేవి గౌరీ పల్లవి మంగాదేవి రాజు కమ్మరి సాయిలు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## నత్త నడకన కొనసాగుతున్న బీటీ రోడ్డు పనులు
– శిలాఫలకం కె పరిమితమైన ఉత్తనూర్ వజపల్లి బీటీ రోడ్డు
– గత సంవత్సరం జూన్‌లో శంకుస్థాపన నేటికీ నత్తనడకన
– ప్రజల క్షేమం కోరని ప్రజాప్రతినిధులు






**సదాశివనగర్, ఏప్రిల్ 12 (ప్రజాజ్యోతి)** సదాశివనగర్ మండలం ఉత్నూరు వజ్జ పల్లి గ్రామాల మధ్య బిటి రోడ్డు పనులు నత్త నడకన కొనసాగుతుంది అని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం జూన్ లో బీటీ రోడ్డు పనులు ప్రారంభమవ్వగా నేటికీ పూర్తి కాలేదు రెండు గ్రామాల ప్రజలు వ్యవసాయ పనుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బ్యాంకు లావాదేవీల కోసం ఈ రోడ్డు మార్గం గుండా వెళుతుంటారు గత సంవత్సరములో పనులు ప్రారంభించగా నేటికీ 10 నెలలు గడుస్తున్న శిలఫలకలకే పరిమితం అయినా పనులు ఎక్కడి గొంగడి అక్కడే వేసినట్టు నత్త నడకన కొనసాగుతున్నాయి. ఎండాకాలం ముగిసి వానకాలం ప్రారంభం అవుతే విత్తనాలు కలుపు మందులు బ్యాంకు లావాదేవీల కోసం తిరుగుతూ ఉంటారు కావున ప్రజల అభిప్రాయార్థం పై అధికారులు గమనించి ప్రజల క్షేమం కోసం నత్త నడకన పనులు పూర్తి చేయించాలని ఇరు గ్రామాల ప్రజలు కోరుచున్నారు ఇకనైనా అధికారులు స్పందించి బీటీ రోడ్డు పనులు పూర్తి చేయించాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## బీబీపేట వాసికి రాష్ట్ర 3వ ర్యాంక్



**బీబీపేట్ ప్రజా జ్యోతి ఏప్రిల్ 12** బీబీపేట మండల కేంద్రానికి చెందిన బ్రాహ్మదండీ లత రాజు ల కుమార్తె బ్రాహ్మదండీ వినూత్న శ్రీ ఆర్యభట్ట కళాశాలలో యం పి సి రెండవ సంవత్సరం చదివి 994/1000 మార్కులతో రాష్ట్రంలో మూడవ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా వినూత్నను న్యూస్ టుడే పలకరించగా తాను రాష్ట్రంలో మూడో ర్యాంకు రావడం చాలా ఆనందకరమని హర్షం వ్యక్తం చేసింది. అలాగే వినూత్న తల్లిదండ్రులు తన కుమార్తె రాష్ట్రంలో మూడవ ర్యాంకు సాధించడం ఎంతో ఆనందమని హర్షం వ్యక్తం చేశారు. తన బిడ్డపై తనకు నమ్మకం ఉన్నట్లు తను ఉన్నత స్థాయికి ఎదగాలని ఆ దేవుడి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని వారు కోరారు.

### మానవత్వం
## చాటుకున్న మియాపురం శశికాంత్



**బాన్సువాడ ఆర్ సి ఏప్రిల్ 12 (ప్రజా జ్యోతి)** బీర్కూరు మండల కేంద్రంలో కాశ బోయిన పీరయ్య కుటుంబ నిరుపేద కావడముతో పీరయ్య ఇంట్లో కార్యక్రమం ఉండడంతో విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు మియాపురం శశి కాంత్ వారి కుటుంబానికి 25 కిలోల బియ్యం పంపిణీ చేశారు .ఈ సందర్భంగా మియాపురం శశికాంత్ మాట్లాడుతూ బీదవారు ఎవరైనా ఆపదలో ఉంటే తనను సంప్రదించాలని అన్నారు తన వంతు సహాయం ఎప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎం పి పి విజయ ప్రకాష్ , కోరిమే రఘు ,ప్రశాంత్, సాయిరాం, బాలకృష్ణ, పృథ్వీ రాజ్, మేఘనాథ్, అశోక్, అజార్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

### రైతు కల్లం అభివృద్ధి
## పనికి సహకరించిన ఎమ్మెల్యే
– రైతు పంట ఆరబోత పనులకు సహకరించిన ఎమ్మెల్యే మదన్మోహన్ రావు



**సదాశివనగర్, ఏప్రిల్ 12 (ప్రజాజ్యోతి)** సదాశివనగర్ మండలం తీర్మాన్ పల్లి గ్రామంలో రైతులు పండించిన పంట ఆరబోత అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మదన్మోహన్ రావు. సహకరించారని ఉప సర్పంచ్ మారా రమేష్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉప సర్పంచ్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటలు ఆరబెట్టడానికి రైతు కళ్ళం లేనందున గ్రామ రైతులు ఎమ్మెల్యే మదన్మోహన్ రావు. ను మర్యాదపూర్వకంగా కలిసి రైతు కళ్ళం అభివృద్ధి పనులు చేపట్టాలని అడగగా వెంటనే స్పందించి రైతు కళ్ళం అభివృద్ధి పనులకు సహకరిస్తానని చెప్పడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లాల్ సింగ్. సుధాకర్ రెడ్డి ముదుపు బలరెడ్డి కావిటి సాయిలు. పైడి తిరుపతిరెడ్డి ఆనందరావు. రాజు. రాజమౌళి. పైడిభైరవరెడ్డి ప్రసాద్. మైసగౌడ్. వీరేశం వెంకయ్య సదానంద రెడ్డి శ్రీనివాస్. హార్వెస్టర్ రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఇంటర్ ద్వితీయ సంవత్సర

## ఫలితాల్లో మెరిసిన ములుగు విద్యార్థినిలు

- 900 దాటిన మార్కులు - అభినందించిన ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం


N అంకిత mpc 904/1000


p శృతి B P C 941/1000


tK నందిని B P C 917/1000


E వైష్ణవి CEC 901/1000

**ములుగు,ఏప్రిల్ 12 (ప్రజా జ్యోతి)** ఆదివారం వెలువడిన ఇంటర్మీడియట్ ప్రథమ,ద్వితీయ సంవత్సర పరీక్ష ఫలితాలలో మండల కేంద్రమైన ములుగు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినిలు ప్రతిభను కనబరిచారు.ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరంలో 83 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 44 మంది(50%) ఉత్తీర్ణత సాధించారు.ఇంటర్ మొదటి సంవత్సరంలో 90 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 19 మంది(21%) విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.కాగా మండల కేంద్రమైన ములుగు గ్రామానికి చెందిన చీ అంకిత ఎంపీసీలో 1000 మార్కులకు గాను 904 మార్కులు,బైపీసీలో ్రా శృతి 941,ఖ నందిని 917,సీఈసీ లో మూడు చింతలపల్లి మండలం కొల్తూరు గ్రామానికి చెందిన జు వైష్ణవి901 మార్కులు సాధించి కళాశాలకే వన్నెతెచ్చారు.ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాలలో మెరిసిన మట్టిలోని మాణిక్యాలను కళాశాల ప్రిన్సిపాల్ శశికళ ఉపాధ్యాయులు అభినందించారు.ఇంటర్ ప్రథమ,ద్వితీయ సంవత్సర ఫలితాల పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## రేషన్ పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు

- అదనపు కలెక్టర్ నాగేష్ హెచ్చరిక



**నర్సాపూర్, ఏప్రిల్ 12 (ప్రజాజ్యోతి)** పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం పంపిణీలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ హెచ్చరించారు. ఆదివారం నర్సాపూర్ పట్టణంలోని పలు ప్రభుత్వ చౌక ధరల దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లను, బియ్యం నిల్వలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం రేషన్ కార్డుదారులతో మాట్లాడి బియ్యం సరఫరా తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. డీలర్లు విధిగా సమయపాలన పాటించాలని, లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా బియ్యం పంపిణీ చేయాలని ఆదేశించారు. రేషన్ బియ్యం పక్కదారి పట్టినా, తూకాల్లో తేడాలు వచ్చినా సహించేది లేదని అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. డీలర్ ఆనంద్ కుమార్, లబ్ధిదారులు తదితరులు ఉన్నారు.

## '60 వేల ఎకరాల్లో' పంటలు ఎండుముఖం

- మంత్రి ఉత్తమ్‌కు ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి లేఖ!
- సింగూరు నీటి విడుదలపై స్పష్టతనివ్వాలని డిమాండ్

**నర్సాపూర్, ఏప్రిల్ 12 (ప్రజాజ్యోతి)** సింగూరు జలాలను తక్షణమే విడుదల చేసి, ఎండిపోతున్న వరి పంటలను కాపాడాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆదివారం ఆమె నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి లేఖ రాశారు. ఘన్‌పూర్ ఆనకట్ట పరిధిలో చివరి తడి అందక సుమారు '60 వేల ఎకరాల్లో పంటలు ఎండుముఖం' పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల మధ్య సమన్వయ లోపంతో నీటి విడుదలపై స్పష్టత కరువైందని, దీనివల్ల అప్పులు తెచ్చి సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. మంత్రి తక్షణమే స్పందించి నీటి విడుదల కోసం లిఖితపూర్వక ఆదేశాలు జారీ చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

## భానుడి భగభగ...

- ఇళ్లలో నుంచి బయటకు రాని జనం
- ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది
- ప్రజలు ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకుంటే చల్లగా ఉంటుంది
- ఎండ నుంచి వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి
- వీలైనంత వరకు ఎండలో తిరగకుండా ఉంటే ప్రజలు బాగుంటుంది
- చిన్నపిల్లలు ఎండల్లో ఆడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి తల్లిదండ్రు






**మనోహరాబాద్, ఏప్రిల్ 1 2 ( ప్రజా జ్యోతి )** భానుడి భగభగతో ఇళ్లల్లో నుంచి బయటకు రావాలంటే జనం జంకుతున్నారు. రోజురోజుకు ఎండ తీవ్రత ఎక్కువ కావడంతో ప్రజలు బయటకు రాకుండా పలు జాగ్రత్తలు తీసుకొని సూచనలు పాటించినట్లయితే ఎండ నుంచి వచ్చే వడదెబ్బ తగలకుండా జాగ్రత్తగా ఉంటారు. ప్రజలు ఎక్కువగా ద్రవ పదార్థాలు తీసుకుంటే వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించవచ్చని పలువురు సూచిస్తున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు ఎండలో ఆడుకోకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. ఎక్కువగా తీరా, నిమ్మరసం, కొబ్బరి నీళ్లు, బట్టర్ మిల్క్ లు, తీసుకున్నట్లయితే ఎండ నుంచి కాపాడుకునే అవసరం ఉంటుందని వడదెబ్బ తగలకుండా ఈ పదార్థాలు ఎంతగానో పనిచేస్తాయని పలువురు అంటున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో గ్రామాల్లో ఆశా వర్కర్లు ఏఎన్ఎంలో ప్రజలకు పలు జాగ్రత్తలు తెలపాల్సిన అవసరం ఎంతైనా ఉంటుందని ప్రభుత్వం చెబుతూనే ఉంది. ఇళ్లలో నుంచి బయటకు వెళ్లేటప్పుడు గొడుగు ధరించాలని ఎండలో ఎక్కువసేపు నిలబడకుండా వీలైనంతవరకు నీడ ఉండేలా చూసి నిలబడేటట్టు కూర్చునేలా వీలు చేసుకోవాలి. రానున్న రోజుల్లో ఎండలు తీవ్రత పెరుగుతుందని సమాచారం. వర్షాలు పడేంత వరకు ఎండ నుంచి వడదెబ్బ తగలకుండా జాగ్రత్త పడాల్సిన అవసరం మన ప్రజలపై ఉంటుందని. వీలైనంతవరకు ప్రజలు చల్లదనం ఉండేటట్లు చూసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## నవ దంపతులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే సునీతా రెడ్డి



**కౌడిపల్లి, ఏప్రిల్ 12 (ప్రజాజ్యోతి)** మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఎస్సీ కానిస్టేబుల్ ఉప్పరి అభిషేకం కుమార్తె సుస్మిత, దినాకర్‌ల వివాహ వేడుక ఆదివారం వైభవంగా జరిగింది. శుభకార్యానికి నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. నూతన దంపతులు నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యేతో పాటు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సారా రామగౌడ్, తిమ్మాపూర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ఉప్పరి సత్యనారాయణ, నాయకులు వెంకాగోని అంజాగౌడ్, మొగులాగౌడ్, శ్రీనివాస్, కిష్టయ్య, సారా ప్రతాప్‌గౌడ్ తదితరులు వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికే సీపీఐ ఇంటింటా ప్రచారం

- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్





**కొమురవెల్లి, ఏప్రిల్ 12 (ప్రజా జ్యోతి):-** ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు కొనసాగిస్తామని సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ పేర్కొన్నారు. సీపీఐ ఇంటింటా ప్రచార కార్యక్రమంలో భాగంగా కొమురవెల్లి, అయినాపూర్ గ్రామాలలో మండల సమితి ఆధ్వర్యంలో ఆదివారం రోజు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రజలు పార్టీ పోరాటాలకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి నిర్మూలన కోసం జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో "దున్నే వాడికి భూమి" అనే నినాదంతో లక్షల ఎకరాల భూములను పేదలకు పంచిన ఘనత సీపీఐకే దక్కిందని తెలిపారు. ఆ పోరాటంలో వేలాది మంది కమ్యూనిస్టులు ప్రాణత్యాగం చేసిన గొప్ప చరిత్ర ఎర్రజెండాకు ఉన్నదని గుర్తు చేశారు.దేశ స్వాతంత్ర్య ఉద్యమం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో కూడా కమ్యూనిస్టులు కీలక పాత్ర పోషించారని, పోలీసు నిర్బంధాలు, జైలు జీవితం ఎదుర్కొంటూ ప్రజల కోసం పోరాడిన చరిత్ర ఉందని చెప్పారు. ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా సీపీఐ పనిచేస్తూ కార్మికులు, రైతు కూలీలు, విద్యార్థులు, నిరుద్యోగ యువత సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహిస్తోందని తెలిపారు.ఈ ప్రాంత ప్రజల చిరకాల డిమాండ్ అయిన రెవెన్యూ డివిజన్ ఏర్పాటు, చేర్యాల నియోజకవర్గ పునరుద్ధరణ కోసం గత పదేళ్లుగా జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమాలు కొనసాగుతున్నప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు అధికార కాంగ్రెస్ పార్టీ నాయకత్వం సీఎం రేవంత్ రెడ్డిని ఒప్పించి తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు ఈరి భూమయ్య, మండల కార్యదర్శి కుడిక్యాల బాల్ మోహన్, సహాయ కార్యదర్శి బూరుగు సత్తయ్య గౌడ్, డివిజన్ నాయకులు వలబోజు నర్సింహాచారి, నంగి కనకయ్య, సుంకోజు రజిత, గూడెపు సుదర్శన్, పోనుగోటి శ్రీనివాస్ రెడ్డి, బింగి పోషయ్య, మల్లం అంజయ్య, ఎస్. వెన్నెల, రమేష్, చంద్రం తదితరులు పాల్గొన్నారు.

## నాటి ప్రభుత్వం భూసేకరణ చేసింది

- తమ ప్రభుత్వం పరిశ్రమలు ఏర్పాటు చేస్తోంది
- పారిశ్రామికంగా అభివృద్ధి చెందితే యువతకు ఉపాధి
- పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- కాంప్రెస్ట్ బయో-గ్యాస్ కంపెనీకి భూమి పూజ
- జూనో జౌల్ బయో ఫ్యూయల్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో
















**నంగునూరు, ఏప్రిల్ 12(ప్రజా జ్యోతి):-** మారుమూల ప్రాంతాలకు పరిశ్రమలు వచ్చినప్పుడే చదువుకున్న యువతకు ఉపాధి లభిస్తుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండల పరిధిలోని నర్మెట పారిశ్రామిక ప్రాంతంలో 210 కోట్లతో వ్యయంతో జునో జూల్ బయో ఫ్యూయల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంప్రెస్ట్ బయో-గ్యాస్ (జదీ+) ప్రాజెక్టుకు ఆదివారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు, రాజ్యసభ సభ్యులు శ్రీ భువనేశ్వర్ కలిత, లోకసభ సభ్యుడు ఎన్ కె ప్రేమ చంద్రన్, మాజీ రాజ్యసభ సభ్యుడు వి హనుమంతరావు మాజీ పార్లమెంట్ సభ్యుడు రాయపాటి సాంబశివరావు, ప్రభుత్వ ఉన్నత అధికారులు శశాంక, నిఖిల్ చక్రవర్తి రిటైర్డ్ అధికారులు వి రమేష్ శ్రీ ఎస్ వి పిళ్ళై లతో కలిసి భూమి పూజలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో 15 రోజుల్లోనే రెండవ పరిశ్రమ ఏర్పాటు ఈ ప్రాంత ప్రజల అదృష్టం అన్నారు. పరిశ్రమల తో పారిశ్రామిక అభివృద్ధి చెందితే తప్ప యువతకు ఉపాధి లేదన్నారు. పార్టీలకతీతంగా అందరూ కలిసికట్టుగా దృష్టి పెడితే ఈ ప్రాంతం అభివృద్ధి చెంది దేశానికే ఆదర్శవంతంగా ఉంటుందన్నారు. నాటి ప్రభుత్వం భూసేకరణ చేస్తే నేటి ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎక్కడ కూడా వివక్ష చూపకుండా పరిశ్రమలను ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఈ రోజుల్లో ప్రతి పౌరుడికి ఇంధనం అవసరం ఉందన్నారు. ఇతర దేశాల నుండి భారతదేశం 65శాతం ఇంధనాన్ని ఎగుమతి చేసుకుంటున్నదన్నారు. యుద్ధం ద్వారా ఇంధనం కొరక ఏర్పడుతోందని,దీంతో యుద్ధం ఆగాలని అందరూ కోరుకుంటున్నారని చెప్పారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ మేక్ ఇన్ ఇండియా అన్న మాదిరిగానే రాష్ట్ర ముఖ్యమంత్రి మేకింగ్ తెలంగాణ నినాదంతో పాలన కొనసాగిస్తున్నారన్నారు. జునో జౌల్ సంస్థ ఇక్కడ పరిశ్రమను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ పరిశ్రమను డిసెంబర్ చివరినాటికి పూర్తి చేసి ఆదర్శంగా నిలవాలని కోరారు. రాష్ట్రంలో ఇలాంటి మరిన్ని గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులను ప్రోత్సహిస్తూ, సిద్దిపేట ప్రాంతాన్ని బయో ఎనర్జీ హబ్ గా మారుస్తామన్నారు. హరీశ్ రావు మాట్లాడుతూ ఈ ప్రాంతానికి బయోగ్యాస్ రావడంతో రైతులకు మేలు జరుగుతుందన్నారు. ఇక్కడ పరిశ్రమల ఏర్పాటుకు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణమే ముఖ్య కారణమన్నారు. జునో జౌల్ బయో ఫ్యూయల్ ప్రైవేట్ లిమిటెడ్ ధైర్యంతో ఇక్కడ కంపెనీ ఏర్పాటు చేయడం శుభ పరిణామం అన్నారు. వ్యవసాయ వ్యర్థాలను ఇంధన గా మార్చడం ద్వారా పర్యావరణ సమస్యను పరిష్కరించడమే కాకుండా రైతులకు, స్థానిక ప్రజలకు కొత్త ఆర్థిక అవకాశాలు కల్పిస్తుందన్నారు.

## ఉడుత ఊపులకు భయపడే వారు ఎవరూ లేరు: ఎంపి

- స్వయం ప్రకటిత మేధావులపై నిప్పులు చెరిగిన రఘునందన్ రావు



**నర్సాపూర్ ఏప్రిల్ 12 (ప్రజాజ్యోతి)** కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, కేసులు పెట్టాలని కోరుతున్న స్వయం ప్రకటిత మేధావులపై మెదక్ ఎంపీ రఘునందన్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న అమిత్ షాపై సుమోటో కేసులు, కోర్టు ధిక్కరణ కేసులు వేయాలంటూ ప్రెస్ మీట్లు పెట్టడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు.

**అర్బన్ నక్సలైట్ల ఆటలు సాగవు**

"దేశంలో నక్సలిజాన్ని తుడిచిపెట్టేందుకు ప్రధాని మోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది. మార్చి 31వ తేదీని కటాఫ్ గడువుగా పెట్టుకుని, ఆ దిశగా 99 శాతం విజయం సాధించింది. అందుకే తమ ఉనికి కోల్పోతున్నామనే భయంతో కొందరు మేధావుల ముసుగులో ఉన్న అర్బన్ నక్సలైట్లు అమిత్ షాపై విషం చిమ్ముతున్నారనీ రఘునందన్ రావు అన్నారు. యువతను తప్పుదోవ పట్టించి నక్సలిజం వైపు మళ్లించాలని చూస్తే ప్రజలు మిమ్మల్ని క్షమించరని హెచ్చరించారు.

**పత్రికా శీర్షికల కోసమే ఈ పాకులాట!**

కేవలం పత్రికల్లో పతాక శీర్షికల కోసం, పబ్లిసిటీ కోసం చట్టాల గురించి అవగాహన లేకుండా మాట్లాడటం మానుకోవాలని ఆయన హితవు పలికారు. బూత్ స్థాయి కార్యకర్త నుంచి దేశాధ్యక్షుడి వరకు ఎవరూ మీ ఉడుత ఊపులకు భయపడబోమని తేల్చి చెప్పారు. చట్టసభల గడప తొక్కని మీరు, పదిమంది కలిసి సంఘాలు పెట్టుకుని ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం సభ్య సమాజానికి చేటన్నారు. నిజంగా మీరు పొరపాటున లేదా తెలియక మాట్లాడి ఉంటే క్షమాపణ చెప్పలని లేదంటే ప్రజలే బుద్ధి చెబుతారనీ గుర్తు చేశారు. కార్యక్రమంలో భాజపా మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సంగసని సురేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాములు ఓబిసి మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు రమేష్ గౌడ్, కౌన్సిలర్లు శ్రీకాంత్, నిరంజన్ దాస్ ఓబీసీ మోర్చా నాయకులు రమేష్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు నారాయణ రెడ్డి, నాగరాజు, జిల్లా కార్యదర్శి అశోక్, భిక్షపతి, జిల్లా కోశాధికారి ఆంజనేయులు గౌడ్, ఓబిసి మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు గుండం శంకర్, పట్టణ అధ్యక్షులు చందయ్యా, మండల అధ్యక్షులు రవి, హరీష్, గిరిజన మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు నాయక్, మహిళా మోర్చా పట్టణ అధ్యక్షులు మదాస్ రాణి, పట్టణ ప్రధాన కార్యదర్శులు రామ్ రెడ్డి, సంగసని రాజు, బీజేపీ నాయకులు యాదగిరి, శ్రీకాంత్, నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### వధూవరులను ఆశీర్వదించిన

## నీలం మధు ముదిరాజ్



**కౌడిపల్లి( ప్రజా జ్యోతి) ఏప్రిల్ 12** మండలంలోని రాజపేట గ్రామానికి చెందిన గాండ్ల పద్మ-చెన్నయ్య దంపతుల కుమారుడు దినాకర్ వివాహం సుస్మితతో ఆదివారం తిమ్మాపూర్‌లో వైభవంగా జరిగింది. ఈ శుభకార్యానికి మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి నీలం మధు ముదిరాజ్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కొత్త జీవితాన్ని ప్రారంభిస్తున్న నూతన దంపతులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. సామాన్యుల కుటుంబాల్లో జరిగే శుభకార్యాల్లో పాల్గొని వారి సంతోషంలో భాగస్వామ్యం పంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. వివాహ వేడుకకు విచ్చేసిన మధుకు వరుని కుటుంబ సభ్యులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటిన ఎస్ఆర్ శ్రీ గాయత్రి విద్యాసంస్థల విద్యార్థులు



**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 11 (ప్రజాజ్యోతి) :** తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల్లో ఎస్ఆర్ శ్రీ గాయత్రి విద్యాసంస్థల విద్యార్థులు విశిష్టమైన ప్రతిభ కనబరిచారు. పటిష్టమైన అకాడమిక్ ప్రణాళిక, విద్యార్థుల నిరంతర కృషి,తల్లిదండ్రులు,అధ్యాపకుల ప్రోత్సాహం వల్ల ఈ అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయని సంస్థ ప్రతినిధులు తెలిపారు. జూనియర్ ఇంటర్ ఫలితాలు... ఎంపీసీ, బైపీసీ,ఎంపీఈసీ, సీఈసీ విభాగాల్లో విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారు. ఎంపీసీ విభాగంలో ఎ.శ్రీ యుక్త (469), డి.సాయి రోహిత్ (468), బి.సహస్ర (468), మహావీర్ (468), కె.ధృశ్విక (468), పి. జీవిత (468) అగ్రస్థానాల్లో నిలిచారు.బైపీసీ విభాగంలో జె.మహా (439), బి.సింధుబాయి (438), వి.శ్రీవాణి (438) ఉత్తమ ప్రతిభ కనబరిచారు.

ఎంపీఈసీ విభాగంలో సవితా కుమారి,దివ్య కచావ్ (496) అత్యధిక మార్కులు సాధించారు. సీఈసీ విభాగంలో ఇ.శివలత,సభబియా ప్రవీణ్ (494) అగ్రస్థానాల్లో నిలిచారు. ఇతర అనేక మంది విద్యార్థులు కూడా మంచి మార్కులు సాధించి సంస్థకు గౌరవం తీసుకువచ్చారు.సీనియర్ ఇంటర్ ఫలితాలు... సీనియర్ ఇంటర్‌లో కూడా విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఎంపీసీ విభాగంలో కె. రోహిణి, సి.హెచ్. ప్రియరెనా రూత్ (996), ఎమ్. స్నిగ్ధ, కె.శ్రీవల్లి (994) అద్భుత ఫలితాలు సాధించారు.బైపీసీ విభాగంలో జోబియా ఫాతిమా (994) ప్రతిభ చూపింది. ఎంపీఈసీ విభాగంలో పి. వికాస్ కుమార్ (992) మంచి ఫలితం సాధించారు.సీఈసీ విభాగంలో రాశి కుమారి, ఎస్.డి. నజీన్ (981) విశిష్ట మార్కులు సాధించారు.ఇంకా అనేక మంది విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ఈ సందర్భంగా ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ, సూక్ష్మ ప్రణాళికతో బోధన అందించడం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని సంస్థ నిర్వాహకులు తెలిపారు.సంస్థ డైరెక్టర్ ఎ. సంతోష్ రెడ్డి, డీజీఎం బి. భగవాన్ రెడ్డి, అకాడమిక్ డీన్ కె. శ్రీనివాస్, జోనల్ ఇన్‌చార్జ్ నరేష్ ప్రిన్సిపాల్‌లు, బోధన మరియు బోధనేతర సిబ్బంది విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

## పాపిరెడ్డి కాలనీ ఫంక్షన్ హాల్ దుస్థితి

**- ప్రజలతో ఆటలాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం!**
**- మారబోయిన రవికుమార్ యాదవ్**




**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 12 (ప్రజాజ్యోతి):** శేరిలింగంపల్లి నియోజకవర్గం లోని పాపిరెడ్డి కాలనీ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌ను, బీఆర్ఎస్ నాయకులు మరబోయిన రవి యాదవ్, బీఆర్ఎస్ కుటుంబ సభ్యులతో కలిసి పరిశీలిం చారు. ఈ ఫంక్షన్ హాల్‌ను కేసీఆర్ ప్రభుత్వ కాలంలో ప్రజల సౌకర్యార్థం నిర్మించగా, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో పూర్తిగా పాడైపోయిన పరిస్థితిలో ఉంది.గత కొంతకాలంగా రవి యాదవ్ ఈ హాల్‌ను శుభ్రపరచి ప్రజల వినియోగానికి అనుకూలంగా మార్చాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ, ప్రస్తుత ప్రభుత్వం మరియు స్థానిక ఎమ్మెల్యే కేవలం రెండు రోజుల క్రితం పైపై శుభ్రత పనులు మాత్రమే చేసి చేతులు దులుపుకున్నారు. ప్రస్తుతం హాల్ పరిస్థితి ఇలా ఉంది: విద్యుత్ సరఫరా పూర్తిగా లేదు, స్విచ్‌బోర్డులు పనిచేయడం లేదు, ఫాంలేవు, ఫాల్స్ సీలింగ్ పూర్తిగా దెబ్బతింది, నీటి సరఫరా లేదు, కిచెన్ పూర్తిగా ఖాళీగా,పాడైన స్థితిలో ఉంది, బాత్‌రూములు అస్వచ్ఛంగా ఉండి దుర్వాసన వస్తోంది.ఇలాంటి దుస్థితిలో ఉన్న హాల్‌ను చూపిస్తూ స్థానిక ఎమ్మెల్యే ఇప్పుడు పెళ్లిళ్లు చేసుకోవచ్చు అని చెప్పడం ఎంత వరకు సమంజసం?ఇదే పరిస్థితిలో ఆదివారం ఒక పెళ్లి కార్యక్రమం నిర్వహించడం ప్రజలపై జరుగుతున్న అన్యాయం కాదా?ఈ సందర్భంగా రవి యాదవ్ తీవ్రంగా స్పందిస్తూ -ప్రజల సౌకర్యాల కోసం నిర్మించిన హాల్‌ను ఈ స్థాయికి తీసుకురావడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం. ప్రజల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే,అని మండిపడ్డారు.ఈ ఫంక్షన్ హాల్‌లో కింది సౌకర్యాలను వెంటనే అందుబాటులో ఉంచాలి: విద్యుత్తు, నీటి సరఫరా, వంటగది పరికరాలు, సమగ్ర మరమ్మతులు, పారిశుధ్య చర్యలు, కాపలాదారు. ప్రజల హక్కులను విస్మరిస్తే, బీఆర్ఎస్ కుటుంబం తరపున పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని రవి యాదవ్ హెచ్చరించారు.

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కౌన్సిలర్ సొంత నిధులతో బోరు ఏర్పాటు

**- వార్డును ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా**
**- కౌన్సిలర్ మనీషా అనంత్ రెడ్డి**



**చేవెళ్ల, ఏప్రిల్ 12(ప్రజా జ్యోతి) :** వార్డులో సమస్యలను పరిష్కరించి ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దడమే లక్ష్యం అని 12వ వార్డు కౌన్సిలర్ అత్తెలి మనీషా అనంత్ రెడ్డి అన్నారు. మల్కాపూర్ 12వ వార్డులో కౌన్సిలర్ అత్తెలి మనిషా అనంత్ రెడ్డి హామీని నిలబెట్టుకున్నారు. ఎన్నికల సమయంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రజలకు ఇచ్చిన మాట మేరకు ఆదివారం తన సొంత నిధులతో కొత్త బోరును త్రవ్వించారు. బోరు ఏర్పాటుతో వార్డు ప్రజలకు ఊరట లభించగా, స్థానికులు కౌన్సిలర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవ చూపుతున్నారని అభినందించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మనీషా అనంత్ రెడ్డి మాట్లాడుతూ.. వార్డులోని సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తూ ఆదర్శవంతమైన వార్డుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి, 4వ వార్డు కౌన్సిలర్ బక్కరెడ్డి మాధవి యాదిరెడ్డి, బీజేపీ నాయకులు డాక్టర్ వైభవ్ రెడ్డి, శర్వలింగం, మాజీ ఎంపీటీసీ రవీందర్ రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, అశోక్, శ్రీకాంత్ రెడ్డి, శేఖర్ రెడ్డి, గణేష్, బక్కారెడ్డి మాణిక్య రెడ్డి, వార్డు ప్రజలు పాల్గొన్నారు.



# పేదింటి పెండ్లికి తాళిబొట్టు కానుక




**- నూతన వధూవరులను ఆశీర్వదించిన గ్రామ సర్పంచ్ పరుశురాం**
**- సర్పంచు,కట్ట మైసమ్మ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు చెప్పిన పెళ్లికూతురు బంధువులు**

**తాండూరు ఏప్రిల్ 12 ప్రజా జ్యోతి :** తాండూరు మండలం సిరిగిరిపేట్ గ్రామంలో జరిగిన పెళ్లి వేడుకలలో పెళ్లికూతురు వివాహానికి తాళిబొట్టు, కాలిమెట్టెలు గ్రామ సర్పంచ్ పరశురాం, కట్ట మైసమ్మ కమిటీ సభ్యులు పెళ్లికూతురు కుటుంబ సభ్యులకు అందజేశారు. గ్రామానికి చెందిన చిందన్ మడుగు గంగమ్మ,శివరాజ్ దంపతుల కూతురు రేణుక వివాహం సిరిగిరిపేట్ గ్రామములోని వీరభద్రేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం రోజు వివాహ వేడుక వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పరిశరాం ను కలిసిన పెళ్లికూతురు తల్లిదండ్రులు గంగమ్మ శివరాజ్ దంపతులు తన కూతురు వివాహానికి కావలసిన అతి ముఖ్యమైన కానుక తాళిబొట్టు, కాలి మెట్టెలు కానుకగా ఇవ్వాలని పెళ్లికూతురు తల్లిదండ్రులు కోరడంతో వెంటనే స్పందించిన గ్రామ సర్పంచ్ పరశురాం, కట్ట మైసమ్మ కమిటీ బృందం సభ్యులతో కలిసి పెళ్లి వేడుకలలో పాల్గొని పెళ్లికూతురు తల్లిదండ్రులకు అందజేశారు. దీంతో ఆ కుటుంబంతో పాటు బంధువులు సన్నిహితులు సంతోషం వ్యక్తం చేశారు.

గ్రామ అభివృద్ధి కోసం పాటుపడుతున్న సర్పంచ్ పరశురాం పేద కుటుంబానికి అండగా నిలిచి అడిగిన వెంబడే తాళిబొట్టును కానుకగా ఇవ్వడం మరవలేని ఘటన అని గుర్తు చేశారు. ఎంతో పవిత్రమైన ఈ కానుక నూతన దంపతులకు ఆశీర్వచనంగా ఉంటుందని గుర్తు చేశారు. దేవాలయంలో జరిగిన పెళ్లి వేడుకలలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు చెప్పారు. ఈ పెళ్లి వేడుకలలో గ్రామ ఉప సర్పంచ్ పప్పి, గ్రామ పెద్దలు వీరప్ప,కుమ్మరి అంజిలప్ప, అల్లాపూర్ సిద్రరామప్ప, బర్తునూర్ గోవింద్,బస్వరాజ్ గౌడ్, అల్లాపూర్ రమేష్,యండి ఖలీల్ పాషా,ఇరు కుటుంబాలకు చెందిన బంధువులు, కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.

# ఉత్తమ ఫలితాలు తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాలకే సొంతం






**- బైపిసిలో రాష్ట్ర స్థాయి ర్యాంక్ సాధించిన నందిని**
**- పేదరికాన్ని జెయించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు**
**- పాఠశాల ప్రిన్సిపల్ శ్రీదేవి**

**తాండూరు ఏప్రిల్ 12 ప్రజాజ్యోతి :** వికారాబాద్ జిల్లా తాండూరు మండలం జినుగూర్తి గ్రామ శివారులోని (పీఎం శ్రీ టీజీఎంస్ తాండూరు) తెలంగాణ ఆదర్శ పాఠశాల,కళాశాల విద్యార్థులు ఇంటర్ పరీక్ష ఫలితాలలో సత్తా చాటారు. 2025- 26 విద్యా సంవత్సరంలో విడుదలైన పరీక్ష ఫలితాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపిసి గ్రూప్ విద్యార్థిని వి నందిని 1000 మార్కులకు గాను 986 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో నిలిచిందని పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓవైపు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఉత్తమ ఫలితాలు సాధించడంతోపాటు రాష్ట్రస్థాయి మార్కులు సాధించి ఆదర్శ పాఠశాల, కళాశాల పేరును నిలిపారని గుర్తు చేశారు.ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో ఈ పూజ అనే విద్యార్థిని 1000 మార్కులకు గాను 945 మార్కులు సాధించింది అన్నారు. అదేవిధంగా బైపిసి విభాగంలో వి నందిని 1000 మార్కులకు గాను 986 మార్కులు సొంతం చేసుకుంది అన్నారు. సిఈసి విభాగంలో జి శైలజ అనే విద్యార్థిని 1000 మార్కులకు గాను 951 మార్కులు సాధించగా ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాలలో ఎంపీసీ విభాగంలో 24 మంది విద్యార్థులకు గాను 18 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. అందులో అర్చన అనే విద్యార్థిని 500 మార్కులకు 438 మార్కులు, మొదటి సంవత్సరం బైపీసీ విభాగంలో 43మంది విద్యార్థులకు గను 35 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు.అదేవిదంగా సిఈసి విభాగంలో 24 మంది విద్యార్థులలో 16 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు.అందులో జి లక్ష్మి అనే విద్యార్థిని 500 మార్కులకు 472 మార్కులు సాధించినట్లు చెప్పారు. కళాశాల విద్యార్థులలో మొత్తం 91 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 69 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. పాఠశాల స్థాయిలో శాతం మేరకు ఉత్తీర్ణత సాధించినట్లు ప్రకటించారు. విద్యార్థులకు చదువుతోపాటు మంచి క్రమశిక్షణ నేర్పించడంతోపాటు ప్రైవేటు పాఠశాలకు దీటుగా బోధన విధానం ఉంటుందన్నారు. మా పాఠశాలలో చదివే అందరి విద్యార్థులు కూడా చదువులో గొప్ప అని ధీమా వ్యక్తం చేశారు.

# ఇంటర్ ఫలితాలలో రెసోనెన్స్ ప్రభంజనం

**- టాప్ 10లో 780 మంది విద్యార్థులు**



**శేరిలింగంపల్లి,ఏప్రిల్ 12 (ప్రజాజ్యోతి):** ఇంటర్ పబ్లిక్ పరీక్షలు-2026 ఫలితాలలో రెసోనెన్స్ జూనియర్ కళాశాలలు ప్రభంజనం సృష్టించాయి. అకడమిక్ క్రమశిక్షణ,అధ్యాపకుల కృషితో ఎంపీసీ,బైపీసీ విభాగాల్లో విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు కైవసం చేసుకున్నారు. ముఖ్యంగా స్టేట్ టాప్ 5లో 345, టాప్ 10లో 780 మంది విద్యార్థులు ఉన్నారు. సీనియర్ ఇంటర్లో రేవంత్ వంగల (994/1000), షేక్ ఐరా జాసియా (995/1000) స్కోరుతో టాపర్లుగా నిలిచారు.ఎంపీసీ, బైపీసీ విభాగాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. కఠోర శ్రమ, అంకితభావం,క్రమశిక్షణతో కూడిన ప్రిపరేషన్తో రెసోనెన్స్ కు గర్వకారణంగా నిలిచారు.రెసోనెన్స్ జూనియర్ కళాశాలల్లోని పటిష్టమైన విద్యా విధానం,నిపుణులైన అధ్యాపకుల మార్గదర్శకత్వం,నిరంతర ప్రోత్సాహానికి ఈ ఫలితాలు నిలువెత్తు నిదర్శనం. ఈ సందర్భంగా రెసోనెన్స్ విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ పూర్ణచంద్రరావు నర్రా మాట్లాడుతూ ఇంటర్ పబ్లిక్ పరీక్షలలో విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారన్నారు. ఈ విజయాలు విద్యార్థుల కృషికి, అధ్యాపకుల అంకితభావానికి, రెసోనెన్స్ జూనియర్ కళాశాలలపై తల్లిదండ్రులకు ఉన్న నమ్మకానికి ప్రతిబింబం అన్నారు. కోర్ సబ్జెక్టులలో వంద శాతం మార్కులు సాధించిన విద్యార్థులు గణనీయమైన సంఖ్యలో ఉన్నారు.జూనియర్ ఇంటర్లో ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు 468 మార్కులు సాధించి అగ్రస్థానంలో నిలిచిన వారు.. కావ్యశ్రీ సవరద్, మీర్జా ఇబ్రహీం అహ్మద్, కనుకుల సస్య రెడ్డి,ఏ నాగ సాయి హిమేష్, ముక్కామల్ల జ్ఞానేశ్వరి, దేశెట్టి సరయు నక్షత్ర, మాలే భావిక, మడపాటి సాహితీ, మేగవత్ వసుంధర, మర్రి జయ చంద్ర, సింగు ఇందు శ్రీ, పరెల్ల బాల త్రిపుర, దారెడ్డి హన్సిక, బీ రాజేందర్, బాలే శ్రీధర్,ఏ నాగార్జున రెడ్డి, బెలుగురీ శ్రీనివాసులు. జూనియర్ ఇంటర్ బైపీసీ విభాగంలో 440 మార్కులకు 437 మార్కులు సాధించి అగ్రస్థానంలో నిలిచిన వారు.. ఆకుల సాయి శివ లాస్య, గెద్ద ధీరజ్ కుమార్, వరాల దుర్గ అంజలి, పొన్నూరి హిమద్యుతి, ఎర్వ అక్షయ, ధమ్మన్నగారి స్నేతిక రెడ్డి, కాశ్వి సర్వే, ప్రణవి మిర్యాల. రెసోనేన్స్ ఫలితాలు.

### ఆర్యవైశ్య సంఘం ఓల్డ్ బోయిన్ పల్లి

# నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం




**బోయిన్ పల్లి, ఏప్రిల్ 12. (ప్రజా జ్యోతి) :** ఆర్యవైశ్య సంఘం ఓల్డ్ బోయిన్ పల్లి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం ఆదివారం అస్మత్‌పేట్‌లోని పటేల్ గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఓల్డ్ బోయిన్ పల్లి మాజీ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఓల్డ్ బోయిన్పల్లి నూతన అధ్యక్షుడు గందె గౌరీ శంకర్ గుప్తాను శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.అనంతరం ప్రధాన కార్యదర్శిగా తాటిపల్లి శ్యాంసుందర్ గుప్తా, కోశాధికారిగా బొమ్మ శ్రీనివాస్ మరియు ఇతర కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలిగా పబ్బ నాగరాణి, కార్యదర్శిగా కాపర్తి లేఖ్య, కోశాధికారిగా మకాం వాణి మరియు మహిళా కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.ఈ కార్యక్రమంలో వాసవి చారిటబుల్ ట్రస్ట్ కమిటీ సభ్యులు ఉప్పల అశోక్ గుప్తా, కందుకూరి నాగిశెట్టి గుప్తా, గాందే రామకృష్ణ గుప్తా, ఎలకంటి సత్యమూర్తి గుప్తా, ఎలకంటి పూర్ణచందర్ గుప్తా, ఫౌండర్ ప్రెసిడెంట్ సివిఎన్ గుప్తా, ఆర్యవైశ్య మహిళా సంఘం ఫౌండర్ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు. కుల సంఘానికి చెందిన మహిళలు, పురుషులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




## నూతన వధూవరులను ఆశీర్వదించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**దౌల్తాబాద్ ఏప్రిల్, 12 (ప్రజాజ్యోతి) :** కొడంగల్ నియోజకవర్గ యువజన అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ పెళ్లికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లా దౌలతాబాద్ మండల కేంద్రంలోని చెన్నకేశవ ఫంక్షన్ హాల్ సరిహద్దులోని హెలిపాడ్ ప్రాంగణనికి చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రికి జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా ఎస్పీ స్నేహ మెహర, ఇతర అధికారులు పలువురు ప్రజాప్రతినిధులు పుష్పగుచ్ఛాలు అందజేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ప్రజాప్రతినిధులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

### కిష్టాపూర్‌లో అంబేద్కర్ జయంతి సందర్భంగా

## భారీ సదస్సు

**నీత పూలే ముఖ్య అతిథిగా హాజరు**



**పరిగి, ఏప్రిల్ 12 (ప్రజా జ్యోతి) :** భారత రాజ్యాంగ నిర్మాత, బహుజన హక్కుల ప్రదాత భారతరత్న డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 14వ తేదీ మంగళవారం కిష్టాపూర్‌లో ఘనంగా సదస్సు అలాగే సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నారు. "అంబేద్కర్ ఆలోచన -- తెలంగాణ ఉద్యమం" అనే అంశంపై ఈ కార్యక్రమం జరుగనుంది. మాతృభూమి అభివృద్ధి సేవా సంస్థ (మాస్) ఆధ్వర్యంలో, తెలంగాణ ఉద్యమ కారుల వేదిక భాగస్వామ్యంతో, కిష్టాపూర్ యువజన సంఘాల నిర్వహణలో ఈ కార్యక్రమం చేపడుతున్నారు. ముఖ్య అతిథిగా మహాత్మా జ్యోతిబా పూలే మునిమనవరాలు నీత పూలే హాజరుకానున్నారు. ఈ సందర్భంగా ఉద్యమకారులు, మేధావులు, యువకులు, ప్రజాసంఘాల తోపాటు అన్ని రాజకీయ పార్టీలకు అతీతంగా పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు ఆనంద్ గౌడ్ (అడ్వకేట్), పోరాటాల రామన్న, విజయకుమార్ రెడ్డి, వెంకట్రాములు, అంతిగారి విద్యాసాగర్, సత్తయ్య, పీర్ మైముద్, రమేష్ గౌడ్, రాజేష్, జేఏసీ రవి,గోవింద్ నాయక్, క్రిష్ణ మహారాజ్, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

## కేవీపీఎస్ మండల కన్వీనర్‌గా మాల జంగయ్య



**చేవెళ్ల, ఏప్రిల్ 12(ప్రజా జ్యోతి) :** కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) చేవెళ్ల మండల కన్వీనర్‌గా మాల జంగయ్యను ఎన్నుకున్నట్లు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ తెలిపారు. ఈ సందర్భంగా అల్లి దేవేందర్ మాట్లాడుతూ.. కుల అసమానతలు, వివక్షకు గురవుతున్న వర్గాల పక్షాన కేవీపీఎస్ నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. ఆత్మగౌరవం, సమానత్వం, కుల నిర్మూలన లక్ష్యాల సాధనకై సంఘం కృషి చేస్తోందని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన ఎన్నో సంవత్సరాలు గడిచినా గ్రామీణ ప్రాంతాల్లో కుల వివక్ష ఇంకా కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని చోట్ల దళితులను దేవాలయాల్లోకి అనుమతించకపోవడం వంటి ఘటనలు జరుగుతున్నాయని అన్నారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన జంగయ్య మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కుల వివక్ష నిర్మూలనకు కట్టుబడి పనిచేస్తానని, సంఘాన్ని బలోపేతం చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో బురాన్ కుమార్, సున్నపు సాయి, శ్రీకాంత్, వినయ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## రామాలయ అభివృద్ధికి కౌన్సిలర్ చేయూత

**- రూ.2.50 లక్షల విరాళం అందజేత**



**చేవెళ్ల, ఏప్రిల్ 12(ప్రజా జ్యోతి) :** దామరగిద్ద గ్రామంలోని శతాబ్దాల చరిత్ర కలిగిన శ్రీరామాలయ అభివృద్ధికి 9వ వార్డు కౌన్సిలర్ తాళ్లపల్లి నర్సింలు చేయూతనిచ్చారు. ఆలయ అభివృద్ధి పనుల కోసం రూ.2.50 లక్షల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ.. దేవాలయాలు ఆధ్యాత్మికతకు నిలయాలుగా నిలుస్తాయని, ప్రజల సౌకర్యార్థం ఆలయాల అభివృద్ధి అవసరమని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని తెలిపారు. ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని సూచించారు. కౌన్సిలర్ అందించిన విరాళంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రెడ్డి శెట్టి మధుసూదన్ గుప్తా, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఢిల్లీ జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

కరీంనగర్ టౌన్ , ఏప్రిల్ 12( ప్రజాజ్యోతి )
ఆదివారం వెలువడిన ఇంటర్మీడియట్ ఫలితాలలో ఢిల్లీ జూనియర్




కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందారు.ఎం పి సి ప్రథమ సంవత్సరంలో ఎం. అబిత 470 మార్కులకు గాను 468 మార్కులు సాధించగా, ద్వితీయ సంవత్సరంలో వి. నర్మత మరియు బి. అక్షయలు 1000 మార్కులకు గాను 992 మార్కులు సాధించి ప్రతిభ చాటుకున్నారు.ఈ సందర్భంగా ఢిల్లీ జూనియర్ కళాశాల మరియు ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ అధినేత కొత్త సతీష్ రెడ్డి విద్యార్థులను అభినందిస్తూ, వారి కృషి, పట్టుదల వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలానే మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## పోచమ్మ తల్లి పునఃప్రతిష్టలో ఎమ్మెల్యే

### శివాలయానికి గ్రానైట్ రాయి అందిస్తానని హామీ
### ఎమ్మెల్యే చేతుల మీదుగా డీమార్ట్ ప్రారంభం

కొడిమ్యాల, ఏప్రిల్ 12,(ప్రజాజ్యోతి):
మండల కేంద్రంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పర్యటించారు. ఈ సందర్భంగా డి-మార్ట్ సూపర్ మార్కెట్‌ను ప్రారంభించారు. అనంతరం శ్రీ లోకమాత పోచమ్మ తల్లి ఆలయంలో నిర్వహించిన పునఃప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి,





భక్తులకు స్వయంగా వడ్డించారు. శివాలయం పునఃప్రతిష్ట నిధుల కొరతతో పెండింగ్‌లో ఉందని భక్తులు తెలియజేయగా, అవసరమైన గ్రానైట్ రాయిని సొంత నిధులతో అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు ఊట్కూరి నరేందర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ గడ్డం జీవన్ రెడ్డి, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కొండూరి రాజేష్, నాయకులు గుడి మల్లిఖార్జున్ రెడ్డి, చిలువేరి నారాయణ, మాజీ ఎంపీపీ మేనేని స్వర్ణలత-రాజనర్సింగ రావు, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కదారి మల్లేశం, ఉప సర్పంచ్ గుర్రం నర్సయ్య, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ అంతరిక్ష యాత్ర దినోత్సవం.

వేములవాడ ఏప్రిల్ 12 ప్రజా జ్యోతి
ఏప్రిల్ 12వ తేదీ రోజున మనము అంతర్జాతీయ అంతరిక్ష యాత్ర దినోత్సవం జరుపుకుంటున్నాము 1961 లో రష్యన్ హ్యోమోగామి యూరిగాగరిన్ చేపట్టిన మొదటి మానవ సహిత రోదసి యాత్రను గుర్తు చేసుకుంటూ అంతరిక్ష పరిశోధనల ప్రాముఖ్యతను శాంతియుత ఉపయోగానికి సాంకేతిక ప్రగతిని ప్రోత్సహించడానికి ఏప్రిల్ 12తేదీ రోజును అంతరిక్షా దినోత్సవం అని జరుపుకొ ట్టున్నాం



ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ ఈ దినోత్సవం అధికారికంగా ప్రకటించింది మానవాళి పురోగతికి అంతరిక్ష విజ్ఞానం ఎలా తోడ్పడుతుందో అవగాహన కల్పించడం కొరకు మరియు నూ తన ఆవిష్కరణ చేయుటకు రా బోవు తరాల వారి కి అభివృద్ధి కొ రకు ఈ రోజును అంతరిక్ష దినోత్సవంగా జరుపుకొనుచున్నాము.

## నిరుపేదల ఆశాకిరణం హందర్ద్ ఫౌండేషన్

### - కోరుట్లలో సేవా కార్యక్రమాలకు ప్రజల ప్రశంసల వెల్లువ

కోరుట్ల,ఏప్రిల్ 12 ప్రజాజ్యోతి
మన సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు అండగా నిలిచి, వారి జీవితాల్లో వెలుగులు నింపే సేవా కార్యక్రమాలు చాలా అరుదుగా కనిపిస్తాయి. అలాంటి అరుదైన సేవా సంస్థలలో కోరుట్ల పట్టణానికి చెందిన హందర్ద్ ఫౌండేషన్ ఒకటి. ఈ ఫౌండేషన్ తమ సేవా భావంతో అనేక కుటుంబాలకు ఆశాకిరణంగా నిలుస్తోంది. ముఖ్యంగా పేదరికం వల్ల ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు అండగా నిలుస్తూ, వారి అవసరాలను తీర్చే దిశగా నిరంతరం కృషి చేస్తోంది.

- పెళ్లికి అండగా నిలిచిన ఫౌండేషన్ రూ.15,000 ఆర్థిక సహాయం

తాజాగా కోరుట్ల పట్టణంలో ఆర్థిక ఇబ్బందులతో పెళ్లి జరపలేక ఇబ్బందులు పడుతున్న ఒక నిరుపేద కుటుంబానికి చెందిన యువతికి హందర్ద్ ఫౌండేషన్ తరపున రూ.15,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సహాయంతో ఆ కుటుంబానికి ఎంతో ఉపశమనం కలిగింది.
ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు మహమ్మద్, వాసిద్, హమీద్, మీర్జా అర్షద్, నవీద్, సిరాజ్, మోసిన్ ల మిత్రబృందం పాల్గొని సహాయాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ, సమాజంలో ఎవరూ ఒంటరిగా అనిపించుకోకుండా, ప్రతి ఒక్కరికీ తోడుగా నిలవడమే మా లక్ష్యం అని తెలిపారు.






- చిన్నారుల భవిష్యత్తుకు బాటలు విద్యా సామగ్రి పంపిణీ

సేవా కార్యక్రమాలను కేవలం ఆర్థిక సహాయంతో మాత్రమే పరిమితం చేయకుండా, విద్యారంగంలో కూడా ఫౌండేషన్ విశేష కృషి చేస్తోంది. ఇప్పటివరకు సుమారు 70 మంది చిన్నారులకు నోటుబుక్స్, పెన్సిల్స్, ప్యాడ్స్ వంటి విద్యా సామగ్రిని పంపిణీ చేసి, వారి చదువుకుతోడ్పడింది.గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో చదువుకు అవసరమైన సామగ్రి లేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులకు ఇది పెద్ద ఉపశమనం కలిగించింది. చిన్నారులలో విద్యపై ఆసక్తి పెంపొందించడంలో ఈ చర్యలు కీలకంగా మారాయి.

- సేవలో ముందంజ యువతకు ఆదర్శం

హందర్ద్ ఫౌండేషన్ సభ్యులు కేవలం సహాయం చేయడం మాత్రమే కాకుండా, సమాజంలో సేవా భావాన్ని పెంపొందించే దిశగా కూడా ముందుకు సాగుతున్నారు. ముఖ్యంగా యువతను సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయిస్తూ, సమాజం పట్ల బాధ్యతను పెంచే ప్రయత్నం చేస్తున్నారు.పేద అమ్మాయిల వివాహాలకు సహాయం చేయడం, అవసర మైన వారికి అండగా నిలవడం వంటి కార్యక్రమాలు ఈ సంస్థను ప్రత్యేకంగా నిలబెడుతున్నాయి.

- స్థానికుల నుంచి ప్రశంసల వెల్లువ

ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలకు కోరుట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి సేవా సంస్థలు సమాజానికి ఎంతో అవసరం. హందర్ద్ ఫౌండేషన్ చేస్తున్న సేవలు మరింత విస్తరించాలని కోరుకుంటున్నాం అని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.అలాగే, ఇలాంటి సేవా కార్యక్రమాలు ఇతర సంస్థలకు కూడా ఆదర్శంగా నిలుస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు.

- భవిష్యత్తులో మరింత సేవా కార్యక్రమాలు

హందర్ద్ ఫౌండేషన్ భవిష్యత్తులో మరింత విస్తృత స్థాయిలో సేవా కార్యక్రమాలు చేపట్టాలని సంకల్పించింది. ముఖ్యంగా విద్య, ఆరోగ్యం, మహిళల సంక్షేమం వంటి రంగాల్లో మరిన్ని కార్యక్రమాలు చేపట్టి, సమాజ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. సమాజంలో పేదలకు అండగా నిలిచి, వారి జీవితాల్లో మార్పు తీసుకురావడం ఒక గొప్ప సేవ. ఆ దిశగా కోరుట్లలో హందర్ద్ ఫౌండేషన్ చేస్తున్న సేవలు నిజంగా ప్రశంసనీయం.ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించి, మరెందరో జీవితాల్లో వెలుగులు నింపాలని కోరుట్ల ప్రజలు



ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

- మిత్రబృందం తో ప్రారంభమైన సేవా యాత్ర

కోరుట్లకు చెందిన యువకులు మహమ్మద్, వాసిద్, హమీద్, మీర్జా అర్షద్, నవీద్, రియాసత్ ల మిత్రబృందంగా ఏర్పడి, సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలను ప్రారంభించారు. స్వచ్ఛమైన సేవా దృక్పథంతో ముందుకు సాగుతున్న ఈ బృందం, నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తోంది

## రెనె లో రోబోటిక్ మోకాలి కీలు మార్పిడి యంత్రం ప్రారంభం

### లక్కీ డ్రా ద్వారా 15 మందికి ఉచిత శస్త్రచికిత్సలు

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 12( ప్రజాజ్యోతి )
జిల్లా కేంద్రంలోని రెనే హాస్పిటల్‌లో ఉత్తర తెలంగాణలోనే తొలిసారిగా అత్యాధునిక రోబోటిక్ మోకాలి కీలు మార్పిడి చికిత్సను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం ఘనంగా ప్రారంభించారు. సుమారు రూ.5 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ రోబోటిక్ సర్జరీ యంత్రాన్ని ఉదయం 10 గంటలకు ప్రారంభించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, జిల్లా కేంద్రాల్లోనే అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి తీసుకువచ్చిన రెనే హాస్పిటల్ యాజమాన్యాన్ని అభినందించారు. ముఖ్యంగా హాస్పిటల్ చైర్మన్ డా. బంగారి స్వామి, డా. రజనీ ప్రియదర్శిని చేస్తున్న సేవలను ప్రశంసించారు. హాస్పిటల్ చైర్మన్ డా. బంగారి స్వామి మాట్లాడుతూ, తమ తల్లిదండ్రులు బంగారి లక్ష్మి , మైసయ్య జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం సుమారు రూ.50 లక్షల విలువైన ఉచిత శస్త్రచికిత్సలను నిర్వహిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని చెప్పారు. రోబోటిక్ మోకాలి కీలు మార్పిడి చికిత్స కోసం నిర్వహించిన లక్కీ డ్రాలో సుమారు 180 మంది నమోదు చేసుకోగా, వారిలో 15 మందిని



ఎంపిక చేసి పూర్తిగా ఉచితంగా శస్త్రచికిత్సలు చేయనున్నట్లు తెలిపారు. మిగతా వారికి తక్కువ ఖర్చుతో చికిత్స అందిస్తామని పేర్కొన్నారు. ఈ లక్కీ డ్రా ప్రక్రియను యూట్యూబ్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేసి పారదర్శకంగా నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తదితర ప్రజాప్రతినిధులు, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది మరియు పేషెంట్లు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితలలో ఆదర్శ కళాశాల విద్యార్థుల

ప్రభంజనం ఇల్లంతకుంట ఏప్రిల్ 12(ప్రజా జ్యోతి)
రాష్ట వ్యాప్తంగా ఈ రోజు విడుదలైన ఇంటర్మీడియట్ పలితలలో రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని రహీంఖాన్ పేట్ ఆదర్శ కళాశాలలో ఇంటర్ ప్రథమ మరియు ద్వితీయ సంవత్సరం విద్యార్థిని విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. మొత్తం ప్రథమ సంవత్సరంలో 97 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా ఉత్తీర్ణులైన వారు 50, పాస్ పర్సంటేజ్ 51.54% ద్వితీయ సంవత్సరంలో 101 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా ఉత్తీర్ణులైన వారు 73, పాస్ పర్సంటేజ్ 72.27% ఉందని ప్రిన్సిపల్ గంగాధర్ తెలిపారు. ప్రథమ సంవత్సరంలో మొదటి ర్యాంక్ సాధించిన
వేములవాడ జ్యోతి MPC 456/470
వేగ్గలం విష్ణుప్రియ BIPC 388/440
గుడెల్లి అలేఖ్య CEC 445/500
ద్వితీయ సంవత్సరంలో
మొదటి ర్యాంకు సాధించిన
దుర్మిట్ల రాకేష్ MPC 978/100
పొన్నం మోక్షిత BPC 948/1000
భూపతి శిరీష CEC 870/1000,ఈ పలితలలో ఉతీర్ణత సాధించిన విద్యార్థులను
ప్రిన్సిపల్ ఉపాధ్యాయులు తల్లిదండ్రులు అభినందనలు తెలియజేశారు.

## ఇందిరమ్మ ఇండ్లతో పేదల సొంతింటి కల సాకారం

### ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం
### ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు

సుల్తానాబాద్ ఏప్రిల్ 12 (ప్రజా జ్యోతి)
పేదల ముఖాల్లో ఆనందం చూడటమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు పేర్కొన్నారు. ఎలిగేడు మండలం బురహన్మియపేట గ్రామంలో నిర్వహించిన ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుజ్జుల రవళి–విజేందర్ రెడ్డి, బొంగోని రమ–సంపత్, గుజ్జుల లావణ్య–ప్రశాంత్ రెడ్డి కుటుంబాలు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ మహోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని ఇండ్లను ప్రారంభించారు. అనంతరం రూ.10 లక్షలతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమం అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. తదుపరి గ్రామ సభలో పాల్గొన్న ఎమ్మెల్యే, నర్సాపూర్ గ్రామంలో కూడా ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలు పేదలను మభ్యపెట్టి ఇళ్ల విషయంలో అన్యాయం చేసిందని విమర్శించారు. పేదలకు సొంతింటి కల నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణలో ఒక్కో ఇల్లు నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని కొనియాడిన ఆయన, మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చివరి దశకు చేరుకుందని, అర్హులైన అందరికీ తదుపరి దశలో ఇండ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.
తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి బీమా సదుపాయం కల్పించేలా ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ పథకాన్ని జూన్ 2న ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తామని స్పష్టం చేశారు.
రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 గ్యాస్ సిలిండర్, సన్నరకం వడ్లకు బోనస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, నూతన రేషన్ కార్డులు, కళ్యాణలక్ష్మి /షాదీ ముబారక్ వంటి పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు.
అదేవిధంగా విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజన పథకాలు, దివ్యాంగ విద్యార్థులకు మోటరైజ్ వాహనాల పంపిణీ వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. రైతులు ఆయిల్ పామ్ సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించిన ఆయన, పంట మార్పిడి ద్వారా అధిక లాభాలు సాధించవచ్చని తెలిపారు.
ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గోపు రజిత లక్ష్మ రెడ్డి, నర్సాపూర్ సర్పంచ్ వెంకటేష్ గౌడ్, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు సమా రాజేశ్వర్ రెడ్డి, దుగ్యాల సంతోష్ రావు తదితరులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## కొండాపూర్‌లో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం ఘనంగా

ముస్తాబాద్, ఏప్రిల్ 12 ( ప్రజా జ్యోతి ):
ముస్తాబాద్ మండల కేంద్రంలోని కొండాపూర్ గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద వెంకట అనసూర్య – బాలకిషన్ దంపతులు నిర్మించుకున్న కొత్త ఇంటికి గృహప్రవేశం కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏళ్ల బాల్ రెడ్డి గారు హాజరయ్యారు. అలాగే మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కొండాపూర్ గ్రామ స్థాయి నాయకులు, జిల్లా నాయకులు, మండల నాయకులు, వివిధ గ్రామాల నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా పేదలకు సొంత ఇల్లు కల సాకారం అవుతుందని తెలిపారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది.





## బ్లాక్ మెయిల్ చేసిన వ్యక్తి అరెస్ట్.

వేములవాడ,ఏప్రిల్,12:ప్రజాజ్యోతి
వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన బ్లాక్ మెయిల్ మరియు ఎక్స్టార్షన్ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన విషయం తెలియజేయబడుచున్నది. తేదీ: 03-04-2026 న, వేములవాడకు చెందిన ఒక సూపర్ మార్కెట్ యజమానికి, గోడిశేల మహేష్ (r/o చంద్రంపేట) అనే వ్యక్తి జర్నలిస్ట్ ముసుగులో పరిచయం ఏర్పరచుకొని, బాధితుడికి చెందిన సూపర్ మార్కెట్ పై అధికారుల తో తనిఖీలు జరిపిస్తానని మరియు పత్రికలో ప్రతికూల వార్తలు ప్రచురిస్తానని బెదిరిస్తూ డబ్బులు డిమాండ్ చేసినాడు.
అతను కత్తి చూపించి ప్రాణహాని బెదిరింపులకు పాల్పడుతూ బాధితుని నుండి మొత్తం రూ.42,000/-ను PhonePe ద్వారా వసూలు చేసుకున్నాడు. అనంతరం మరింత డబ్బులు ఇవ్వాలని తిరిగి తిరిగి ఫోన్



చేసి బెదిరింపులకు పాల్పడుతున్నాడు. ఈ విషయమై బాధితుని ఫిర్యాదు మేరకు వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయబడినది.
విచారణలో భాగంగా, ఈ రోజు ఎస్ఐ రామ్మోహన్ , మరియు కానిస్టేబుల్ గోపాల్ నిందితుడు మహేష్‌ను అరెస్ట్ చేసి, అతని వద్ద నుండి సంబంధిత సాక్ష్యాలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని గౌరవ న్యాయస్థానములో హాజరు పరచగా, కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించబడినాడు.
ఈ సందర్భంగా సిఐ బి. వీర ప్రసాద్ మాట్లాడుతూ, నిందితుడు మహేష్ మరెవరినైనా ఇదే విధంగా బెదిరించి డబ్బులు వసూలు చేసినట్లయితే, బాధితులు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు.
అలాగే, ప్రభుత్వ అధికారుల పేర్లు చెప్పి లేదా ప్రెస్ రిపోర్టర్ల ముసుగులో బెదిరింపు చర్యలకు పాల్పడే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకొనబడతాయని తెలిపారు. ఇదే తరహాలో ఎవరైనా బెదిరిస్తే ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించవలెనని తెలిపారు

## బార్లను తలపిస్తున్న పర్మిట్ రూమ్స్

- నిబంధనలకు విరుద్ధంగా పర్మిట్ రూముల్లో సిట్టింగ్లు
- మాంసాహార విక్రయంతో బార్‌ల మాదిరి నిర్వహణ
- నివాస ప్రాంతాల్లో శాంతిభద్రతలకు భంగం
- అధికారుల నిర్లక్ష్యంపై వెల్లువెత్తుతున్న ఆరోపణలు

రామగిరి, ఏప్రిల్ 12 (ప్రజాజ్యోతి) :
రామగిరి మండలంలోని రిటైల్ మద్యం దుకాణాల వద్ద ఏర్పాటు చేసిన పర్మిట్ రూములు నిబంధనలను బహిరంగంగా ధిక్కరిస్తూ బార్ అండ్ రెస్టారెంట్లకు పోటీగా మారిపోతున్నాయి. ప్రభుత్వం పరిమిత స్థలంలో, మద్యం కొనుగోలు చేసిన వ్యక్తి తాగి వెంటనే వెళ్లిపోవడానికి మాత్రమే అనుమతులు ఇచ్చినప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం పూర్తిగా విరుద్ధ పరిస్థితులు నెలకొని ఉన్నాయి. రిటైల్ మద్యం దుకాణాల యజమానులు పెద్దపెద్ద షెడ్లు నిర్మించి, వరుసగా టేబుళ్లు, బెంచీలు ఏర్పాటు చేసి గంటల తరబడి కూర్చునే విధంగా "సిట్టింగ్" సదుపాయాలు కల్పిస్తున్నారు. కొన్ని చోట్ల పదుల సంఖ్యలో టేబుళ్లు, కూలర్లు ఏర్పాటు చేసి పూర్తిస్థాయి బార్ వాతావరణాన్ని సృష్టించడం గమనార్హం. ఇది పర్మిట్ రూమ్ నిబంధనలకు పూర్తిగా విరుద్ధమైనప్పటికీ ఎక్కడా నియంత్రణ కనిపించడం లేదు. ఇక నివాస ప్రాంతాల మధ్యలోనే ఈ విధంగా మద్యం సేవనానికి అనుకూల వాతావరణం కల్పించడం స్థానికులను తీవ్ర అసౌకర్యానికి గురిచేస్తోంది. రాత్రివేళల్లో మద్యం సేవించిన వ్యక్తుల అల్లర్లు, గొడవలు, అసభ్య ప్రవర్తనతో సమీప కాలనీల్లో శాంతిభద్రతలు దెబ్బతింటున్నాయి.
కుటుంబాలతో నివసించే ప్రజలు భయాందోళనలో జీవించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మహిళలు, వృద్ధులు, పిల్లలు అటువైపుగా బయటకు రావడానికి కూడా భయపడుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. పర్మిట్ రూమ్ పేరుతో పూర్తి స్థాయి ఆహార వ్యాపారం కొనసాగించడం మరో పెద్ద ఉల్లంఘనగా మారింది.
నిబంధనల ప్రకారం కేవలం ప్యాకెడ్ స్నాక్స్ మాత్రమే అనుమతి ఉన్న చికెన్, చేపలు, బోటి, ఆమ్లెట్ వంటి మాంసాహార వంటకాలు యథేచ్ఛగా తయారు చేసి విక్రయిస్తున్నారు. దీంతో ఇవి అనధికారికంగా బార్ అండ్ రెస్టారెంట్లుగా మారిపోతున్న సంబంధిత శాఖ అధికారులు ఏమాత్రం పట్టింపు కనబడడం లేదు. ఈ



వ్యవహారంలో ఎక్సైజ్, పోలీసు శాఖల నిర్లక్ష్యం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. నిబంధనల అమలును పర్యవేక్షించాల్సిన అధికారులు తనిఖీలు నిర్వహించకపోవడం, ఫిర్యాదులు అందిన స్పందించకపోవడం అనుమానాలకు
తావిస్తోంది. బహిరంగంగా నిబంధనలు ఉల్లంఘిస్తున్నప్పటికీ చర్యలు తీసుకోకపోవడం వెనుక "మామూల్లు" వ్యవహారం ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వానికి ఆదాయం పెంచే ఉద్దేశంతో ఇచ్చిన పర్మిట్ రూమ్ అనుమతులు ప్రస్తుతం నియంత్రణ లేని అక్రమాలకు కేంద్రాలుగా మారిపోవడం ఆందోళన కలిగిస్తోంది. నిబంధనలు పుస్తకాలకే పరిమితమై, క్షేత్రస్థాయిలో అమలు కాకపోవడంతో ప్రజల విశ్వాసం దెబ్బతింటోంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ప్రత్యేక తనిఖీలకు ఆదేశాలిచ్చి, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పర్మిట్ రూములపై కఠిన చర్యలు తీసుకోవాలని, నివాస ప్రాంతాల్లో శాంతిభద్రతలను కాపాడాలని స్థానికులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

# గార్లపాటికి ఐకాన్ అవార్డు



**సత్తుపల్లి ఏప్రిల్12(ప్రజా జ్యోతి)** గ్రంధ పాలకునిగా పని చేసిన కాలంలోను,ఉద్యోగ విరమణ అనంతరం తాను చేసిన సాహిత్య సేవకు గుర్తింపుగా గార్లపాటి రామకృష్ణ తెలుగు బుక్ ఆఫ్ ఐకాన్ అవార్డు–2026 అందుకొన్నారు. శుక్రవారం రాత్రి హైదరాబాదు లోని త్యాగరాయ గాన సభలో జరిగిన వేడుకలో గార్లపాటి–బొల్లేపల్లి ట్రస్ట్ తరపున ఈ అవార్డు అందుకున్నారు.పద్మశ్రీ అవార్డీ డాక్టర్ వేలు ఆనంద చారి,కళాబ్రహ్మ శిరోమణి డాక్టర్ వంశీ రామరాజు,అడిషనల్ ట్రాఫిక్ డిసిపి రాందాస్ తెజావత్,తెలుగు బుక్ ఆఫ్ రికార్డు అధినేత డాక్టర్ చింతపట్ల వెంకటాచారి చేతుల మీదుగా గార్లపాటి–బొల్లేపల్లి ట్రస్ట్ తరపున ఈ అవార్డును స్వీకరించారు.కార్యక్రమంలో పాల్గొన్న అతిధులు మాట్లాడుతూ మాతృభాష పరి రక్షణ కొరకు,ముఖ్యంగా విద్యార్థుల కొరకు ట్రస్ట్ తరపున చేస్తున్న కార్యక్రమాలే రామకృష్ణ ఈ అవార్డు ఎంపికకు మూల కారణమయ్యాయని అన్నారు. రామకృష్ణ తోపాటు ఈ కార్యక్రమంలో గార్లపాటి–బొల్లేపల్లి ట్రస్ట్ బాధ్యులు బి.మధుసూదన రాజు, సృజన నిర్వాహకులు పసుపులేటి నాగేశ్వరరావు, సంతోష్ పాల్గొన్నారు. రామకృష్ణకు ఈ సందర్భంగా సత్తుపల్లి మండల విద్యాధికారి ఎన్.రాజేశ్వరరావు, బొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, విశ్రాంత ఉద్యోగ సంఘ ప్రతినిధులు అయ్యదేవరశేషగిరి,మాదిరాజు మాలతి, కేశవరెడ్డి, ప్రకాశరావు, పి.వి.యస్. మల్లికార్జునరావు, తెలుగు ఉపాధ్యాయినులు రమాదేవి, పద్మజ, సత్యనారాయణరెడ్డిలతో పాటు రియాజ్ అభినందనలు తెలిపారు.

# ఇంటర్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ





**నేలకొండపల్లి, ఏప్రిల్ 12 ప్రజా జ్యోతి :** ఇంటర్ మీడియట్ పరీక్ష ఫలితాలలో సింగారెడ్డిపాలెం గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఇంటర్ సెకండ్ హియర్ లో 33 మందికి 900 మార్కులు దాటాయి. సెకండ్ ఎంపీసీ కి చెందిన ధనలక్ష్మి 992 మార్కులు సాధించారు. బైపీసీలో సంజన శ్రీ, 963 మార్కులు సాధించింది. మొదటి సంవత్సరం లో బైపీసీ విద్యార్థి పి.వెన్నీ మరియు అర్చన లు 432 మార్కులు సాదించారు. మొదటి ఎంపీసీ లో మేఘన 446 మార్కులు సాదించారు. సెకండ్ హియర్ లో 95 శాతం, బైపీసీ లో 94 శాతం, మొదటి ఎంపీసీ 58 శాతం, బైపీసీ 72 శాతం ఫలితాలను సాధించారు. అత్యంత ప్రతిభ చూపిన విద్యార్థినులను గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీలత అభినందించారు. అదే విధంగా నేలకొండపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీ లో మొదటి సంవత్సరం లో 246 మందికి 143 మంది 58 శాతం ఉత్తీర్ణత సాధించారు. రెండో సంవత్సరం లో 104 మందికి 69 మంది 66 శాతం ఉత్తీర్ణత సాధించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు అభినందించారు.

# ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి

– జిల్లా కలెక్టర్ అంకిత్

**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 12,(ప్రజా జ్యోతి)** నేడు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని, కావున సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



# బాలికల ఆరోగ్య భవిష్యత్తుకు రక్షణ కవచం

- హెచ్‌పివి వ్యాక్సినేషన్‌లో ఖమ్మం అగ్రగామి
- హెచ్‌పివి టీకా తీసుకొని గర్భాశయ క్యాన్సర్‌ను దూరం చేద్దాం
- సర్వికల్ క్యాన్సర్ నివారణ వాక్సినేషన్‌లో ఖమ్మం ముందంజ
- ప్రజారోగ్య రంగంలో మైలురాయి



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** మహిళల ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేసే వ్యాధుల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ఒకటి. ఈ వ్యాధి కారణంగా ప్రతి సంవత్సరం అనేక కుటుంబాలు బాధను అనుభవిస్తున్నాయి. హెచ్.పి.వివ్యాక్సిన్ అందించడం ద్వారా ఈ ప్రమాదాన్ని ముందుగానే తగ్గించే దిశగా ఖమ్మం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ చేపట్టిన కార్యక్రమం ప్రజారోగ్య రంగంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది.బాలికల ఆరోగ్య రక్షణను ప్రధాన లక్ష్యంగా తీసుకుని అమలు చేస్తున్న ఈ కార్యక్రమం సమాజంలో అవగాహన పెంచడంలో కూడా కీలక పాత్ర పోషిస్తోంది.జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సమర్థ నాయకత్వం,నిరంతర పర్యవేక్షణతో ఖమ్మం జిల్లాలో హెచ్.పి.వి. వ్యాక్సినేషన్ కార్యక్రమం సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతోంది. ప్రతి అర్హత కలిగిన బాలికను గుర్తించి, వారికి వ్యాక్సిన్ అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయడం, ప్రతి దశలో పర్యవేక్షణ జరగడం వల్ల కార్యక్రమం విజయవంతమైంది. ఈ క్రమంలో ఖమ్మం జిల్లా రాష్ట్రంలోనే "జిల్లా ఫస్ట్"గా నిలిచి ప్రత్యేక గుర్తింపు పొందింది.ఏప్రిల్ 10 నాటి నివేదిక ప్రకారం జిల్లాలో ఇప్పటి వరకు 3,040 మంది బాలికలకు వ్యాక్సిన్ అందించడం ద్వారా లక్ష్య సాధన దిశగా దృఢంగా అడుగులుపడుతున్నాయి. ఒకే రోజులో 33 మంది బాలికలకు వ్యాక్సిన్ అందించడం కూడా ఆరోగ్య శాఖ సిబ్బంది కృషిని ప్రతిబింబిస్తోంది. ప్రతి బాలిక ఆరోగ్య భద్రత కోసం పనిచేసిన సమిష్టి కృషి.హెచ్.పి.వి. వైరస్ వల్ల గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ మాత్రమే కాకుండా మరికొన్ని ప్రమాదకర క్యాన్సర్లు కూడా తగ్గుతాయి. ఈ వ్యాక్సిన్ తీసుకోవడం ద్వారా గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్ ను మాత్రమే కాకుండా అనల్,వజైనల్, గొంతు క్యాన్సర్ వంటి సుమారు ఆరు రకాల క్యాన్సర్లు నుంచి రక్షణ పొందవచ్చు. చిన్న వయస్సు (14–15 ఏళ్లలో)లోనే ఈ వ్యాక్సిన్ తీసుకోవడం వల్ల శరీరంలో బలమైన యాంటీబాడీలు ఏర్పడి దీర్ఘకాలిక రోగనిరోధక శక్తి లభిస్తుంది. దీని వల్ల భవిష్యత్‌లో క్యాన్సర్ ముప్పును గణనీయంగా తగ్గించవచ్చు. ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేయడంలో ఖమ్మం జిల్లా ఆరోగ్య శాఖ సమర్థవంతంగా పని చేసింది.ప్రపంచవ్యాప్తంగా అనేకమంది బాలికలు ఈ వ్యాక్సిన్ తీసుకున్న నేపథ్యంలో, ఇది పూర్తిగా సురక్షితమైనదని వైద్యపరంగా నిరూపితమైంది. ఈ విశ్వాసాన్ని ప్రజల్లో పెంపొందించడంలో ఖమ్మం జిల్లా ఆరోగ్య సిబ్బంది కీలక పాత్ర పోషించారు. ప్రారంభంలో ఉన్న సందేహాలను తొలగిస్తూ తల్లిదండ్రులకు స్పష్టమైన అవగాహన కల్పించారు. ఫలితంగా తల్లిదండ్రులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ బాలికలకు వ్యాక్సిన్ వేయించేందుకు ఆసక్తి చూపించారు. ఈ విశ్వాసమే ఈ కార్యక్రమ విజయానికి బలమైన పునాది అయింది.వ్యాక్సినేషన్ ప్రక్రియలో భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వబడింది. వ్యాక్సిన్ తీసుకునే ముందు భోజనం చేయడం తప్పనిసరి చేయడం, తల్లిదండ్రుల సమక్షంలోనే వ్యాక్సిన్ ఇవ్వడం వంటి నియమాలను ఖచ్చితంగా అమలు చేస్తున్నారు. అలాగే అర్హత ప్రమాణాలను స్పష్టంగా తెలియజేసి, అనర్హులకు వ్యాక్సిన్ ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ విధమైన కట్టుదిట్టమైన నియమాలు ప్రజల్లో నమ్మకాన్ని పెంచి కార్యక్రమాన్ని మరింత విజయవంతం చేశాయి.ఈ వ్యాక్సిన్ పూర్తిగా ఉచితంగా అందుబాటులో ఉండటం ఒక ముఖ్యమైన అంశం. ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రితో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్ లలో,24 గంటల వైద్య కేంద్రాల్లో ఈ సేవలు అందుబాటులో ఉన్నాయి. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో నివసించే బాలికలు కూడా ఎటువంటి ఆర్థిక భారం లేకుండా ఈ సేవలను పొందగలుగుతున్నారు. ఆరోగ్య సేవలను ప్రజలకు చేరువ చేయడంలో ఇది ఒక ముఖ్యమైన అడుగుగా నిలిచింది.హెచ్.పి.వి.వ్యాక్సినేషన్ కేవలం వ్యక్తిగత ఆరోగ్యానికి మాత్రమే కాకుండా సమాజ ఆరోగ్యానికి కూడా ఎంతో ఉపయోగకరమైనది. ఎక్కువ మంది వ్యాక్సిన్ తీసుకోవడం వల్ల క్యాన్సర్ భారాన్ని తగ్గించి ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చు. ఈ కార్యక్రమం ద్వారా భవిష్యత్ తరాలకు రక్షణ కల్పించడం సాధ్యమవుతోంది. ఖమ్మం జిల్లా ఈ దిశగా తీసుకున్న చర్యలు ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి.నివారణ చికిత్స కంటే మిన్న అనే సూత్రాన్ని ఆచరణలో చూపిస్తూ ఖమ్మం జిల్లా హెచ్.పి.వి. వ్యాక్సినేషన్ కార్యక్రమం విజయవంతంగా ముందుకు సాగుతోంది. బాలికల ఆరోగ్య భద్రతను ప్రధాన లక్ష్యంగా తీసుకుని చేపట్టిన ఈ కార్యక్రమం ప్రతి కుటుంబానికి నమ్మకాన్ని,భరోసాను అందిస్తోంది.తల్లిదండ్రులు తమ ఆడబిడ్డల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ విజ్ఞప్తి చేస్తోంది.

# మారుమూల గ్రామాలలో సేవలు విస్తృత పరుస్తాం



**నేలకొండపల్లి, ఏప్రిల్ 12 ప్రజా జ్యోతి :** మారుమూల గ్రామాలలో కూడ వాసవి క్లబ్ భక్తరామదాసు కపుల్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో సేవలు విస్తృతంగా చేపట్టనున్నట్లు క్లబ్ ఇంటర్నెషనల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ గజ్జల రామకృష్ణ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన నూతన కార్యవర్గం అధ్యక్షురాలు గా దోసపాటి కల్పన, ప్రధాన కార్యదర్శి గా దేవరశెట్టి స్రవంతి, కోశాధికారి గా దోసపాటి కళ్యాణి లు ప్రమాణాస్వీకారం ఆయన మాట్లాడారు...క్లబ్ ఆధ్వర్యంలో మరింత బలోపేతమైన సేవలు అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మండల ప్రజల కోరిక మేరకు నేలకొండపల్లి మండల కేంద్రంలో క్లబ్ ఆధ్వర్యంలో నూతన బస్టాండ్ ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గవర్నర్ చారుగుళ్ల శ్రీనివాస్, చైర్మన్ రేగూరి హనుమంతరావు, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి రేగూరి వాసవి, రీజయన్ చైర్మన్ గోళ్ల నరసింహారావు, జోన్ చైర్మన్ నాగుబండి శ్రీనివాసరావు, దోసపాటి చంద్రశేఖర్, కొత్తా కరుణ, తెల్లాకుల ఆశోక్, తెల్లాకుల జయశ్రీ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# తమ్మినేని పరామర్శించిన వైద్యులు



**ఖమ్మం రూరల్ ప్రజా జ్యోతి:** ఇటీవల అనారోగ్యానికి గురై తెల్దారుపల్లిలో విశ్రాంతి తీసుకుంటున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రంను హైదరాబాద్ వైద్యులు డాక్టర్ గింజుపల్లి ఉదయ్,శ్రీలక్ష్మీ ఆదివారం పరామర్శించారు.ఈ సందర్భంగా డాక్టర్లు తమ్మినేనికి పలు వైద్య సూచనలు చేశారు.నిత్యం పేదల పక్షాన పోరాడే నాయకులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు డాక్టర్ బత్తినేని వెంకటేశ్వరరావు,గింజుపల్లి మల్లయ్య,సుఖమణి,ధాత్రి తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాలలో బట్ట హారిక ప్రతిభ

**చింతకాని ఏప్రిల్ 12ప్రజాజ్యోతి ప్రతినిధి :** మండల పరిధిలోని జగన్నాధపురం గ్రామానికి చెందిన బట్ట హారిక ఐ/శీ బట్ట (వెంకయ్య – లేటు) తల్లి మమత ముగ్గురు ఆడపిల్లలను కష్టపడుతూ చదివిస్తూ..ఈరోజు మొదటి కుమార్తె ఇంటర్మీడియట్ ఫలితాలలో..



బైపీసీ లో 1000 మార్కులకు 992 మార్కులు సాధించి రాష్ట్రంలోనే అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. హారిక ఐదవ తరగతి నుంచి లచ్చగూడెం కస్తూరిబాయ్ హాస్టల్లో విద్యా భ్యాసం అభ్యసిస్తుంది. ఆదివారం ఇంటర్మీడియట్ బోర్డు విడుదల చేసిన ఫలితాల్లో 992/1000 స్టేట్ ర్యాంక్ సాధించింది.ఇంతటి ప్రతిభ కనపరిచిన హారిక కి బంధువులు స్నేహితులు, జగన్నాధపురం .గ్రామ ప్రజలు,అధ్యాపక బృందం తదితరులు అభినందనలు తెలియజేశారు.

# మోక్షిత్ సాయిని ఆశీర్వదించిన మువ్వా



**సత్తుపల్లి ఏప్రిల్12(ప్రజా జ్యోతి)** తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ చైర్మన్ మువ్వా విజయ్ బాబు అభిమాని సట్టి మహేష్ వారి కుమారుడు మోక్షిత్ సాయి పుట్టినరోజు సందర్భంగా ఆయన ఆశీర్వాదం తీసుకునేందుకు మువ్వా వాటర్ ప్లాంట్ తీసుకొచ్చారు. ఈ సందర్భంగా విజయబాబు కేక్ కట్ చేసి,చిన్నారికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఒకటవ వార్డు కౌన్సిలర్ మట్టా ప్రసాద్,మానసా నాని, దొడ్డా కిషోర్,పుల్లయ్యా,కాంగ్రెస్ నాయకులు, పొంగులేటి,మువ్వా అభిమానులు ఉన్నారు.

# కుదిరితేనే తనిఖీలు..ఆపై సర్దుబాట్లు..

- నెలనెల జీతాలు... పైన ఆమ్యామ్యాలు?
- ఆ శాఖపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత?
- గ్యాస్ కొరతతో హోటల్స్, రెస్టారెంట్లలో కానరాని తనిఖీలు!
- రేషన్ దుకాణాలు, పెట్రోల్ బంక్‌లను చెక్ చేయరా!
- జిల్లాలో ఇల్లందుకు ఏమైనా ప్రత్యేకత ఉందా!
- ఇల్లందుపై అధికారులకు ఎందుకంత ప్రేమ
- అధికారుల పర్యవేక్షణ ఎక్కడ
- మామూళ్ళ మత్తులో తులుతున్న ఆ శాఖ అధికారులు
- జిల్లాలో ఇల్లందు మినహాయించి అన్ని ప్రధాన కేంద్రాల్లోని హోటల్స్, రెస్టారెంట్‌లలో తనిఖీలు
- ప్రత్యేక బృందాలు చేస్తేనే దాడులా?
- స్పష్టం కానీ పౌర సరఫరాల శాఖ అధికారుల తీరు?
- వివరణ అడిగితే ఆకస్మిక తనిఖీలు చేస్తామని బుకాయింపు?
- నిర్వాహకులకు ముందస్తుగా సమాచారం చేరవేరుతుందా?
- జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు జర ఇల్లందుపై దృష్టి సారించరూ!

**ఇల్లందు, ఏప్రిల్ 12, ప్రజా జ్యోతి:** నెలనెలా ప్రభుత్వ జీతాలు తీసుకుంటూ విధులను నిర్లక్ష్యం చేస్తున్న శాఖగా పౌరసరఫరాల శాఖపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రజలకు అత్యవసరమైన రేషన్ బియ్యం, గ్యాస్ సిలిండర్లు, పెట్రోల్ బంకులు ఈ శాఖ పరిధిలో ఉన్నప్పటికీ, పర్యవేక్షణ మాత్రం కనిపించడం లేదు. సాధారణ వినియోగదారులకు గ్యాస్ సిలిండర్ కోసం వారం రోజులు వేచి చూడాల్సి వస్తున్నా, హోటల్స్, రెస్టారెంట్లలో మాత్రం ఎలాంటి కొరత లేకుండా డొమెస్టిక్ సిలిండర్లు వినియోగిస్తున్న దృశ్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. నిబంధనల ప్రకారం కమర్షియల్ సిలిండర్లు వాడాల్సి ఉన్నా, అవి పక్కనపెట్టి డొమెస్టిక్ సిలిండర్లను వినియోగించడం సాధారణంగా మారింది. సంబంధిత అధికారుల పర్యవేక్షణ తనిఖీలు లేకపోవడంతో హోటల్లు రెస్టారెంట్లు ఇష్టానుసారంగా డొమెస్టిక్ సిలిండర్లను వినియోగిస్తూన్నారు. దీనిపై ఉన్నత అధికారుల పర్యవేక్షణ ఎంతైనా అవసరం ఉంది.

**ఇల్లందు మాత్రం మినహాయింపు..?**

జిల్లాలోని ఇతర ప్రధాన కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ కేసులు నమోదు చేస్తున్న అధికారులు, ఇల్లందులో మాత్రం ఇప్పటివరకు ఒక్క దాడి కూడా చేయకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఇల్లందుకు ప్రత్యేక రాయితీలు ఉన్నాయా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**రేషన్ బియ్యం మాఫియా విస్తృతి**

ప్రభుత్వం అందించే సన్నబియ్యం లబ్ధిదారులకు చేరకుండా, మధ్యవర్తులు కిలోకు రూ.12 నుంచి రూ. 15 ఇచ్చి కొనుగోలు చేస్తున్నారని సమాచారం. ఈ దందాపై స్థానిక అధికారులకు తెలియదా, లేక తెలిసీ చర్యలు తీసుకోవడంలేదా అన్నది స్పష్టత లేని అంశంగా మారింది.

**పెట్రోల్ బంకుల్లో సదుపాయాలపై నిర్లక్ష్యం**

పెట్రోల్ బంకుల్లో వినియోగదారులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉన్నా, వాటిపై పర్యవేక్షణ లేకపోవడంతో చాలా చోట్ల కనీస సదుపాయాలు కూడా కనిపించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**సమాచారం ఇస్తే లీక్ అవుతోందా..?**

అక్రమాలపై సమాచారం ఇచ్చిన వారే బయటపడుతున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. సమాచారం ఇచ్చిన వెంటనే నిర్వాహకులకు చేరుతున్నదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**– ఉన్నతాధికారుల జోక్యం అవసరం**









ఇల్లందు పౌరసరఫరాల శాఖ అధికారుల వ్యవహార శైలిపై జిల్లా కలెక్టర్, పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులు ఇల్లందుపై ప్రత్యేక దృష్టి సారించి, ఎలాంటి ముందస్తు సమాచారం, స్థానిక అధికారులకు చెప్పకుండా ఆకస్మిక తనిఖీలు నిర్వహించి అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



## శాంతినగర్‌లో సిలిండర్ పేలుడు..

### నలుగురికి తీవ్ర గాయాలు

ప్రజా జ్యోతి సంగారెడ్డి స్టాఫ్ రిపోర్టర్ :
సంగారెడ్డి పట్టణంలోని శాంతినగర్‌లో జరిగిన గ్యాస్ సిలిండర్ పేలుడు ఘటన తీవ్ర ఆందోళనకు గురిచేసింది. ఈ ప్రమాదంలో సంగమేశ్, మల్లమ్మ, బిందు, చిన్న లకు తీవ్ర గాయాలు అయ్యాయి.







ఘటన చోటుచేసుకున్న వెంటనే స్థానికులు అప్రమత్తమై గాయపడిన వారిని అత్యవసరంగా సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.విషయం తెలుసుకున్న సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. పేలుడు కారణాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు..అనంతరం ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే , వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. గాయాల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని బాధితులను హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించేలా ప్రత్యేకంగా చర్యలు తీసుకున్నారు.ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.భారీగా ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తోంది ...

## గాయని ఆశా భోస్లే కన్నుమూత..

మొదటిపేజీ తరువాయి..



ప్రముఖ నేపథ్య గాయని ఆశా భోస్లే 92 ఏళ్ల వయసులో కన్నుమూశారు. ఆమె 1933 సెప్టెంబర్ 8న మహారాష్ట్రలోని సాంగ్లీలో (అప్పటి బ్రిటిష్ ఇండియాలోని బొంబాయి ప్రెసిడెన్సీలో భాగంగా ఉండేది) జన్మించారు. 2026 ఏప్రిల్ 12న తీవ్రమైన అలసట , గుండెపోటు కారణంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. సంగీత ప్రపంచంలో ఆశా భోంస్లే ఒక గొప్ప శిఖరంను అందుకున్నారు. 1943లో మరాఠీ చిత్రం 'మాఝా బల్'తో తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. 1948లో హిందీ చిత్రం 'చునరియా'తో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టారు. ఇళయరాజా, ఏ.ఆర్. రెహమాన్, బర్మన్ వంటి ఎందరో ప్రముఖ సంగీత దర్శకులతో ఆమె పనిచేశారు. ఆమె సంగీత ప్రపంచంలో అందించిన సేవలకు భారత ప్రభుత్వం 2000లో అత్యున్నత సినీ పురస్కారం దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు, 2008లో దేశ రెండో అత్యున్నత పౌర పురస్కారం పద్మవిభూషణ్‌తో సత్కరించింది. వీటితో పాటు ఆమె అనేక ఫిల్మ్‌ఫేర్ అవార్డులను కూడా అందుకున్నారు. అంతేకాకుండా.. 2013లో 'మాయ్' అనే మరాఠీ చిత్రంలో ఆశా భోస్లే నటించి మెప్పించారు. మరోవైపు భారతరత్న లతా మంగేష్కర్ సోదరి అయిన ఆశా భోంస్లే అంతిమ సంస్కారాలు సోమవారం ముంబైలోని శివాజీ పార్క్‌లో ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నారు.

## మాడు పగిలే మండుటెండలు..

మొదటిపేజీ తరువాయి..

మండలాల్లో తీవ్ర వడగాల్పులు వీచే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. ఇక మంగవారం ఏకంగా 53 మండలాల్లో తీవ్ర స్థాయిలో వడగాలులు వీస్తాయని, ఈ క్రమంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించింది. ఇక రాయలసీమ జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని, ఉత్తరాంధ్ర జిల్లాల్లో వడగాల్పుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని స్పష్టం చేసింది. వడదెబ్బ బారానున్న రెండ్రోజుల పాటు రాష్ట్రంలో తీవ్ర వడగాలులు వీస్తాయని ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ వెల్లడించారు. సోమవారం 51 మండలాల్లో తీవ్ర వడగాలులు ఉంటాయని, ఇక మంగళవారం 53 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 57 మండలాల్లో వడగాలులు వీస్తాయని తెలిపారు. రానున్న రెండు రోజుల వాతావరణం చూస్తే.. కోస్తా, రాయలసీమ జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు, ఉత్తరాంధ్ర జిల్లాల్లో వడగాలులు ప్రభావం ఉంటుందని స్పష్టం చేశారు. ఇక ఆదివారం రాష్ట్రంలో చాలా ప్రాంతాల్లో గరిష్ట స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కడప జిల్లా పొట్టిపాడులో 43.8 డిగ్రీల సెల్సియస్ అత్యధిక ఉష్ణోగ్రత నమోదవ్వగా.. తిరుపతి జిల్లా వరదయ్యపాలెంలో 43.1 డిగ్రీ ఉష్ణోగ్రత నమోదైంది. ఇక నంద్యాల రూరల్ మండలంలో 42.9 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. అయితే ఏప్రిల్‌లోనే రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు తారాస్థాయికి చేరుకోగా.. మే నెలలో ఎండ తీవ్రత మరింత పెరిగే అవకాశాలున్నాయని వాతావరణశాఖ అంచనా వేస్తోంది.ఇక తెలంగాణలో ఈ నెల 22వ తేదీ వరకు భానుడి ప్రతాపం తీవ్ర స్థాయిలో ఉంటుందని హైదరాబాద్ వాతావరణశాఖ తెలిపింది. గరిష్ట ఉష్ణోగ్రతలు 40 నుంచి 45 డిగ్రీల వరకు నమోదవుతాయని స్పష్టం చేసింది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని సూచించింది. బయటకు వెళితే తలకు గ్యాప్, గొడుగు లాంటివి వాడాలని తెలిపింది. ఇక వాటర్, జ్యూస్‌లు లాంటి ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని సూచించింది. ఇక హైదరాబాద్‌లో 40 నుంచి 42 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రానున్న రోజుల్లో ఎండలు మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎండ ప్రభావం క్రమంలో మధ్యాహ్న వేళల్లో రోడ్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

# సేవా తత్పరుడు ఈ.. తుకారాముడు

- పేదలంటే ఆయనకు పంచ ప్రాణం
- రోగులంటే అక్కున చేర్చుకునే తత్వం
- ఆయన సంపాదనలో సగం పేదలకే పంపిణీ
- ఆపదలో ఆదుకునే తత్వం
- పేదవాడే అయినా యువతకు ఆదర్శం

ఆదిలాబాద్ బ్యూరో, ఎప్రిల్ 12, (ప్రజా జ్యోతి):
17వ శతాబ్దపు మహారాష్ట్రకు చెందిన గొప్ప విఠలేశ్వరుని భ క్తుడు సంత్ తుకారాం మహా రాజ్ (1608–1650) మహారా ష్ట్ర లోని





దేహు గ్రామం లో జన్మించిన ఆయన అభంగు లు (భక్తి గీతాలు) పాడటం కీ ర్తనలు చేయడం లో ప్రసిద్ధి చెందారు. అయితే నేడు ఈ 21 వి శతాబ్దం లో పేద ప్రజల ఆత్మీయుడు, సేవాతత్పరు డు బోయ తుకారం తనదైన రీతిలో ఆప్తులకు, ఆపదలో ఉన్న వారికి అండగా ఉంటూ వారికి ధైర్యం నూరి పోస్తూ త నకు తోచిన సహాయ సహ కా రాలు అందిస్తున్నారు. ఆ తు కారాం చూపించిన బాట ను ఎంచుకొని సేవా కార్యక్రమా లు అందిస్తున్నారు. సిరికొండ మండలంలోని రాంపూర్ గూ డ గ్రామానికి చెందిన బోయర్ తుకారాం ఒక సామాన్య పేద కుటుంబంలో జన్మించి తన దై న శైలిలో పేదలకు సేవలు అం దిస్తున్నారు. ఎలాంటి ఆర్థిక ఆ ధారాలు లేనప్పటికీ ఇతరుల వద్ద పాలేరుగా పని చేస్తూనే ఆయన కు వచ్చిన అంతో ఇం తో జీత భత్యం నుంచి సగం పేదలకు వెచ్చిస్తూ తన సేవ లు అందిస్తున్నారు. తుకారాం తల్లి లలిత, తండ్రి హరిదాసు లకు చిన్న కుమారుడు. ఇద్ద రు కుమారులలో ఈ బోయర్ తుకారాం చిన్నవాడు. తుకా రాం తల్లి దండ్రులు వ్యవసా య కూలీ పనులు చేస్తూ వీరి ని పెంచి పెద్ద చేశారు. 32 సం వత్సరాల వయస్సు గల ఈ బోయర్ తుకారాం కేవలం 8 వ తరగతి వరకు మాత్రమే చ దువుకున్నాడు. తుకారాం కు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. అ యినప్పటికీ ఆయన చేసేది చి న్న ఉద్యోగం అయినప్పటికీ తనకు వచ్చిన జీతంలో సగం పేదలకు







వెచ్చిస్తూ తృప్తి చెం దుతున్నాడు. బోయర్ తుకా రాం అందిస్తున్న సేవలను ప లువురు ప్రశం సిస్తున్నారు. ఒక మారుమూల గ్రామంలో జన్మించి ప్రజాసేవ లో నిమగ్న మైన బోయర్ తుకారాం నేటి యువతకు ఆదర్శంగా నిలు స్తున్నారు. బోయర్ తుకారాం ను సేవా మార్గంలో ఆదర్శం గా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు వ్యాఖ్యా నిస్తున్నారు. నేటి యువతకు బోయర్ తుకారం ఆదర్శంగా నిలుస్తున్నారు. పేదవాడికి ఏదైనా కష్టం వచ్చిం దంటే తెలిసిన వెంటనే అక్క డికి వాలిపోయి తనకు తోచి నంత సహాయంచేస్తూ ఉంటా డు. ఆర్థిక సహాయంతో పాటు వైద్య సేవలో సూచనలు సల హాలు తన దైన రీతిలో ఇస్తూ ముందుండి రోగికి, ఆపదలో ఉన్న వ్యక్తికి ధైర్యాన్ని నింపు తాడు. నేనున్నాను అంటూ అభయ హస్తము అందిస్తాడు. కూడు లేని వారికి ఆహార ప దార్థాలు అంద జేస్తాడు. వైద్య సేవలు నిమిత్తం తనకు లభిం చే జీతం నుంచి సగం రోగుల కు వెచ్చిస్తూ తృప్తి చెందుతా డు. ఏమాత్రం ఆశించకుండా నిస్వార్థంగా తన సేవలను విస్తృతం చేస్తున్నాడు.









## ఘనంగా మార్కెట్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

ప్రజా జ్యోతి సంగారెడ్డి స్టాఫ్ రిపోర్టర్,
పటాన్ చెరు, ఏప్రిల్ 12:
అంగరంగ వైభవంగా సాగిన పటాన్ చెరు వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం. పటాన్ చెరు బస్టాండ్ చౌరస్తా లో మంత్రి దామోదర్ రాజనర్సింహకు ఘన స్వాగతం పలికిన నియోజకవర్గ ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్ నాయకత్వం లో వచ్చిన కార్యకర్తలు. భారతరత్న బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వేలాది మంది కార్యకర్తలతో భారీ ర్యాలీ గా వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం వరకు తరలివచ్చిన దామోదర్ రాజనర్సింహ. భారీ ర్యాలీలో మంత్రి దామోదర్ రాజనర్సింహ కి గజ మాలలు వేసి, బాణాసంచా కాల్చి స్వాగతం పలికిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు.భారీ ర్యాలీలో కార్యకర్తలకు అభివాదం చేస్తూ ఉత్సాహం నింపిన మంత్రి దామోదర్ రాజనర్సింహ.పటాన్ చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా యేపూరి శివానందం, వైస్ చైర్మన్ రాజశేఖర్, డైరెక్టర్ల ప్రమాణస్వీకార కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన వ్యవసాయ మార్కెట్ నూతన పాలక వర్గానికి ప్రమాణ స్వీకారం అనంతరం ఘన సన్మాన నిర్వహించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ.. పటాన్ చెరు నియోజకవర్గానికి ఎంతో ఘన చరిత్ర ఉందన్నారు.ఉమ్మడి రాష్ట్రంలో పటాన్ చెరు రాష్ట్రంలోనే అతిపెద్ద పారిశ్రామిక వాడగా గుర్తింపు పొందింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాట శ్రీనివాస్ స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు.







అందరూ కలిసి మెలిసి పని చేయండి పటాన్ చెరు కాబోయే ఎమ్మెల్యే కాట శ్రీనివాసే. పేదవారికి ప్రామాణికమైన విద్య, నాణ్యమైన వైద్యం అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం కాంగ్రెస్ కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీకి అండగా నిలబడ్డది కార్యకర్తలే ఆలస్యం అయినా కాంగ్రెస్ కోసం కష్టపడ్డ కార్యకర్తలకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రజా ప్రభుత్వం రైతు సంక్షేమం, విద్య, వైద్య రంగాలతో పాటు మహిళా సాధికారతకు సీఎం రేవంత్ కట్టుబడి ఉన్నారు. సంగారెడ్డి జిల్లాకి బిహెచ్ఇఎల్, బిడిఎల్, ఓడిఎఫ్, ఐఐటి హైదరాబాద్ తెచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే. ఇందిరమ్మ మెదక్ ఎంపీగా ఉన్నప్పుడు జిల్లా అభివృద్ధి పథంలో నడిచిందన్నారు.ఈ కార్యక్రమంలో టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, పఠాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు , కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు

## నేడు రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి ఆదిలాబాద్ జిల్లా పర్యటన

ఆదిలాబాద్ బ్యూరో, ఎప్రిల్ 12, (ప్రజా జ్యోతి):
నేడు ఆదిలాబాద్ జిల్లాలో తెలంగాణ రాష్ట్ర డిజి పి శివధర్ రెడ్డి పర్యటించను న్నట్లు పోలీసు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9: 00 గంటలకు ఇందిరా




ప్రియదర్శిని స్టేడి యం, "అరైవ్ ఆలైవ్" లో మై టాక్సీ ఇస్ సేఫ్ 500 ఆటో ల తో కార్యక్రమం ఉంటుందని తెలిపారు. 9:30 గంటలకు కమాండ్ కంట్రోల్ సెంటర్ లో జిల్లా వ్యాప్తంగా నూతనంగా ఏర్పాటు చేసిన 400 సీసీటీవీ కెమెరాలు ప్రారంభోత్సవం ఉంటుందని పేర్కొన్నారు.

**ఏ ఆర్ హెడ్ క్వార్టర్స్ లో కార్యక్రమాలు:**
ఉదయం 10 గంటలకు జిల్లా పోలీస్ అధికారులతో సమీక్ష. (అంతర్గత సమావేశం) అనం తరం గతంలో లొంగిపోయిన మావోయిస్టులకు ఇళ్ల స్థలాల పంపిణీ చేయనున్నట్లు తెలి పారు. 10:30 గంటలకు స్కూ లు విద్యార్థులకు ఆపరేషన్ జ్వాలా, ఖాకీ కిడ్స్ ముగింపు కార్యక్రమం ఉంటుందని అనం తరం, హెల్మెట్ల పంపిణీ కార్య క్రమం ఉంటుందని అన్నారు. అమరవీరుల కుటుంబ సభ్యు లతో సమావేశం ఉంటుందని,
11:00 గంటలకు జిల్లాలో మొట్టమొదటిసారిగా ఆర్టీసీ బస్సులు లో "సురక్ష" పేరుతో ఏర్పాటు చేసిన సిసిటివి కెమెరాలను ప్రారంభోత్సవ కార్యక్ర మం ఉంటుందని తెలిపారు.
11:30 గంటలకు మైనర్ డ్రై వింగ్ తల్లిదండ్రులకు కౌన్సిలిం గ్ ఉంటుందని, 12 గంటలకు నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాఫిక్ పార్క్ ప్రారంభోత్సవం,
12 :15 గంటలకు నూతనం గా నిర్మించబడిన ఆదిలాబాద్ ఇంటెలిజెన్స్ కార్యాలయం ప్రా రం భోత్సవం ఉంటుందని తె లిపారు. అదిలాబాద్ రూరల్ మండలంలో చించుఘాట్ గ్రా మం సందర్శన, 1 గంటకు చిం చుఘాట్ గ్రామంలో నూత నం గా ఏర్పాటు చేసిన లైబ్రరీ ప్రా రం భోత్సవం అనంతరం జిల్లా వ్యాప్తంగా గల సార్మేడి లు, ఆ దివాసీల నాయకులతో ఆత్మీ య సమ్మేళన కార్యక్రమం, స మావేశం నిర్వ హిస్తారని పే ర్కొన్నారు.భోజన సమయం గుడి హత్నూర్ మండలంలో ఉంటుందని,2:30 గంటలకు గుడిహత్నూర్ మండలం ఎస్ క న్వెన్షన్ హాల్ వద్ద జిల్లా వ్యా ప్తంగా నెల ట్రాఫిక్ నియమా లు పాటిస్తామనే తీర్మానాలు చేసిన సర్పంచులతో రోడ్ సేఫ్టీ క్లబ్ సభ్యులచే సమావేశం ఉంటుందని తెలిపారు.

**ఉట్నూరు మండలం :**
సోమవారం సాయంత్రం 4 గం టలకు మారుమూల ఆదివాసి గ్రామం నర్సాపూర్ జె గ్రామ సందర్శన అనంతరం గ్రామ స్తుల నీటి అవసరాల కై ఏర్పా టు చేసిన నూతన ఆర్వో వా టర్ ప్లాంట్ ప్రారంభం, చుట్టు పక్కల గ్రామాల 1000 మంది ప్రజలకు వైద్య సేవలను అం దించేందుకు ఉచిత భారీ వై ద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 5 గంటలకు ఉ ట్నూర్ పోలీస్ స్టేషన్ లో డ్రై వింగ్ లైసెన్స్ మేళా లో 200 డ్రైవింగ్ లైసెన్సులు అందజే త ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమాలలో రాష్ట్ర డిజిపి, మల్టీజోన్ 1 ఐజిపి, రాష్ట్ర పీ & ఎల్ ఐజి, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ఇతర ఉన్నత అధికా రులు హాజరవుతారని వివరించారు.

## బెంగాల్‌లో యూసీసీని అమలు చేస్తాం

మొదటిపేజీ తరువాయి..

ఉండేలా చూస్తామని అమిత్ షా హామీ ఇచ్చారు.పశ్చిమ బెంగాల్‌లో అధికారంలోకి వస్తే ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ)ని అమలు చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. ప్రస్తుతం ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాలలో, అస్సాం తర్వాత బీజేపీ ఈ హామీ ఇచ్చిన రెండవ రాష్ట్రం పశ్చిమ బెంగాల్. అయితే, ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రంలో యూసీసీని అమలు చేస్తామని బీజేపీ హామీ ఇవ్వడం ఇదే మొదటిసారి కాదు. జాతీయ స్థాయిలో ఉమ్మడి చట్టాన్ని తీసుకురావాలని భారతీయ జనతా పార్టీ చాలాకాలంగా మాట్లాడుతున్నప్పటికీ, అది ఇంకా కార్యరూపం దాల్చలేదు. ఇటీవల పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ కూడా 'లౌకిక పౌర స్మృతి' గురించి మాట్లాడారు. ఇది వివక్షను తొలగించి, రాజ్యాంగ స్ఫూర్తిని బలోపేతం చేస్తుందని ఆయన పేర్కొన్నారు.బీజేపీకి, యూనిఫాం సివిల్ కోడ్ (యూసీసీ) అంశం దశాబ్దాల తరబడి కొనసాగిన సైద్ధాంతిక నిబద్ధతకు, సంకీర్ణ రాజకీయాల వాస్తవికతకు, అనివార్యతకు నిదర్శనంగా నిలిచింది. యూసీసీతో పాటు రామ మందిరం, ఆర్టికల్ 370 రద్దు అనేవి బీజేపీకి మూడు కీలక సైద్ధాంతిక అంశాలు. మోదీ ప్రభుత్వ హయాంలో బీజేపీ రామ మందిరం, ఆర్టికల్ 370 రద్దు అనే రెండు కీలక సైద్ధాంతిక వాగ్దానాలను నెరవేర్చింది. కానీ, యూనిఫాం సివిల్ కోడ్‌ను అమలు చేయాలన్న మూడవ వాగ్దానం జాతీయ స్థాయిలో నెరవేరలేదు. అందుకే ఆ పార్టీ దీనిని రాష్ట్రాల వారీగా కొనసాగించాలని నిర్ణయించుకుంది. బీజేపీ ఎన్నికల వారీ మేనిఫెస్టోల చరిత్రను పరిశీలిస్తే, "ఒకే దేశం, ఒకే చట్టం" (యూసీసీ) సాధించే మార్గం సులువుగా లేదని తెలుస్తుంది. యూసీసీ దిశగా బీజేపీ ప్రయాణం 1980లలో ప్రారంభమైంది. భారతీయ జనసంఘ్ మార్గాన్ని అనుసరిస్తూ, బీజేపీ యూసీసీని ఆర్టికల్ 44 కింద ఒక రాజ్యాంగ బాధ్యతగా ప్రదర్శించింది. అయితే, 1996 బీజేపీ మేనిఫెస్టోలో యూసీసీని చేర్చినప్పటికీ, సంకీర్ణ పరిమితుల కారణంగా అది 1998 -- 1999 మేనిఫెస్టోలలో లేదు.

Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967